## అయోధ్య రాముడికి సూర్య తిలకం



9


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శనివారం 28 మార్చి 2026 | సంపుటి: 10 | సంచిక: 81 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## 'లాక్‌డౌన్' పెట్టే ఆలోచనే లేదు




2

# అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం

## పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి దంపతులు

భక్తుల తాకిడితో కిక్కిరిసిన భద్రాద్రి క్షేత్రం

రూ. 351 కోట్లతో ఆలయ విస్తరణ తొలిదశ అభివృద్ధి పనులకు రేవంత్ శంకుస్థాపన

శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహణ







**భద్రాచలం, మార్చి 27 (మనం న్యూస్):** భద్రాచలంలోని శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సతీ సమేతంగా ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. భద్రాచలం మిథిలా స్టేడియంలో నిర్వహించిన శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవం వేలాది భక్తుల మధ్య అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి దంపతులు స్వామి, అమ్మ వార్లకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మిథిలా స్టేడియంలో శ్రీ రామచంద్రస్వామి, సీతమ్మ వారికి పూజా కార్యక్రమం, అలంకరణ, తదితర కార్యక్రమాలు నిర్వహించి పెళ్లి కొనసాగించారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలు, వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన కళ్యాణ మహోత్సవం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా అన్ని కార్యక్రమాలను నిర్వహించారు. భద్రాచలం ఆలయం సర్వాంగ సుందరంగా అలంకరించబడగా, భక్తుల రాకపోకలతో క్షేత్రం కిక్కిరిసిపోయింది. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దర్శనం కోసం భారీగా తరలివచ్చారు. భక్తుల రద్దీ దృష్ట్యా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. తాగునీరు, అన్న ప్రసాదం, వైద్య శిబిరాలు, భద్రతా ఏర్పాట్లు

...మిగతా 2లో



### రాముడి తరఫున సీతమ్మకు 108 రకాల పదార్థాలతో సారె

**అమరావతి, మార్చి 27:** అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. కోనసీమ జిల్లాకు చెందిన పేరిచర్ల సత్యవాణి 108 రకాల పదార్థాలతో సీతమ్మకు సారె సమర్పించారు. రాములోరి కల్యాణాన్ని పురస్కరించుకుని వరుడు రాముడు తరఫున వధువు సీతాదేవికి 108 రకాల పదార్థాలతో కంత (సారె) సమర్పించారు. 300 లీటర్ల పాలతో కోవా తయారు చేసి ఆ కోవాతో వివిధ ఆకృతుల్లో పదార్థాలు తయారు చేసి కంతలో ఉంచారు. గోదావరి నది వద్ద జరిగిన రాములవారి కల్యాణ వేడుకలో ఈ సారెను సమర్పించారు.

## బీజేపీకి విరాళాల వెల్లువ

### 2025లో ఆ పార్టీకి రూ.6,074 కోట్ల డొనేషన్స్

ఇతర పార్టీలకన్నా పది రెట్లు అధికం

**ఢిల్లీ, మార్చి 27:** దేశంలో అత్యధిక మొత్తంలో విరాళాలు పొందుతున్న పార్టీగా భాజపా రికార్డు సృష్టించింది. ఒక్క 2025 ఆర్థిక సంవత్సరంలోనే ఆ పార్టీకి రూ.20 వేలను మించిన 5,522 చందాల నుంచి రూ.6,074.015 కోట్ల మేర నిధులు సమకూరాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) తన తాజా నివేదికలో పేర్కొంది. ఈ మొత్తం కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు), నేషనల్ పీపుల్స్ పార్టీలు సహా అన్నీ జాతీయ స్థాయి పక్షాలు కలిసి అందుకున్న విరాళాల కన్నా పది రెట్లు ఎక్కువ అని నివేదిక తెలియజేసింది. బీజేపీ పొందిన నిధుల్లో రూ.5,717.167 కోట్లు కార్పొరేట్ సంస్థల నుంచి అందాయి. కాంగ్రెస్‌కు 2,501 చందాల నుంచి దాదాపు రూ.517 కోట్లు సమకూరాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో దేశంలోని జాతీయ పార్టీలన్నింటికీ కలిపి రూ.6,648.563 కోట్లు విరాళంగా లభించాయి. రాజకీయ పార్టీలు ఒక దాత నుంచి రూ.20 వేల కంటే ఎక్కువ మొత్తం పొందితే అటువంటి విరాళాల మొత్తం గణాంకాలను ఎన్నికల సంఘానికి సమర్పించాలని

...మిగతా 2లో

### ఆ 22 నౌకలొస్తే ఇంధన కష్టాలు తీరినట్లే!

**ఢిల్లీ, మార్చి 27:** హర్మూజ్ జలసంధి వద్ద నిలిచిపోయిన ఆ 22 నౌకలు దేశంలోకి వస్తే మన ఇంధన కష్టాలు తీరుతాయి. వాటిలోని 2.15లక్షల టన్నుల లిక్విడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్జీ), 3.21లక్షల టన్నుల లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ), 16.76 లక్షల టన్నుల ముడిచమురు వస్తే మనం ఇంధన కొరతకు చెక్ పెట్టి ఊపిరి పీల్చుకోవచ్చు. మన దేశానికి ఎల్ఎన్జీ, ఎల్పీజీ, ముడి చమురు తరలిస్తున్న స్వదేశీ, విదేశాలకు చెందిన 22 నౌకలు హర్మూజ్‌లో ఆగిఉన్నాయి. వీటిని సురక్షితంగా తీసుకురావడానికి షిప్పింగ్, నౌకాయాన శాఖ, డైరక్టరేట్ ఆఫ్ నావల్, పెట్రోలియం, సహజవాయువు శాఖ తదితర విభాగాలు సంయుక్తంగా సంప్రదింపులు జరుపుతున్నాయి.




# సజావుగా పెట్రో సరఫరాలు

## జిల్లా, రాష్ట్ర స్థాయిలో కమిటీల ఏర్పాటు

ప్రస్తుతం 1,88,210 కిలో లీటర్ల నిల్వలు

పెట్రోల్, డీజిల్ వాహనాలను ఈవీలుగా మారుస్తున్నం

ప్రధాని మోడీతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 27 (మనం బ్యూరో):** పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాకు సంబంధించి సమీక్షకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో కమిటీని నియమించి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్తితుల నేపథ్యంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

...మిగతా 2లో

### నేడు ఓంకారేశ్వర ఆలయానికి సీఎం శంకుస్థాపన

మంచి రేవుల మూసీ ఒడ్డున

8 ఎకరాల్లో 100 అడుగుల గాలిగోపురం

రూ.334 కోట్లు వ్యయం అవుతుందని అంచనా

2

### కవిత కొత్త పార్టీ డేట్, టైం ఫిక్స్

ఏప్రిల్ 25

జెండా.. అజెండా అన్నీ ఆరోజే

యువత, మహిళలకు పార్టీలో పెద్దపీట

మేం ఎవరికీ బీ పార్టీ కాదు: కవిత వ్యాఖ్యలు

2

## నో టెన్షన్.. ఓన్లీ డిస్కషన్

ఇంధన సంక్షోభం.. రాష్ట్రాల సన్నద్ధతపై ముఖ్యమంత్రులతో మోడీ వర్చువల్ సమీక్ష

**ఢిల్లీ, మార్చి 27:** పశ్చిమాసియాలో ఘర్షణలు, హోర్ముజ్ జలసంధి మూసివేత భయాల కారణంగా అంతర్జాతీయ సంక్షోభం తలెత్తడంతో రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇంధన సంక్షోభంపై చర్చించారు. పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ, ఎరువుల సరఫరాకు ఎదురవుతున్న సమస్యలు, రాష్ట్రాల సన్నద్ధతను సమీక్షించారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రకటించిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు మినహా తక్కిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు

...మిగతా 2లో

**పెట్రో ధరలు పెరగవు!**

### లోకనాయకుడైన శ్రీరాముడు ప్రతి ఒక్కరికీ రోల్ మోడల్

సీతారాంబాగ్‌లో శోభాయాత్ర ప్రారంభంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా



**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహనగరంలో శ్రీరామనవమి శోభాయాత్ర అత్యంత అట్టహసంగా కన్నుల పండువగా సాగింది. శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా శుక్రవారంనాడు శోభయాత్రను ప్రారంభించారు. సీతారాంబాగ్ ఆలయం నుంచి

...మిగతా 2లో

## రాజాసింగ్ రీ ఎంట్రీ?

- బీజేపీ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్
- హింట్ ఇచ్చిన కిషన్ రెడ్డి
- పార్టీ లైన్‌కు లోబడి ఉండాలని షరతు



**హైదరాబాద్, మార్చి 27, (మనం బ్యూరో):** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తిరిగి బీజేపీలో చేరడానికి రంగం సిద్ధమైంది. ఆయన పార్టీలోకి తిరిగి వస్తారని గత కొద్ది రోజులుగా జోరుగా ప్రచారం సాగుతోంది. గత ఏడాది బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు

...మిగతా 2లో

## పశ్చిమాసియాకు తరలుతున్న మరో 10,000 అమెరికా సైనికులు

**వాషింగ్టన్, మార్చి 27:** ఇరాన్‌పై యుద్ధ తీవ్రతను తగ్గిస్తామంటూనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారీగా సైన్యాన్ని పశ్చిమాసియాకు తరలిస్తున్నారు. ఓ వైపు ఇరాన్‌తో చర్చలు జరుపుతూనే మరోవైపు అత్యాధునిక ఫైటర్ జెట్లను, విమాన వాహన నౌకలను పశ్చిమాసియాకు తరలిస్తున్నారు. తాజాగా మరో 10,000 మంది అమెరికా పదాతిదళ సైనికులను మోహరించడానికి అమెరికా రక్షణ శాఖ(పెంటగాన్) సమగ్ర వ్యూహాలను రూపొందించినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం వెలువరించింది. వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం.. పదాతి దళాలతో పాటు పెద్ద మొత్తంలో సాయుధ వాహనాలను కూడా తరలిస్తున్నాయి. ఇప్పటికే పశ్చిమాసియాలో మోహరించి ఉన్న

...మిగతా 2లో



## అమెరికా సైన్యాన్ని ఢీకొట్టేందుకు 10 లక్షల మంది ఇరాన్ బలగాలు సిద్ధం



**టెహ్రాన్, మార్చి 27:** ఇరాన్‌లో భూతల దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వస్తున్న వార్తలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ దాడులను అడ్డుకొనేందుకు ఇరాన్ కూడా సన్నాహాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అందులోభాగంగా 10 లక్షల మందికి పైగా సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సైనికాధికారులను ఉటంకిస్తూ ఆ దేశ మీడియా ఈ

...మిగతా 2లో

## మోడీ.. నేను ఇద్దరమూ 'చేతల' మనుషులమే

మన ప్రధానిపై ట్రంప్ ప్రశంసలు



**ఢిల్లీ, మార్చి 27:** మన ప్రధాని మోడీపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసలు కురిపించారు. మోదీ, తానూ చేతల మనుషులమంటూ వ్యాఖ్యానించారు. అందుకే, భారత్ తో బంధం రానున్న రోజుల్లో మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ ట్రంప్ మాటలను ఢిల్లీలోని యూఎస్ ఎంబసీ ఎక్స్ వేదికగా షేర్ చేసింది. పశ్చిమాసియా

...మిగతా 2లో

# అమెరికా సైన్యాన్ని ఢీకొట్టేందుకు 10 లక్షల మంది ఇరాన్ బలగాలు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

విషయాన్ని వెల్లడించింది. ఓ వైపు చర్చలు కొనసాగుతున్నాయంటూనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియాలో తన సైనిక ఉనికిని విస్తరిస్తున్నారు. ఈ క్రమంలోనే బసిజ్ ఫోర్స్, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్‌తో సహా అనేక విభాగాలు తక్షణమే కదనరంగంలోకి వచ్చేవిధంగా దళాలను బలోపేతం చేస్తున్నట్లు ఇరాన్ సైనిక వర్గాలు పేర్కొన్నాయి. ఇరాన్ నేలపై అమెరికా సైన్యం అడుగుపెడితే వారికి నరకం చూపించేందుకు తమ యోధులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించాయి. స్వచ్ఛందంగా సైన్యంలో చేరతామని బసిజ్ ఫోర్స్, ఐఆర్జీసీలకు యువకుల నుంచి పెద్దఎత్తున అభ్యర్థనలు వస్తున్నట్లు వెల్లడించాయి. ఇదిలాఉండగా.. ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో యుద్ధంలో పాల్గొనేందుకు అర్హత వయసును కూడా ఇరాన్ తగ్గించినట్లు తెలుస్తోంది. 12 ఏళ్ల పిల్లలను సైతం యుద్ధంలో పాల్గొనేందుకు అనుమతివ్వాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీనికి 'ఫర్ ఇరాన్' అని పేరు పెట్టినట్లు వెల్లడించాయి. పెట్రోలింగ్, చెక్ పాయింట్ల దగ్గర వీరిని ఉంచనున్నారు. ఇదిలాఉండగా.. ఇరాన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ సైనిక కొరతను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. అవసరమైన దానికంటే 12వేల మంది తగ్గినట్లు సైనికాధికారులు ప్రభుత్వానికి వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ కొరత కారణంగా ఐడీఎఫ్ కూలిపోయే ప్రమాదం ఉందని.. ఆ సంస్థ చీఫ్ ఆఫ్ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ ఐయాల్ జమీర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో సహా ఇతర ఉన్నతాధికారులకు కూడా ఆయన లేఖ రాశారు.

# పశ్చిమాసియాకు తరలుతున్న మరో 10,000 అమెరికా సైనికులు

(మొదటి పేజీ తరువాయి)

5,000 మంది మెరైన్ ఎక్స్‌పీడిషనరీ యూనిట్(ఎంఈయూ) సభ్యులు, వెయ్యి మంది పారాట్రూపర్లతో కలిసి ఈ సిబ్బంది రంగంలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. గగనతలంలోనే ఫ్యూయల్ నింపుకొనే యుద్ధ విమానాలు, గైడెడ్ క్షిపణి డిస్ట్రాయర్లు పశ్చిమాసియా వైపునకు మళ్లాయి. ఈ దళాలను ఇరాన్‌తో పాటు పర్షియన్ గల్ఫ్‌లోని కీలకమైన ఖర్గ్ ద్వీపం సమీపంలో మోహరించేందుకు అమెరికా సిద్ధమవుతోంది. హర్మూజ్ జలసంధిని తెరిపించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ట్రంప్ సంకేతాలు ఇచ్చారు. మిత్ర దేశాల మద్దతు ఉన్నా, లేకపోయినా కీలకమైన ప్రపంచ నౌకా రవాణా మార్గమైన హర్మూజును తిరిగి తెరిపించడానికి అమెరికా కట్టుబడి ఉందని తెలిపారు.

# మోడీ.. నేను ఇద్దరమూ 'చేతల' మనుషులమే

(మొదటి పేజీ తరువాయి)

ఉద్రిక్తతలు ప్రపంచ దేశాలపై ప్రభావం చూపుతోన్న తరుణంలో అమెరికా నుంచి ఈ స్పందన రావడం గమనార్హం. రెండురోజుల క్రితం మోడీకి ట్రంప్ ఫోన్ చేసిన సంగతి తెలిసిందే. పశ్చిమాసియాలో కొనసాగుతున్న పరిస్థితులపై ఇరువురు నేతలు చర్చించారు. హర్మూజ్ జలసంధిని తెరిచిఉంచాల్సిన ఆవశ్యకత పైనా చర్చించినట్లు అమెరికా రాయబారి సెర్గియో గోర్ 'ఎక్స్' వేదికగా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఆ సంభాషణ గురించి మోడీ కూడా స్పందించారు. వీలైనంత త్వరగా ఉద్రిక్తతలను తగ్గించి, శాంతిని పునరుద్ధరించేందుకు భారత్ మద్దతు ఉంటుందని స్పష్టం చేసినట్లు ఆయన చెప్పారు.

# బీజేపీకి విరాళాల వెల్లువ

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాప్రాతినిధ్య చట్టం చెబుతోంది. రూ.20 వేల కన్నా తక్కువ మొత్తంలో అందిన చందాల వివరాలు బయటపెట్టాల్సిన పనిలేదు. బహుజన్ సమాజ్ పార్టీ తనకు రూ.20 వేలకు మించిన విరాళం ఒక్కటీ అందలేదని ప్రకటించి చేతులు దులుపుకొంది. గడచిన 19 సంవత్సరాలుగా ఆ పార్టీ ఇదే తీరు కొనసాగిస్తోంది. ఆమ్ ఆద్మీ పార్టీకి దాదాపు రూ.27 కోట్లు, నేషనల్ పీపుల్స్ పార్టీకి సుమారు రూ.2 కోట్లు... రూ20 వేలను మించిన చందాల రూపంలో లభించాయి. 2023-24 సంవత్సరంతో పోలిస్తే పార్టీలు 2024-25లో రూ.4,104.285 కోట్లు అధికంగా విరాళాలు గడించాయి. రాజకీయ పార్టీలకు అందుతున్న విరాళాల్లో సింహ భాగం కార్పొరేట్ సంస్థల నుంచే లభిస్తోంది. 2025లో కార్పొరేట్ల నుంచి అందిన వాటా రూ.6,128.787 కోట్లు. మొత్తం విరాళాల్లో ఇది 92.18 శాతం. ఆయా పార్టీలకు 7,900 వ్యక్తిగత చందాల నుంచి సమకూరింది రూ.505.66 కోట్లు మాత్రమే. బీజేపీ రూ.5,717 కోట్లు కార్పొరేట్ల నుంచి అందుకోగా కాంగ్రెస్ ఆ సంస్థల నుంచి దాదాపు రూ.384 కోట్లు విరాళంగా పొందింది. ఆ పార్టీకి 2,357 వ్యక్తిగత విరాళాల నుంచి రూ 132.39 కోట్లు వచ్చాయి. రాజకీయ పార్టీలకు అత్యధిక విరాళాలు అందించిన ట్రస్టుల్లో ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్టు అగ్రభాగంలో నిలిచింది. ఆ సంస్థ బీజేపీకి రూ.2,180 కోట్లు, కాంగ్రెస్‌కు రూ.216 కోట్లు, ఆమ్ ఆద్మీ పార్టీకి రూ.16 కోట్లు విరాళంగా అందించింది. ప్రోగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్టు రూ.834.97 కోట్లు, ఏబీ జనరల్ ఎలక్టోరల్ ట్రస్టు రూ.621 కోట్లు, న్యూ డెమోక్రటిక్ ఎలక్టోరల్ ట్రస్టు రూ.155 కోట్లు.. వివిధ పార్టీలకు చందా ఇచ్చినట్టు ఏడీఆర్ నివేదిక వెల్లడించింది.

# 'లాక్‌డౌన్' పెట్టే ఆలోచనే లేదు

- దానిపై వస్తున్నవన్నీ పుకార్లే
- కేంద్ర ప్రభుత్వం తరపున క్లారిటీ ఇచ్చిన పెట్రోలియం మంత్రి

**ఢిల్లీ, మార్చి 27:** పశ్చిమాసియా పరిణామాల నేపథ్యంలో దేశంలో ఇంధన కొరతపై ఆందోళనలు పెరుగుతున్నందున దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు కిలోమీటర్ల కొద్దీ క్యూ కడుతున్నారు. మరోవైపు 'లాక్‌డౌన్' విధిస్తారన్న భయాందోళనల పుకార్లు శికార్లు చేస్తున్నాయి. ఈ అంశంపై కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ స్పందిస్తూ.. 'లాక్‌డౌన్ ' వార్తలను కొట్టిపారేశారు. ఇంధన లభ్యతకు కేంద్రం చర్యలను వివరిస్తూ వరుస ట్వీట్లు చేశారు. 'అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. ఎనర్జీ, సరఫరా గొలుసు, అత్యవసర సరకు రవాణా వంటి అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. దేశంలో ఇంధన సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. అయితే 'లాక్‌డౌన్ 'పై వినిపిస్తోన్న ఊహాగానాలు పూర్తిగా అవాస్తవం. అలాంటి ప్రతిపాదనేదీ కేంద్ర ప్రభుత్వం వద్ద లేదు. ఇలాంటి వదంతులు సమాజానికి హాని చేస్తాయి.

గందరగోళం సృష్టిస్తాయి. ఈ సమయంలో మనమంతా ప్రశాంతంగా, బాధ్యతాయుతంగా, ఐకమత్యంగా ఉండాలి' అని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.''గత నెల రోజుల్లో అంతర్జాతీయంగా ముడి చమురు బ్యారెల్ ధర 70 డాలర్ల నుంచి 122 డాలర్ల వరకు వెళ్లొచ్చింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. ఆగ్నేయాసియా దేశాల్లో 30-50శాతం, ఉత్తర అమెరికాలో 30శాతం, ఐరోపాలో 20శాతం, ఆఫ్రికా దేశాల్లో 50శాతం మేర ఇంధన ధరలు పెరిగాయి.

కానీ, మన దేశంలో పౌరుల ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ వీటిని పెంచలేదు. అంతేగాక, చమురు కంపెనీల అధిక నష్టాలను తగ్గించేందుకు ప్రభుత్వ పన్ను ఆదాయాన్ని తగ్గించుకున్నాం. అదే సమయంలో విదేశాలకు ఎగుమతి చేసే ఇంధనంపై ఎగుమతి పన్ను విధించాం' అని పురీ వెల్లడించారు.

# నేడు ఓంకారేశ్వర ఆలయానికి సీఎం శంకుస్థాపన

**హైదరాబాద్, మార్చి 27 (మనం బ్యూరో):** గండిపేట మండలం మంచిరేవులలో మూసీ ఒడ్డున ఓంకారేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇక్కడి వీరభద్రస్వామి-మచిలేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో శనివారం ఉదయం 8. 30 కు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ ఎండీ నర్సింహ్మా రెడ్డి, చీఫ్ ఇంజినీర్ సురేష్ కుమార్ ఇప్పటికే పనులను పర్యవేక్షించారు. ఈ ఆలయ నిర్మాణంలో భాగంగా దారి పొడవునా కొత్త ఆలయ నమూనా చిత్రాలను, మూసీ అభివృద్ధి పనుల వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. రహదారులు, వీరభద్రస్వామి దేవాలయం, గుట్ట పరిసరాలను సైబరాబాద్ నగరపాలక సంస్థ శుభ్రం చేయిస్తోంది. ఓంకారేశ్వర స్వామి దేవాలయం 8 ఎకరాల్లో నిర్మాణం అవుతుంది. గాలి గోపురం 100 అడుగుల ఎత్తున ఉంటుంది. రామప్ప మందిరం, యాదాద్రి దేవాలయ నిర్మాణంలో వాడిన రాయిని ఉప యోగించాలని నిర్ణయించారు. గాలి గోపురం నుంచి లోపలికి ప్రవేశించాక చుట్టూ సాంస్కృతిక కార్యక్ర మాలు, హోమాలు, పూజల నిర్వహణకు అవసరమైన మండపాలు ఉంటాయి. లోపల 207 అడుగుల పొడ వైన ప్రధాన మండపం నిర్మిస్తారు. మూడంతస్తుల్లో పార్కింగ్ ఉండనుంది. దేవాలయ నిర్మాణానికి మొత్తం రూ.334 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. మూసీలోని దీవిపై 100 అడుగుల శివుని విగ్రహం, అక్కడి నుండి గుట్టపైకి తీగల వంతెనను నిర్మించనున్నారు. ఇందుకు గాను రూ.130 కోట్లు వ్యయం అవుతుందని ప్రాథమికంగా నిర్ణయించారు.

# సజావుగా పెట్రో సరఫరాలు

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం పలు అంశాలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీఎస్ ఆధ్వర్యంలో కమిటీ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని తెలిపారు. 33 జిల్లాల్లోనూ గ్యాస్ సరఫరా, పెట్రోల్, డీజిల్ విక్ర యాలు, బ్లాక్ మార్కెట్ నిరోధానికి కమిటీలు ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించినట్లు తెలి పారు. ప్రాధాన్య క్రమంలో అసుపత్రులు, పాఠశా లలు, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు గ్యాస్ సిలిండర్లకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

ప్రతి బంకులో స్టాక్ ఎంత ఉంది ? ఎంత విని యోగిస్తున్నారనే దానిపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారనీ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సాధారణ రోజుల్లో రోజుకు 36,189 కి.లీ.ల పెట్రోల్, డీజిల్ వినియోగం జరుగుతోందనీ, ప్రస్తుతం 1, 88, 210 కి.లీ.ల నిల్వలు ఉన్నట్లు వివ రించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతపై సోషల్ మీడియాలో అపోహలు, భయాందోళనలు కలిగేలా పోస్టులు పెడుతున్న వారిపై కఠిన చర్యలు చేపడుతు న్నట్లు తెలిపారు. తెలంగాణలో శిలాజ ఇంధనాలపై ఆధారపడటం తగ్గించిఎలక్ట్రిక్ వాహనాల వినియో గాన్ని ప్రోత్సహిస్తున్నామనీ సీఎం రేవంత్ రెడ్డి తెలి పారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఈవీలపై వంద శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ పన్ను మినహాయించా మన్నారు. ఈవీల తయారీ, బ్యాటరీ ఎకోసిస్టమ్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లారు.

హైదరాబాద్ నగరంలో ఉన్న 1.20 లక్షలకు పైగా పెట్రోల్, డీజిల్ ఆటోలరు రెట్రో ఫిట్టింగ్ ద్వారా ఈవీలుగా మార్చే ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు తెలి పారు. ఆర్టీసీలో ఇక ముందు అన్ని ఈవీ బస్సులనే వినియోగించనున్నట్లు సీఎం ఈ సందర్భంగా ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి పాల్గొన్నారు.

## లోకనాయకుడైన శ్రీరాముడు ప్రతి ఒక్కరికీ రోల్ మోడల్

(మొదటి పేజీ తరువాయి)

కోఠి హనుమాన్ వ్యాయామశాల వరకు శోభాయాత్ర సాగింది. శోభాయాత్రను ప్రారంభించిన అనంతరం గవర్నర్ శుక్లా మాట్లాడుతూ... ఏళ్ల తరబడి నగరంలో శ్రీరామ శోభాయాత్ర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. భారతీయ సంస్కృతిలో రామాయణానికి చాలా విశిష్టత ఉందని ఆయన అన్నారు. లోక నాయకుడైన శ్రీరాముడిని ప్రతి ఒక్కరూ ఆదర్శ కుమారుడు, ఆదర్శ భర్త, ఆదర్శ పురుషుడుగా అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా ప్రజలను కోరారు. ఐకమత్యం, భక్తిభావనకు శోభాయాత్ర నిదర్శనంగా నిలుస్తోందని గవర్నర్ అన్నారు.

# నో టెన్షన్.. ఓన్లీ డిస్కషన్

(మొదటి పేజీ తరువాయి)

ఈ వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. దేశ ఇంధన అవసరాలను తీర్చేందుకు, ఇంధన సరఫరా స్థిరంగా ఉండేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది. అయితే క్షేత్రస్థాయిలో అమలు కోసం రాష్ట్రాల సహకారాన్ని ఇప్పటికే కోరింది. పశ్చిమాసియాలో పరిస్థితుల ప్రభావం అంతర్జాతీయంగా అన్ని దేశాలపై పడిందని, భారత్‌పైనా ప్రభావం ఉందని ప్రధాని మోదీ పార్లమెంటు ఉభయసభల్లోనూ ప్రకటించారు. కోవిడ్ మహమ్మారిని సమష్టిగా ఎదుర్కొన్నట్టే తాజా పరిస్థితులను కేంద్రం, రాష్ట్రాలు కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. నిత్యావసర వస్తువుల సరఫరాకు ఎలాంటి అవాంతరం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్రాలను కోరారు. టీమిండియా స్పిరిట్‌తో పనిచేసి దేశానికి మారదర్శకంగా నిలవాలని ప్రధాని సీఎంలకు సూచించారు.

**బ్లాక్ మార్కెటింగ్‌పై ఉక్కు పాదం మోపాలె**

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో నిర్వహించిన వర్చువల్ భేటీలో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ.. సంక్షోభం దృష్ట్యా భద్రతకు విద్రోహ శక్తులు విఘాతం కలిగించే ప్రమాదం ఉందన్నారు. తీర ప్రాంతాలు, సరిహద్దుల వద్ద భద్రత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. తప్పుడు సమాచారం వ్యాప్తి చేసేవారిపైన, బ్లాక్ మార్కెటింగ్కు పాల్పడే వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

# పెట్రో ధరలు పెరగవు!

## పెట్రో ఉత్పత్తులపై ఎక్సైజ్ డ్యూటీ తగ్గించిన కేంద్రం

**ఢిల్లీ, మార్చి 27:** పశ్చిమాసియాలో యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొన్నవేళ భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొంది. పెట్రోల్, డీజిల్ విధిస్తున్న అదనపు ఎక్సైజ్ డ్యూటీని భారీగా తగ్గించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ గురువారం అర్ధరాత్రి నోటిఫికేషన్ విడుదల చేసింది. పెట్రోల్ పై లీటర్కు రూ.13 నుంచి రూ.3కు తగ్గించగా.. డీజిల్ పై రూ.10ని పూర్తిగా తొలగించింది. ఈ తగ్గింపు తక్షణమే అమల్లోకి వస్తుందని కేంద్రం తెలిపింది. ఈ నిర్ణయంతో చమురు మార్కెటింగ్ కంపెనీలకు భారీ ఊరట లభించనుంది. ఇరాన్ యుద్ధం కారణంగా హర్మూజ్ జలసంధి దాదాపు మూతపడటంతో అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు భగ్గుమంటున్న సంగతి తెలిసిందే. అయినప్పటికీ భారత్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో దేశీయ చమురు మార్కెటింగ్ కంపెనీలు లీటర్ పెట్రోల్/డీజిల్ పై దాదాపు రూ.48 వరకు నష్టపోతున్నట్లు మార్కెట్ నిపుణులు వెల్లడించారు. ఈ క్రమంలోనే అదనపు భారాన్ని తగ్గించుకునేందుకు ఇటీవల నయారా ఎనర్జీ ఇంధన ధరలను పెంచేసింది. మిగతా చమురు కంపెనీలు కూడా ఆ బాటపట్టే అవకాశం ఉండటంతో.. కేంద్రం ఎక్సైజ్ సుంకాలపై ఇంధన సంస్థలకు ఊరట కల్పించింది. ఈ నిర్ణయంతో రిటైల్ మార్కెట్లో పెట్రోల్, డీజిల్ ధరలు తక్షణమే తగ్గే అవకాశం లేనప్పటికీ.. ఇంధన ధరల భారాన్ని కంపెనీలు ప్రజల పైకి బదిలీ చేయకుండా ఈ చర్య కొంతమేరకు ఉపకరిస్తుందని పరిశ్రమ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

## 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారానికి తెలంగాణ నుంచి స్టార్ క్యాంపెయినర్లు

**ఢిల్లీ, మార్చి 27:** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రచారాన్ని విస్తృతం చేస్తోంది. మూడు రాష్ట్రాలకు సంబంధించి స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. ఒక్కో రాష్ట్రానికి 40 మంది చొప్పున నియమించారు. కేరళ, అస్సాం, పుదుచ్చేరితో పాటు గోవాలోని పోండా ఉప ఎన్నికల స్టార్ క్యాంపెయినర్ గా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరించనున్నారు. మరోవైపు పుదుచ్చేరి స్టార్ క్యాంపెయినర్లుగా తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నియమితులయ్యారు.

## ఇంధన పర్యవేక్షణకు కేంద్ర మంత్రులతో కమిటీ



**ఢిల్లీ, మార్చి 27:** పశ్చిమాసియాలో యుద్ధంతో దేశంలో గ్యాస్, క్రూడ్ ఆయిల్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కేంద్ర మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. కేంద్ర హోం మంత్రి అమిత్షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇందులో సభ్యులుగా ఉంటారు.



# అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

పకడ్బందీగా నిర్వహించడంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద 351 కోట్లతో చేపట్టిన ఆలయ అభివృద్ధి తొలిదశ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కొండా సురేఖ, ఎంపీ పోరిక బలరాం నాయక్,, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా అయ్యర్, ఎండోమెంట్ కమీషనర్ హన్మంత రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, పీఓ బి. రాహుల్, అదనపు కలెక్టర్లు విద్యా చందన, వేణుగోపాల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఎరువుల కొరత లేదు, ఆందోళన వద్దు: జేపీ నడ్డా

**ఢిల్లీ, మార్చి 27:** పశ్చిమాసియాలో ఘర్షణలు కారణంగా ఎరువులు, ముడి పదార్థాల రవాణాలో ఆలస్యం చోటుచేసుకుని రైతులు ఇబ్బందులు పడుతున్నారంటూ వస్తున్న వార్తలపై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా లోక్ సభలో స్పందించారు. ఎరువులపై యుద్ధ ప్రభావం పడకుండా రైతుల అవసరాలకు సరిపడా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కోరారు. ఔషధాల తయారీకి ఇతర దేశాల నుంచి ముడిసరుకు దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు కూడా చర్యలు చేపట్టామని చెప్పారు. ముడిసరుకుల దిగుమతి విషయంపై ఒక్క దేశం పైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నామని, ఇప్పటికే పలు దేశాలతో దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకున్నామని నడ్డా వివరించారు. ఔషధాల తయారీకి ఇతర దేశాల నుంచి ముడిసరుకు దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు కూడా చర్యలు చేపట్టామని చెప్పారు.

# కవిత కొత్త పార్టీ డేట్, టైం ఫిక్స్

**హైదరాబాద్,మార్చి 27(మనం,ప్రత్యేక ప్రతినిధి):** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10గంటలకు నూతన రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. ఈక్రమంలో నిజామాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అధ్వయ కన్వెన్షన్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పార్టీ పేరు, జెండా అజెండా ప్రకటించబోతున్నట్లు చెప్పారు. శ్రీరామనవమి మంచి కావడంతో తన పార్టీ గురించి ప్రకటన చేస్తున్నట్లు చెప్పారు. యువత, మహిళలకు మా పార్టీలో మంచి స్థానం ఉంటుందన్నారు. ఇంతకాలం మగవాళ్లు ఏర్పాటు చేసిన పార్టీలను చూశారని, తెలంగాణ ఆడబిడ్డగా తాను పార్టీ పెడితే ఎలా ఉంటుందో మీరే చూస్తారన్నారు. తెలంగాణ ఆవిర్భావం జరిగి 12 ఏళ్లు అయినా నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించుకోలేకపోయామని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీ రావాలని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని వివరించారు. ఈక్రమంలో జాగృతి సంస్థ రాష్ట్రంలో అనేక కార్యక్రమాలు నిర్వహించిందని, ముఖ్యంగా ఖమ్మం వెలుగుమట్లలో పేదల కోసం ఉద్యమించామని కవిత గుర్తు చేశారు.అనంతరం ఖిల్లా రామాలయంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొని



ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**జెండా ఏగురవేసి:**

మేడ్చల్లోని మునీరాబాద్ వద్ద అద్వయ ఫంక్షన్ హాలులో ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు జెండా ఆవిష్కరణ చేస్తామని కవిత ప్రకటించారు. ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా ఆ రోజు ఉదయం 9గంటలలోపు కార్యస్థలికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి ఓ మహిళగా ఈ పార్టీని పెడుతున్నానని తెలిపారు. బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. మేడ్చల్ వేదికగా పార్టీ ప్రారంభోత్సవానికి రాష్ట్రంలోని ప్రతి ఊరి నుంచి కార్యకర్తలు తరలిరావాలని, రాష్ట్ర రాజకీయాలు మార్చాల్సిన బాధ్యత యువకులపై ఉందన్నారు. అందరూ మెచ్చేలా పార్టీ ఉంటుందని, సర్వోదయ తెలంగాణ రావాలని కవిత కాంక్షించారు.

**మేం...ఎవరికీ బీ పార్టీ కాము:**

తాము ఎవ్వరికీ బీ పార్టీ కామని, తమది నంబర్ వన్ పార్టీ అవుతుందని కవిత ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే తాను ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. 95 శాతం తెలంగాణ ప్రాంతీయ పార్టీగా, ఇంటి పార్టీగా కొత్త పార్టీ రాబోతోందన్నారు. అవసరమైతే ఢిల్లీలో లాబీ చేయడంతో పాటు గల్లీలో పని చేస్తా' అని కవిత స్పష్టం చేశారు. పార్టీ ఆవిర్భావ సభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని, రాజకీయాలలో మార్పు కోరుకునే అభ్యుదయ వాదులు అందరూ తనతో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.



# రాజాసింగ్ రీఎంట్రీ?

(మొదటి పేజీ తరువాయి)

రాజాసింగ్ ప్రయత్నించగా అధిష్టానం అందుకు సమ్మ తించలేదు. దీంతో తీవ్ర అసంతృప్తికి లోనైన ఆయన పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. అవస రమైతే ఎమ్మెల్యే పదవికి సైతం రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. బీజేపీలో కోవర్టులు ఎక్కువయ్యారనీ, వారందరినీ పార్టీలో నుంచి తరిమే యాలని రాజాసింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. అంతేకాకుండా పార్టీలో పాత సామానును వదిలించు కుంటేనే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధి కారంలోకి వస్తుందనీ, లేదంటే కనీసం ఇప్పుడున్న సీట్లు కూడా రావని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో బీజేపీ అధిష్టానం క్రమశిక్షణ చర్యల కింద పార్టీ నుంచి ఆయ నను సస్పెండ్ చేసింది. ఆ తరువాత అధిష్టానం ఆదే శిస్తే తిరిగి పార్టీలో చేరడానికి ఎలాంటి అభ్యంతరం లేదని పలు సందర్భాలలో రాజాసింగ్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో రాజాసింగ్ అనుచరులు సమావేశమైనప్పుడు ఆయన రీ ఎంట్రీకి సానుకూల సంకేతాలు లభించినట్లు సమాచారం. రాజా సింగ్‌ను తిరిగి పార్టీలో చేర్చుకునే విషయంలో కిషన్ రెడ్డి జాతీయ నాయకత్వంతో సంప్రదింపులు జరిపా రనీ, అందుకు పార్టీ పెద్దలు అంగీకరించారని తెలు స్తోంది. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సైతం రాజాసింగ్ రాజకీయాల కంటే సిద్ధాంతాలు ఉన్న వ్యక్తి అని వ్యాఖ్యానించారు. త్వరలో పార్టీ సభ్యత్వ డ్రైవ్ ఉంటుందనీ, అందులో మిస్డ్ కాల్ ఇస్తే చాలు తిరిగి పార్టీలోకి రావొచ్చంటూ ఆయనకు ఆఫర్ ఇచ్చారు. దీంతో రాజాసింగ్‌ను తిరిగి బీజేపీలోకి రప్పించేందుకు ఓ వర్గం తీవ్రంగా ప్రయత్నిస్తోందన్న ప్రచారం చర్చ జోరుగా సాగింది. ఈ నేపథ్యంలో ఎంపి అర్వింద్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. అయితే, పార్టీ లైన్‌కు లోబడి వ్యవహరించాలనీ, మీడియాతో మాట్లాడేట ప్పుడు జాగ్రత్తగా ఉండాలని అధిష్టానం షరతులు విధించినట్లు సమాచారం. మరో రెండు మూడు నెలల్లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరుగ నున్నాయి. కరుడుగట్టిన హిందుత్వ వాదిగా పేరున్న రాజాసింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్న గోషామహల్ నియో జవర్గంతో పాటు పాత బస్తీలోని దాదాపు పది పదిహేను డివిజన్లలో ఆయనకు భారీ సంఖ్యలో అనుచర గణం ఉంది. ఈ నేపథ్యంలో రాజాసింగ్ పార్టీలో చేరితే బీజే పీకి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రయోజనం చేకూరుతుందన్న చర్చ పార్టీలో సాగుతోంది.

# కన్నుల పండుగగా రాములోరి కళ్యాణం



ములుగు, మార్చి 27మనం ప్రతినిధి : మండలంలోని ఇంచెర్ల గ్రామంలోని రామాలయం, గోవిందరావుపేట మండల కేంద్రంలోని గోవిందరావుపేట, చల్వాయి, పసర, గ్రామాల్లోని రామాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ పాల్గొని కనుల పండుగగా జరిగే సీతారాముల కళ్యాణాన్ని వీక్షించి, స్వామి వార్ల ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అత్యంత వైభవంగా ప్రతి ఏటా నిర్వహించే వివాహ వేడుక సీతారాముల వివాహ వేడుక అని, సీతారాముల జంట ఎంతోమందికి ఆదర్శం అని, ఒకరిని ఒకరు అర్థం చేసుకుంటూ, ఒకరి మాటకు ఒకరు వింటూ, ఆది దంపతులుగా ప్రజలందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన దంపతులు సీతారాములు అని, ఆ తల్లిదండ్రుల ఆశీర్వాదాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని కాంక్షిస్తూ, ప్రతి ఒక్కరు సుఖః సంతోషాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్న అని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ జిల్లా రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరీంనగర్లో భారీ సైబర్ క్రైమ్ నెట్‌వర్క్ గుట్టురట్టు

## రూ. 138 కోట్ల అక్రమ లావాదేవీలు, 13 మంది అరెస్ట్

కరీంనగర్, మార్చి 27(మనం బ్యూరో ): సైబర్ నేరగాళ్లకు సహకరిస్తూ, అమాయక ప్రజల బ్యాంక్ ఖాతాలను అక్రమ లావాదేవీలకు వాడుకుంటున్న భారీ నెట్వర్క్పై కరీంనగర్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. 'ఆపరేషన్ క్రాక్డౌన్ 1.0' పేరుతో చేపట్టిన ప్రత్యేక దర్యాప్తులో ఏకంగా రూ. 138 కోట్ల భారీ కుంభకోణం బయటపడింది. ఈ కేసులో పోలీసులు ఇద్దరు బ్యాంక్ అధికారులతో సహా మొత్తం 13 మందిని అరెస్ట్ చేశారు.

**ఏమిటీ మ్యూల్ అకౌంట్స్ దందా?**

సైబర్ నేరగాళ్లు సామాన్య ప్రజలకు డబ్బు ఆశ చూపి, వారి పేరుతో బ్యాంక్ ఖాతాలను తెరిపిస్తారు. ఆ ఖాతాల ద్వారా నేరాలకు సంబంధించిన సొమ్మును వివిధ వర్చువల్ అకౌంట్ల ద్వారా విదేశాలకు మళ్లిస్తారు. ఈ కేసులో రత్నాకర్ బ్యాంక్ లిమిటెడ్, కొన్ని కో-ఆపరేటివ్ సొసైటీల ఖాతాలను నేరగాళ్లు వేదికగా చేసుకున్నారు.

**ముఖ్య గణాంకాలు:**

మొత్తం లావాదేవీలు: సుమారు రూ.138 కోట్లు.
గుర్తించిన నిందితులు: 24 మంది (13 మంది అరెస్ట్, మిగిలిన వారి కోసం గాలింపు).
ఆర్ బీ ఎల్ బ్యాంక్ మ్యూల్ ఖాతాల ద్వారా: రూ.125.80 కోట్లు.
వర్చువల్ ఖాతాల ద్వారా: రూ.12.25 కోట్లు.

**నిందితుల వివరాలు:**

అరెస్ట్ అయిన వారిలో కీలక సూత్రధారులతో పాటు వ్యవస్థకు సహకరించిన వారు ఉన్నారు:

సమన్వయకర్తలు మధ్యవర్తులు: బండారి సాయిరాం, అనుమాండ్ల రంజిత్, అలిగేటి మల్లేశం, బోగ రాకేష్, బండి ప్రణయ్. బ్యాంక్ అధికారులు: భువనగిరి కళ్యాణ్ (ఆర్ బీ ఎల్ బ్యాంక్ మేనేజర్, హన్మకొండ), అయేషా బేగం (కరీంనగర్).



**ఖాతాదారులు:** విభూది రాంకుమార్, నతర్ల శ్రీనివాస్, క్రరే రాజు, కల్లెడ మహేందర్, కొండ్ర నరహరి, కల్లెడ రాజేష్. వీరిపై భారత న్యాయ సంహిత (బీ ఎన్ ఎస్ ) సెక్షన్ 112, 318(4) ఐటీ యాక్ట్ సెక్షన్ 66-డి కింద కేసులు నమోదు చేశారు.

**పోలీస్ కమిషనర్గౌస్ ఆలం హెచ్చరిక:**

'కొద్దిపాటి కమిషన్ కోసం మీ బ్యాంక్ ఖాతాలు, ఏటీఎం కార్డులు లేదా లాగిన్ వివరాలను ఇతరులకు ఇవ్వకండి. అలా చేస్తే మీరు కూడా నేరస్తులుగా పరిగణించబడతారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 కి కాల్ చేయండి లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయండి.'ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని, ఈ నెట్వర్క్లో మరిన్ని అంతర్జాతీయ సంబంధాలు బయటపడే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

# తెలంగాణలో తీన్మార్ మల్లన్న పాదయాత్ర

- జూన్ 2న పాదయాత్రకు ముహుర్తం ఫిక్స్
- ఏయే జిల్లాలు, ఎన్ని కిలోమీటర్లు రూట్ మ్యాప్ ఖరారు..
- బీసీలకు అధికారం దక్కాలనే ప్రధాన అజెండాతో రాజకీయ యాత్ర
- త్వరలో అధికారికంగా వెలువడనున్న ప్రకటన

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ రాజకీయాల్లో సంచలనాలకు కేంద్ర బిందువైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న.. మరో కీలక ప్రకటన చేశారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాదయాత్ర చేపడుతున్నట్టు ఆయన ప్రకటించారు. తీన్మార్ మల్లన్న నేతృత్వంలోని 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ' (టీఆర్పీ) ఈ యాత్రను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఇది కేవలం ఒక నిరసనగా కాకుండా, బీసీ(వెనుకబడిన తరగతు)లకు రాజకీయ అధికారం దక్కాలనే ప్రధాన అజెండాతో ఈ యాత్ర సాగనున్నట్లు టీఆర్పీ నేత ఒకరు చెప్పారు. గ్రామగ్రామాన పర్యటించి బీసీల సమస్యలను తెలుసుకోవడమే కాకుండా, రాజకీయ సాధికారతకు అవసరమైన మద్దతును కూడగట్టడమే లక్ష్యంగా పాదయాత్ర కొనసాగనుందన్నారు.

జూన్ 2న ప్రారంభం కానున్న ఈ సుదీర్ఘ పాదయాత్రకు సంబంధించి, ఇప్పటికే రూట్ మ్యాప్ కూడా సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఏ జిల్లా నుంచి యాత్ర మొదలవుతుంది, ఏయే దశల్లో ఎన్ని కిలోమీటర్లు సాగుతుంది అనే పూర్తి వివరాలు త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నట్లు వారు తెలిపారు.

# జల్, జంగల్, జమిన్ కోసం పోరాడిన యోధుడు కామ్రేడ్ కుంజా రామన్న

ములుగు, మార్చి 27మనం ప్రతినిధి : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మొకాలపల్లి గ్రామంలో ఆదివాసీ లీబరేషన్ టైగర్స్ వ్యవస్థాపకులు కుంజా రాము వర్ధంతి సందర్బంగా గురువారం అయన స్థూపం దగ్గర రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, కామ్రేడ్ రామన్న ల కుమారుడు రాష్ట్ర యువజన కాంగ్రెస్ సెక్రటరీ ములుగు నియోజకవర్గ యువనాయకుడు కుంజా సూర్య మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సందర్బంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం లోని మొకలపల్లి గ్రామం లోని కుంజా కన్నయ్య, లచ్చుమ్మ ల దంపతుల నాల్గవ కుమారుడు కుంజా కొమ్మలు జన్మించగా మావోయిస్టు పార్టీ లో ఆదివాసీ ప్రయోజన కోసం విప్లవ శక్తులు సన్నిహిత్యం పెంచుకొని ఉద్యమం లో రాము గా పేరు మార్చుకొని ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేసిన జల్ జంగిల్ జమిన్, మా భూమే మా పాలనా అనే విధంగా ఆదివాసీ ల



భూమి, అడవి, నీటి హక్కుల కోసం పోరాడిన గొప్ప ఆదివాసీ నాయకులు ఏ ఎల్ టి (ఆదివాసీ లీబారేషన్ టైగర్స్) వ్యవస్థాపకులు కుంజా రామన్న గారు అని తెలిపిన మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ పూజారి సురేందర్ బాబు, హ్యూమన్ రైట్స్, ఆర్.టి.ఐ జిల్లా చైర్మన్ బండ జగన్మోహన్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యణయ్య, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రీ నాగేంద్రబాబు, జిల్లా ప్రచార కార్యదర్శి కోడం బాలకృష్ణ, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మురుకుట్ల నరేందర్, మాజీ సర్పంచ్ బ్రాహ్మణ పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సున్నం అనందం,మాజీ సింగల్ విండో డైరెక్టర్ గంగినేని శేషగిరి, యువజన కాంగ్రెస్ నాయకులు.. ఎడ్ల నరేష్, కబ్బాక లక్ష్మన్, మద్దేల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# పదవి విరమణ పొందిన బానోత్ లక్ష్మణ్ నాయక్ దంపతులను సన్మానం



హనుమకొండ, మార్చ్ 27(మనం న్యూస్): హనుమకొండ జిల్లా లో పదవీ విరమణ పొందిన బానోత్ లక్ష్మణ్ నాయక్ దంపతులను బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా శాలువా బొకేతో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి ఎన్ నాయక్, ఏ ఆర్ నాయక్, మూడు భర్తీయానాయాక్ , పాడ్యా గాంగు నాయక్, బానోత్ తర్పిత, మాజీ జెడ్పిటిసి వీరమ్మ గోపి సింగ్, అనసూయ జగ్రామ్ నాయక్, నునావత్ జవహర్ లాల్, పోరిక రమేష్, మూడు రమేష్ నాయక్, లావుడియా పల్లవి రాజు నాయక్, భూక్య శ్రావణ్ కుమార్, బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఆట విడుపు.. రాజకీయాలకు తాత్కలిక బ్రేక్..

- నేడే..'లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్-2026'
- అత్యంత ప్రతిష్టాత్మకంగా 2 రోజులు పాటు సాగనున్న ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- ఇవి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందిస్తాయ్?
- ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని నింపడమే ముఖ్య ఉద్దేశం
- రవీంద్రభారతిలో సాంస్కృతిక కార్యక్రమాలకు భారీ ఏర్పాట్లు
- క్రీడల నిర్వహణకు ఛైర్మన్గా జూపల్లి కృష్ణారావు, కో-ఛైర్మన్గా వాకిటి శ్రీహరి
- కమిటీ కన్వీనర్గా మకాన్‌సింగ్ రాజ్ ఠాకూర్‌తో పాటు మరో 13 మంది సభ్యులు



రాజకీయ నాయకులు అంటే.. నిత్యం ప్రజల్లో తిరుగుతూ.. ప్రజా సమస్యలపై పోరాటం... ప్రతిపక్ష, విపక్షంపై అధికార పక్షం.. అధికార పక్షంపై ప్రతిపక్షాలు.. ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు గుప్పించుకుంటారు. ఇక, ప్రారంభోత్సవాలు, సంక్షేమ పథకాల అమలు, శంకుస్థాపనలు, రాజకీయ సభలు, సమావేశాలతో నిత్యం బిజీ బిజీగా గడుపుతూ ఉంటారు.
తమ ఇంటికి వచ్చిన నియోజకవర్గ ప్రజలను కలుస్తూ.. వారి సమస్యలను తెలుసుకుని తీర్చుతూ ఉంటారు. ఉదయం లేచిన దగ్గరి నుంచి రాత్రి పడుకునే వరకు క్షణం తిరికలేకుండా అత్యంత బిజీగా ఉంటారు. అయితే అలా బిజీ బిజీ లైఫ్ గడిపే ప్రజా ప్రతినిధులకు ఆటల పోటీలు నిర్వహణ, ఏర్పాట్లపై మనం దినపత్రిక సీనియర్ జర్నలిస్ట్ కోడికంటి శ్రీనివాస్ ప్రత్యేక కథనం..

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ సర్కార్ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. నిత్యం రాజకీయాలు, ప్రజా సమస్యలతో బిజీగా ఉండే తెలంగాణ ప్రజాప్రతినిధులు నేడు (శనివారం)ఆటల బరిలోకి దిగనున్నారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం 'లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్-2026' నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నేడు, రేపు(ఈ నెల 28, 29 తేదీల్లో) హైదరాబాద్ ఎల్బీ స్టేడియం వేదికగా ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇక్కడి శాసన సభ్యులకు ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం తెలంగాణ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఇక, ఇదే విషయాన్ని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇప్పటికే శాసనసభలో అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే.

ఈ క్రీడల నిర్వహణ కోసం పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఛైర్మన్గా, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కో-ఛైర్మన్గా ప్రభుత్వం ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసింది.

**రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాలు...**

ఇదిలాఉంటే, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించడంతోపాటు.. రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని నింపడం కోసమే ఈ ఆటల పోటీలు ముఖ్య ఉద్దేశమని స్పోర్ట్స్ కమిటీ ఛైర్మన్, మంత్రి జూపల్లి కృష్ణారావు.. కో ఛైర్మన్ మంత్రి వాకిటి శ్రీహరి తేల్చి చెప్పారు. రెండు రోజులపాటు సాగనున్న ఆట(క్రీడ)లతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలను సైతం రవీంద్ర భారతిలో నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రభుత్వంచే.. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుప తలపెట్టిన 'లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్-2026'కు అధికార యంత్రాంగం ఘనంగా ఏర్పాటు చేసింది. అయితే, ఈ పోటీల నిర్వహణకు.. కమిటీ కన్వీనర్గా ఎమ్మెల్యే మకాన్‌సింగ్ రాజ్ ఠాకూర్‌తో పాటు మరో 13 మంది సభ్యులను నియమించారు. రవీంద్ర భారతి ఏర్పాట్లపై కూడా సమీక్షించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఇవి, నే(టి, 28, శనివారం)డు మధ్యాహ్నం 3:30 గంటలకు ఎల్బీ స్టేడియంలో క్రీడలు ప్రారంభమవుతాయని కమిటీ ఒక ప్రకటనలో ఇప్పటికే స్పష్టం చేసింది. అంతకుముందు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసిన మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే మకాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి స్పీకర్‌ను కలిసి స్పోర్ట్స్ కిట్లను అందజేశారు.

# గురువు రమణయ్య మృతి

- గురువు మృతి పట్ల.. కేసీఆర్ తీవ్ర విచారం
- రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ జైశెట్టి రమణయ్య మృతిపై ప్రగాఢ సంతాపం
- రమణయ్య తనకు అత్యంత ఆత్మీయుడు
- శోకసంద్రంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులకు కేసీఆర్ ఓదార్పు



హైదరాబాద్, మనం ప్రతినిధి : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి, ఉద్యమ రథసారథి కేసీఆర్.. గురువు మృతి చెందారు. తన గురువు మరణం పట్ల కేసీఆర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు, జగిత్యాలకు చెందిన ప్రముఖ చరిత్రకారుడు, రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ జైశెట్టి రమణయ్య మృతిపై ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా తన గురువుతో ఉన్న అనుబంధాన్ని, ఆత్మీయతను కేసీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. అయితే, తాను సిద్దిపేటలో ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో రమణయ్య.. హిస్టరీ లెక్చరర్గా ఉండేవారని, ఆయన వద్ద విద్యను అభ్యసించిన సందర్భాన్ని కేసీఆర్ స్మరించుకున్నారు. రమణయ్య తనకు అత్యంత ఆత్మీయుడని పేర్కొన్నారు. ఆయన మరణం తీరని లోటని పేర్కొన్నారు.

జగిత్యాలకు చెందిన డాక్టర్ జైశెట్టి రమణయ్య, చరిత్రకారుడిగా మంచి పేరు సంపాదించారు. 1971లో సిద్దిపేటలోని జూనియర్, డిగ్రీ కాలేజీలో హిస్టరీ లెక్చరర్గా పనిచేశారు. చిన్న వయసులోనే అధ్యాపక వృత్తిలోకి అడుగుపెట్టిన ఆయన, జగిత్యాలలో తొలి డాక్టరేట్ పొందిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. 'సౌత్ ఇండియా టెంపుల్' అనే అంశంపై పరిశోధన చేసి ఆయన పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. రమణయ్య మరణవార్తతో శోకసంద్రంలో మునిగిపోయిన ఆయన కుటుంబ సభ్యులకు.. కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రమణయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ప్రార్థించారు.

# స్మగ్లింగ్‌లో..శంషాబాద్ ఐదో స్థానం

- ఎయిర్‌పోర్ట్‌లో ఐదంచెల నిఘా
- బంగారం,విదేశీ కరెన్సీపై అడుగడుగునా తనిఖీలు
- బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ ప్రత్యేక ఆదేశాలు

హైదరాబాద్,మార్చి 27(మనం,ప్రత్యేక ప్రతినిధి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బంగారం, విదేశీ కరెన్సీ,డ్రగ్స్ తరలింపుపై మరింత నిఘా సారించనున్నారు. దేశవ్యాప్తంగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ బంగారం,డ్రగ్స్, విదేశీ కరెన్సీ స్మగ్లింగ్‌లో ఐదవ స్థానానికి చేరుకుంది. ఈక్రమంలో డిఆర్ఐ, కస్టమ్స్, సిఐఎస్ఎఫ్ అధికారులు ఎయిర్ పోర్ట్‌లో ఐదంచెల తనిఖీలు చేపడుతున్నారు. ముఖ్యంగా బంగారం స్మగ్లింగ్ అత్యధికంగా యూనైటెడ్ అరబ్ ఎమరైట్స్ దేశాల నుంచే అధికంగా జరుగుతోందని డిఆర్, కస్టమ్స్, సిఐఎస్ఎఫ్ ఉన్నతాధికారుల విచారణలో తేలింది. దీంతో ఎయిర్‌పోర్ట్‌లో అనుమానితులతో పాటు వారి లగేజ్‌లను అడుగడుగునా తనిఖీలు చేపడతున్నారు. ఈ నేపథ్యంలో బంగారం స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన నిందితుల గుర్తించేందుకు నిఘా అధికం చేశారు. శంషాబాద్ విమానాశ్రయంలో స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపందుకు సదరు అధికారులు అత్యాధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఏడాదికాలంలో నమోదైన కేసుల వివరాలను పరిశీలించిన అధికారులు స్మగ్లింగ్ అరికట్టేందుకు వినూత్న నిర్ణయాలను తీసుకుంటున్నారు. అమెరికా, యూరోప్ దేశాలలోని విమానాశ్రయాల్లోని భద్రతా, తనిఖీ విధానాలను మార్గదర్శకంగా సోదాలు చేపడుతున్నారు.

**బాడీ స్కానర్‌లు:**

శంషాబాద్ ఎయిర్ పోర్ట్ అధికారులు ప్రయాణీకుల స్వేచ్ఛకు ఎలాంటి విఘాతం కలుగకుండా బాడీ స్కానర్లతో తనిఖీలు చేపట్టనున్నారు. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ ఆదేశాల మేరకు ఈ స్కానర్లను అందుబాటులోకి తెచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఎయిర్‌పోర్ట్‌లోని ప్రయాణికుల



తనిఖీల నిమిత్తం అధునాతన బాడీ స్కానర్లతో కేవలం మూడు సెకన్లలో పూర్తిగా తనిఖీ చేసే ఈ స్కానర్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు అధికారులు వివరిస్తున్నారు. ఇమేజ్ ఫ్రీ స్కానింగ్ టెక్నిక్ మీద పనిచేసే ఈ స్కానర్ల వల్ల ఎలాంటి హానీ ఉండదని, ప్రయాణికుల స్వేచ్ఛకు ఎలాంటి భంగం వాటిల్లదని ఎయిర్ పోర్ట్ అధికారులు పేర్కొంటున్నారు. ప్రయాణికుల అనుమతితోనే వారిని స్కానింగ్ చేస్తారని అధికారులు వివరిస్తున్నారు.

**అడుగడుగునా నిఘా :**

శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో బంగారం, డ్రగ్స్, విదేశీ కరెన్సీ తరలింపు మార్గాలను గుర్తించిన అధికారులు ఆయా ప్రదేశాలలో తనిఖీలు మరింత ముమ్మరం చేస్తున్నారు. అదేవిధంగా గతంలో బంగారం, గోల్డ్, విదేశీకరెన్సీ స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన వారి పాస్‌పోర్ట్‌లను డిఆర్ ఐ, కస్టమ్స్ అధికారులు సేకరిస్తున్నారు. ఈక్రమంలో స్మగ్లింగ్‌లో ఆర్గనైజ్ క్రైమ్ ముఠా ఉందా అన్న కోణంలోనూ అధికారులు లోతుగా విచారణ జరుపుతున్నారు. ఇకపై తరచూ శంషాబాద్ విమానాశ్రయంలో బంగారం స్మగ్లింగ్ నియంత్రణకు ప్రత్యేక సమావేశాలను నిర్వహించాలని కస్టమ్స్ కమిషనర్ ఆదేశాలిచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా గతంలో దేశ వ్యాప్తంగా స్మగ్లింగ్ కేసులలో పట్టుబడిన నిందితుల చరిత్ర ప్రతీ ఎయిర్ పోర్ట్‌లో ఉండే విధంగా చర్యలు చేపడుతున్నారు. బడా కేసులలో నిందితుల పాస్‌పోర్ట్‌లు, వారు తరచూ ప్రయాణించే దేశాలకు సంబంధించిన డేటా సేకరించాలని బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ అధికారులు ప్రత్యేక ఆదేశాలను జారీ చేసినట్లు తెలియవచ్చింది.

**విదేశీ నుంచి స్వదేశీ :**

హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి విదేశాల నుంచి అంతర్జాతీయ సర్వీసుగా వచ్చి దేశంలోకి ప్రవేశించిన అనంతరం దేశీయ సర్వీసులుగా మారే విమానాలలో బంగారం, డ్రగ్స్ అక్రమ రవాణా జరుగుతున్నట్లు కస్టమ్స్, డీఆర్ఐ అధికారులు అనుమానిస్తున్నారు. ముఖ్యంగా దుబాయి, షార్జా, మలేషియా, సింగపూర్, మస్కట్, సౌదీ అరేబీయా తదితర దేశాల నుంచి భారత్‌లోకి ప్రవేశించే వరకు అంతర్జాతీయ సర్వీసుగా ఉండే విమానాలు దేశంలోకి రాగానే డొమెస్టిక్గా మారుతుండటం స్మగ్లర్లకు వరంగా మారిందన్న కోణంలో కస్టమ్స్ అధికారులు నిఘా అధికం చేశారు. విమానంలోని బాత్‌రూమ్‌లలోని రహస్య ప్రదేశాల్లో బంగారం దాచేసి స్మగ్లర్లు విమానం దిగిపోతున్నారని, అపై బంగారం దాచిన ప్రదేశాన్ని దేశీయంగా ప్రయాణించే తమ ముఠా సభ్యులకు సమాచారం అందిస్తున్నారని కస్టమ్స్ అధికారుల దర్యాప్తులో వెలుగు చూసింది. బంగారం స్మగ్లింగ్ ముఠాల సభ్యుల ఫోన్ నంబర్లు, వారి వాట్సప్ గ్రూపులను సేకరించడంతో పాటు వారి కదలికలపై స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు డిఆర్ఐ. కస్టమ్స్, సిఐఎస్ఎఫ్ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇకపై విమానాశ్రయంలోకి అడుగు పెట్టినప్పటి నుంచి తిరిగి బయటకు వచ్చే దారులలోనూ ఐదంచెల తనిఖీలు చేపట్టే దిశగా డిఆర్ ఐ, కస్టమ్స్, సిఐఎస్ఎఫ్ అధికారులు అడుగడుగునా తనిఖీలు చేపట్టేందుకు సమాలోచనలు సాగిస్తున్నారు.

## నేనూ యుద్ధ పీడితున్నే!

ఈ భూమి మీద
ఈ ఆకాశం కింద
సామ్రాజ్యవాదుల కాలంలో
నడయాడుతున్నందుకు
నేనూ యుద్ధ పీడితున్నే!

యుద్ధ మర్మం తెలిసినప్పటికీ
ప్రేక్షక పాత్ర వహించడం
నో స్టాక్ బోర్డు ఉన్న
పెట్రోల్ పంపు ముందు నుంచోవడమే!

భూతల స్వర్గాలు
సృష్టించే ఈ కాలంలో
యుద్ధ ప్రకటనొక రాక్షసక్రీడ!

మనిషినీ మానవ శ్రమ సౌందర్యాన్ని
విధ్వంసం చేయడం
శ్వేత భవనానికి అంటిన చెరగని మచ్చ!

ఎంత ఆలోచించినా
మనిషికి కావాల్సిందేముంది
పట్టెడన్నం ఆరడుగుల నేల!

ఈ తత్త్వం ఎరుగని భస్మాసురుడా!
ప్రపంచమంతా ఎదురుచూస్తున్నది
నీనెత్తిమీదికి నీచేయెప్పుడొస్తుందాని!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
94402 33261

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**

**ఈ పేపర్ కోసం https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి**

**- ఎడిటర్**

# రెక్కలు తొడక్కుంటున్న రైతు డిస్కం

రాష్ట్రంలో భౌగోళిక పరిధి లేకుండా కేవలం సర్వీస్ కనెక్షన్ల ద్వారా ఏర్పడే కొత్త డిస్కం రెక్కలు తొడుక్కుంటుంది. ఏప్రిల్ 1 నుండి కొత్త డిస్కం సేవలు అందుబాటులోకి రావాలనే ఉద్దేశ్యంతో ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తుంది ప్రభుత్వం. తాజాగా కొత్త డిస్కంకు తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ అని నామకరణ చేసింది. విద్యుత్ పంపిణీ లైసెన్స్ కోసం విద్యుత్ నియంత్రణ మండలికి దరఖాస్తు చేసుకుంది. ఇది రైతుల కోసం ఏర్పాటు చేసే ప్రత్యేక డిస్కం అని చెబుతుంది. రాష్ట్రంలోని ముప్పై లక్షల వ్యవసాయ సర్వీసులతో పాటు లిఫ్ట్ ఇరిగేషన్, హైద్రాబాద్ మెట్రో వాటర్ సప్లై, మున్సిపల్ వాటర్ సప్లై సర్వీసులను ఈ డిస్కం క్రిందికి తీసుకురానున్నారు. ఇటీవల జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో సీఎండీని నియమించింది. ప్రస్తుతం ఉత్తర మరియు దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థల నుండి ఇద్దరు చొప్పున నలుగురు డైరెక్టర్లను కేటాయించింది. ఇక మిగిలిన అధికారులు మరియు క్రింది స్థాయి సిబ్బందిని కేటాయించడం వేగవంతం చేస్తుంది. దీనితో ప్రస్తుతం ఉద్యోగుల్లో గుబులు మొదలైంది.

ఒక పక్క కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు సంబధించిన విద్యుత్ సవరణ బిల్లును పార్లమెంట్లో ప్రవేశ పెట్టాలని చూస్తుంటే మరో పక్క రాష్ట్రంలో కొత్త డిస్కం ఏర్పాటు పరిస్థితులు ఉద్యోగులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. మాతృ సంస్థల్లో నియామకం అయి కొత్త సంస్థకు బదిలీ ఐతే భవిష్యత్ ఎలా ఉంటుందో అనే ఆలోచనలో ఉద్యోగులు ఉన్నారు. రాష్ట్రంలో విద్యుత్ ఉపకేంద్రాలు, సర్వీస్ కనెక్షన్లు, ఉద్యోగుల సంఖ్య, రాష్ట్ర విస్తీర్ణం మారనపుడు ప్రస్తుతం ఉన్న డిస్కంలకు ఆర్థిక చేయూతనిచ్చే బదులు కొత్త డిస్కం ఏర్పాటు ఆవశ్యకతను సందేహిస్తున్నారు కొందరు.

ప్రస్తుతం రాష్ట్రంలో ఉత్తర దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థలు రాష్ట్రం అంతటా కావాల్సిన విద్యుత్ వినియోగానికి తగ్గట్టు సరఫరా మరియు ఉత్పత్తి సంస్థ లతో సమన్వయం చేసుకుంటూ సేవలు అందిస్తున్నాయి. ఈ తరుణంలో కొత్త డిస్కం ఏర్పడితే సంస్థల మధ్య సమన్వయం మరియు సేవల నిర్వహణ ప్రస్తుత పరిస్థితులతో పోలిస్తే క్లిష్ట తర మయ్యే అవకాశం ఉంది. సాధారణంగా అన్ని గ్రామాల చుట్టూ వ్యవసాయ డిటిఆర్‌లు విస్తరించి ఉంటాయి. ఈ డిటిఆర్‌లకు కావాల్సిన ఇన్ కమింగ్ 11కెవి లైన్లు కూడా గ్రామం చుట్టూ విస్తరించి ఉంటాయి.



కొత్త డిస్కం ఏర్పడిన ఈ డిటిఆర్‌ల వరకు ఉన్న 11కెవి లైన్లను ప్రస్తుత డిస్కం నిర్వహించాల్సిందే. ఇలా ఒకే గ్రామాల్లో రెండు ప్రభుత్వ డిస్కంల సేవలు డబ్బు సమయం మానవ మరియు ఇతర మౌలిక వనరులను వృధా అయ్యే అవ కాశం ఉందనే భావన ప్రజల్లో ఉంది. ఒకే గ్రామంలోనే ఒక ఇంట్లోని రైతుకు ఇంట్లోని విద్యుత్ సేవలకు ఒక ప్రభుత్వ డిస్కం అలాగే వ్యవసాయానికి ఒక ప్రభుత్వ డిస్కంతో ప్రజల్లో గందర గోళం ఏర్పడే అవకాశం ఉంది. క్షేత్ర స్థాయిలో చూస్తే గృహ వాణిజ్య పరిశ్రమ రంగాలతో పోలిస్తే లో ఓల్టేజ్ విద్యుత్ లైన్లు వ్యవసాయానికే ఎక్కువ విస్తీర్ణంలో విస్తరించి ఉంటాయి. అలాగే మిగతా వాటితో పోలిస్తే వీటి నిడివి చాలా ఎక్కువ. ఇంత భారీ క్షేత్ర స్థాయి నెట్‌వర్క్‌ను కొత్త డిస్కంకు కేటాయించే సిబ్బందితో నిర్వహించడం కష్టతరమైనదిగా ఉద్యోగులు భావిస్తున్నారు. అలాగే విద్యుత్ వినియోగ గణాంకాలు పరిశీలిస్తే రాష్ట్రంలో ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ వినియోగంలో దాదాపు 40 శాతం వరకు అలాగే దక్షిణ విద్యుత్ పంపిణి సంస్థ యొక్క వినియోగంలో దాదాపు 25 శాతం వినియోగం వ్యవసాయ రంగానిదే. వ్యవసాయ రంగంతో పాటు లిఫ్ట్ ఇరిగేషన్ మున్సిపల్ వాటర్ సర్వీసులు అలాగే నష్టాలు కలుపుకుంటే సుమారు 40 శాతం పైగా వినియోగం కొత్త డిస్కం పరిధిలోకి రానున్నాయి. పై గణాంకాలు పరిశీలిస్తే ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఎక్కువగా ప్రభుత్వ సబ్సిడీపై ఆధారపడుతుంది.

వ్యవసాయ మరియు లిఫ్ట్ ఇరిగేషన్ వినియోగం కలుపుకుంటే దాదాపు సగం ఉత్తర తెలంగాణ డిస్కం యొక్క వినియోగం కొత్త డిస్కంకు బదిలీ కానుంది. ఇన్ని సంవత్సరాలు నష్టాలను భరిస్తూ విద్యుత్ సేవలు అందించిన డిస్కం తమ సబ్సిడీలను కోల్పోనుంది. వాస్తవానికి కొత్త డిస్కం ఏర్పడితే వ్యవసాయ రంగానికి కావాల్సిన విద్యుత్ ఖర్చులు మరియు ప్రభుత్వ సబ్సిడీలు రెండు రైతు డిస్కంకి బదిలీ అవుతాయి. దీంతో ప్రస్తుత డిస్కంలు ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. కానీ విద్యుత్ కొనుగోలు ఖర్చుకు ఆదాయ రాబడికి వత్యాసం మారనప్పుడు ప్రస్తుత రెండు పంపిణీ సంస్థల లోటు కాస్త కొత్త డిస్కం పై పడే అవకాశం ఉంది.

ఏ ప్రభుత్వ రంగా సంస్థకైనా ప్రభుత్వ ఆర్థిక సహకారం తప్పనిసరి అవసరం. ప్రస్తుత డిస్కంల అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని కొత్త డిస్కం విషయంలో అడుగులు వేయాలి. కొత్త డిస్కంకు తమ అవసరాలకు కావాల్సిన పవర్ పర్చేస్ కాస్ట్, ట్రాన్స్‌మిషన్ చార్జెస్, వీలింగ్ చార్జెస్ మరియు ఉద్యోగుల వేతనాలకు సరిపడే ఆర్థిక వనరులను ప్రభుత్వం సమకూర్చాలి. ప్రభుత్వ సబ్సిడీ తక్కువైనా లేదా సమయానికి రాకున్నా సంస్థ నిర్వహణ కష్టమౌతుంది. కొత్త డిస్కం అవసరానికి తగ్గట్టుగా ఉద్యోగుల కేటాయింపు జరగాలి. ఇలా జరగక పోతే పని బారం ఒక డిస్కంలో ఎదురైతే ఉద్యోగుల సంఖ్య ఆర్థిక బారంగా మరో డిస్కంకి ఎదురయ్యే అవకాశం ఉంది. దీనితో పాటు దీర్ఘకాలిక ప్రభుత్వ బకాయిలను విడుదల చేస్తేనే విద్యుత్ సంస్థలు అన్ని ఆర్థికంగా నిలదొక్కుకుంటాయి.

రైతు డిస్కంకు సోలార్, హైడ్రో, విండ్ లాంటి తరగని ఇంధన వనరుల ద్వారా ఉత్పత్తి అయ్యే చౌక విద్యుత్ కేటాయిస్తే విద్యుత్ కొనుగోలు ఖర్చు తగ్గుతూ సంస్థ ఆర్థికంగా నిలదొక్కుకుంటుంది. ప్రభుత్వాలు ఎప్పుడు రాజకీయ ఆపేక్ష లేకుండా నిర్ణయాలు తీసుకోవాలి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఏ పరిణామాలకు దారి తీస్తుందో తెలియదు కానీ దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉంటుంది కాబట్టి మొదటీ బారం ఉద్యోగులపై పడుతుందనేది నిజం. రైతుల మేలు కోసం తీసుకునే ఏ నిర్ణయమైనా ప్రజలు ఆహ్వానిస్తారు. అన్నం పెట్టే రైతన్న ఇబ్బంది పడకుండ రైతుల కోసం ప్రభుత్వం ఉద్యోగులు సహకరించుకొని మెరుగైన సేవలు అందించాలి.

**- బైరబోయిన వెంకటేశ్వర్లు**
తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ల సంఘం

# 'జీవితమే ఓ నాటకం'



'జీవితమే ఓ నాటక రంగం' అన్నాడో ప్రసిద్ధ ఆంగ్లకవి. కానీ ఎంతో మంది జీవితాల కృషి ఫలితమే నాటకాల ఆవిర్భావానికి నాంది అయింది. ప్రస్తుత రోజుల్లో సినిమాల వలన నాటకానికి ఆదరణ లేకపోవచ్చు. సినిమాల ఆవిర్భావానికి మూలం నాటకమే! ఎంతో మంది రంగస్థల కళాకారులు చిత్రరంగంలో ప్రవేశించి పేరుపొందారు. నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు పూర్వాశ్రమంలో రంగస్థల నటులే! నాటి కాలంలో ఎంతో మందికి జీవనాన్ని కల్పించింది ఈ 'రంగస్థలమే'. తెలుగు వారి ప్రకారం థియేటర్ అనే పదాన్ని రంగస్థలానికి, సినిమా హాల్‌కు రెండింటికీ ఉపయోగించినా, 'రంగస్థలం' అంటే నాటకాలు వేసే స్థలం అని అర్థం. థియేటర్ అనే పదం వాస్తవానికి గ్రీకు థియేట్రాన్ నుండి వచ్చింది. థియేట్రాన్ అనగా 'వీక్షించే ఒక ప్రదేశం' అని అర్థం.

నాటకరంగం అనేది రంగస్థలంపై ప్రదర్శించబడే ఒక అద్భుతమైన ప్రదర్శనా కళారూపం. ఒక నిర్దిష్ట ప్రదేశంలోనూ, ఒక వేదికపై ప్రత్యక్ష ప్రేక్షకుల ముందు నిజమైన లేదా ఊహించిన సంఘటనల అనుభవాన్ని ప్రదర్శించడాన్ని నాటక ప్రదర్శన అంటారు. ప్రదర్శకులు సంజ్ఞ, ప్రసంగం, పాట, సంగీతం, నృత్యం కలయికల ద్వారా ప్రేక్షకులను రంజింపజేస్తారు. నాటకం అనేది ఒక ప్రత్యేకమైన కల్పన విధానం ద్వారా ప్రదర్శించి వ్యక్తీకరించబడుతుంది. 'నాటకాంతం హి సాహిత్యం' అన్నారు మహాకవి కాళిదాసు. అంటే అన్ని సాహిత్య ప్రక్రియలలోనూ చివరిగా స్పర్శించవలసిన అంకం నాటకమని అర్థం.

భారతీయ నాటక రంగం మొదటి రూపం సంస్కృత నాటకరంగం. ఈ నాటక రంగం క్రీ.పూ. 2వ శతాబ్దం నాటిది. ఇది ఆచార శిక్షణలో ప్రారంభమై సంస్కృత నాటకం ద్వారా అధికారిక రూపాన్ని సంతరించుకుంది. ఋగ్వేదం నుండి ప్రారంభమై, భరతముని నాట్యశాస్త్రం ద్వారా మరింత అభివృద్ధి చెందింది. సంస్కృత నాటక రంగానికి స్వర్ణయుగం క్రీస్తుపూర్వం 2వ శతాబ్దంలో ప్రారంభమై 10వ శతాబ్దంలో ముగిసింది. అనేక విదేశీ దండయాత్రలు, పాలకులు ఈ కళారూపాన్ని నిషేధించడం వల్ల సంస్కృత నాటక రంగ పతనం సంభవించింది. భారతీయ నాటకరంగం నృత్యం, సంగీతం, నాటకం కలగలసి ఉంటుంది. ఇది సాంప్రదాయం, ఆధునికత రెండింటినీ కలిగి ఉంది.

తెలుగు నాటకంలో అనేక రకాలు ఉన్నాయి. పౌరాణిక నాటకాలు, చారిత్రక నాటకాలు, సాంఘిక నాటకాలు, ప్రహసనాలు మొదలైనవి ఇందులో ముఖ్యమైనవి.

అరిస్టాటిల్ ఒక నాటకానికి ఆరు అంశాలను ప్రతిపాదించారు. అవి: కథాంశం, పాత్రలు, ఆలోచన, వాక్చాతుర్యం, సంగీతం, దృశ్యం. ఇవన్నీ నాటక ప్రదర్శనలో కీలక పాత్ర పోషిస్తాయి. అయితే ప్రతి అంశం నాటకానికి ప్రత్యేకమైనది. ఎందుకంటే ప్రతి నాటకం మరొక దాని నుండి భిన్నంగా ఉంటుంది. వీటితో పాటుగా అదనంగా మరికొన్ని అంశాలు కూడా నాటకాన్ని ప్రభావితం చేస్తాయి. నాటకానికి ఒక కథాంశం ఉంటుంది. ఇది నాటకానికి ఒక నిర్దిష్టమైన అర్థాన్ని ఇస్తుంది. నటుల నటన నాటకానికి ప్రాణం పోస్తుంది. వారి నటన ద్వారా పాత్రలు, భావాలు మరింత



స్పష్టంగా వ్యక్తం అవుతాయి. నాటకంలో పాత్రలు ఒక కథను నడిపిస్తాయి. వారి ద్వారా భావాలు, భావోద్వేగాలు, సంఘర్షణలు వ్యక్తమవుతాయి. పాత్రల మధ్య జరిగే సంభాషణలు ఒక ప్రత్యేకమైన శైలిని ఇస్తాయి. పాత్రల స్వభావాలను వెల్లడిస్తాయి. సంఘటనలు కథను ముందుకు నడిపిస్తాయి. పాత్రల మధ్య సంబంధాలను ఏర్పరుస్తాయి. దృశ్యాలు నాటకానికి ఒక ప్రత్యేకమైన వాతావరణాన్ని ఇస్తాయి. పాత్రల భావాలను మరింతగా తెలియజేస్తాయి. కొన్నిసార్లు సంగీతం కూడా ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. నాటకం ప్రదర్శన ద్వారా వ్యక్తీకరించబడుతుంది. కాబట్టి అది ఒక కళా ప్రక్రియ. నాటకాలు సాధారణంగా చర్యలు, సన్నివేశాలుగా విభజించబడతాయి.

తెలుగు నాటకం ఒక గొప్ప సాంస్కృతిక వారసత్వం. మన సంస్కృతిలో ఒక ముఖ్యమైన భాగం. ఇది మన భాష, సంప్రదాయాలు, విలువలను కాపాడుతుంది. తెలుగు సాహిత్యంలో ఒక ముఖ్యమైన ప్రక్రియ. ఇది ప్రజలకు వినోదం, విజ్ఞానం, సందేశం అందిస్తుంది. దీని చరిత్ర చాలా పురాతనమైనది. నాటక రంగ మూలాలు జానపద కళల్లో ఉన్నాయి. భాగవతం, వీధి నాటకాలు, బుర్రకథలు మొదలైనవి తెలుగు నాటకానికి పూర్వ రూపాలు. 19వ శతాబ్దం చివరలో తెలుగు నాటకం ఆధునిక రూపం సంతరించుకుంది. గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం వంటి రచయితలు ఆధునిక తెలుగు నాటకానికి పునాదులు వేశారు. వీరి రచనలు సామాజిక సమస్యలు, మానవ సంబంధాలను ఇతివృత్తంగా చేసుకుని రూపొందాయి. తెలుగు నాటకరంగానికి ఎంతో మంది రచయితలు, దర్శకులు, నటీనటులు తమ వంతు కృషి చేశారు. గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం, ధర్మవరం కృష్ణమాచార్యులు, బళ్ళారి రాఘవ, స్థానం నరసింహారావు, పీసపాటి నరసింహమూర్తి, యడవల్లి సూర్యనారాయణ వంటి వారు తెలుగు నాటకరంగాన్ని సుసంపన్నం చేశారు.

తెలుగులో మొట్టమొదటి నాటకం 'మంజరీ మధుకరీయం'. దీనిని కోరాడ రామచంద్రశాస్త్రి 1860 ప్రాంతాల్లో రచించారు. గురజాడ అప్పారావు రచించిన 'కన్యాశుల్కం' తెలుగు నాటక రంగంలో ఒక మైలురాయి. 1960 వరకు దాదాపు రెండువేల నాటకాలు, నాలుగువేల ఏకాంకికలు, నాటికలు వచ్చాయి.

నిజాం పాలనలో తెలంగాణలో నాటకాలు ప్రజల చైతన్యం కోసం, నిరంకుశ పాలన, జమీందారీ వ్యవస్థ, రైతాంగ పోరాటాల వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఉపయోగపడ్డాయి.

వీధి నాటకాలు, యక్షగానాలు, చిందు భాగవతాలు వంటి ప్రజా కళారూపాలు తెలంగాణలో ఎక్కువగా ఉండేవి. నిజాం పాలనలో ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి నాటకాలు ఒక ముఖ్యమైన సాధనంగా ఉపయోగపడ్డాయి. నిజాం పాలన, జమీందారీ వ్యవస్థ, అక్రమ వసూళ్ల వంటి అంశాల పట్ల ప్రజల్లో వ్యతిరేకతను పెంచడానికి నాటకాలు దోహదపడ్డాయి.

తెలంగాణ సాయుధ పోరాటాన్ని ఉత్తేజితం చేయడంలో నాటకాలు కీలక పాత్ర పోషించాయి. నిజాం రాజ్యంలో అంతర్భాగంగాను, పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నాటక సమాజాల ప్రభావం తెలంగాణ నాటకాలపై ఉంది.

వాసిరెడ్డి భాస్కరరావు, సుంకర సత్యనారాయణలు కలిసి రాసిన 'మా భూమి' నాటకం నిజాం పాలన, జమీందారీ వ్యవస్థపై ప్రజల్లో వ్యతిరేకతను పెంచింది. వెట్టిచాకిరీ, అక్రమ వసూళ్లకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల గురించి 'వెట్టిచాకిరీ' నాటకం ప్రజలకు అవగాహన కల్పించింది.

బోయి భీమన్న రాసిన 'పాలేరు' నాటకం తెలంగాణ సాయుధ పోరాటాన్ని ఉత్తేజితం చేసింది. వేదాంతకవి 1948లో రాసిన 'ఛలో హైదరాబాద్' నాటకం నిజాం పాలన, హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనం కావడానికి ముందు జరిగిన సంఘటనల గురించి వివరిస్తుంది. బ్రిటిష్ ఆజ్ఞలతో హైదరాబాద్ను పాలిస్తున్న నిజాం పాలకులను ఎదిరించి పోరాడాలని 'ముందడుగు' నాటకం ప్రజలకు తెలియజేసింది.

ముత్తరాజు సుబ్బారావు 'చంద్రగుప్త' (1932), శేషుబాబు 'అశోకరాజ్యము'(1945), ప్రభు లింగాచార్యుల 'పల్నాటి వీరచరిత్రము' (1928), ఉన్నవ లక్ష్మీనారాయణ 'నాయకురాలు' (1926), నండూరి బంగారయ్య 'ఆంధ్రతేజము' (1938), వేదం వేంకటరాయశాస్త్రి 'ప్రతాపరుద్రీయము' (1897), పోతుకూచి సుబ్బయ్య 'ఆంధ్రవాణీ సామ్రాజ్యము'(1944), కోలాచలం శ్రీనివాసరావు 'సుల్తాన్ చాంద్ బీ' (1900), కాళ్ళకూరి సాంబశివరావు 'రంగరాయ కదన సమవాకారం' (1899), శ్రీపాద కృష్ణమూర్తి 'బొబ్బిలి యుద్ధం' (1908), కొప్పరపు సుబ్బారావు 'రోషనార' (1921), పడాల రామారావు 'అల్లూరి సీతారామ రాజు' (1950) మొదలైన నాటకాల్లో దేశవ్యాప్తంగానూ, ఆంధ్రదేశంలోనూ ప్రజారంజకంగా పాలన అందించిన పాలకుల స్ఫూర్తినీ, వారి పోరాట పటిమనీ, విదేశీయులతో పోరాడిన చారిత్రక సంఘటనలను కళ్ళకు కట్టినట్లు చూపాయి.

ప్రస్తుతం తెలుగు నాటకానికి ప్రజాదరణ తగ్గింది. దీనికి కారణం సినిమాలు. సినిమాలో కంటే రంగస్థలంపై నాటకాలు ప్రదర్శించడం చాలా కష్టం. నటులు ఎంతో నైపుణ్యంతో ప్రత్యక్షంగా ప్రేక్షకుల ముందర ప్రదర్శించాలి. సినిమాలకు ఇస్తున్న ప్రోత్సాహకాలు నాటక రంగానికి కూడా ఇచ్చి ప్రభుత్వాలు నాటకాన్ని బతికించాలి. అలాగే, ప్రేక్షకులు కూడా నాటకాలను ఆదరించడం ద్వారా ఈ గొప్ప కళను ముందు తరాలకు అందించాలి.

**- జనక మోహన రావు దుంగ**
8247045230

# నారీ శక్తికి పట్టాభిషేకం!



భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో 2029వ సంవత్సరం ఒక అపూర్వమైన మలుపుగా నిలిచిపోనుంది. దశాబ్దాలుగా కేవలం ఎన్నికల ప్రణాళికలకే పరిమితమైన మహిళా రిజర్వేషన్ల అంశం ఇప్పుడు ఆచరణాత్మక రూపం దాల్చి దేశ అత్యున్నత చట్టసభల ముఖచిత్రాన్ని మార్చేందుకు సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ మార్పు కేవలం ఒక రాజకీయ సంస్కరణ మాత్రమే కాదు, అది దేశ జనాభాకు దక్కాల్సిన సామాజిక న్యాయం మరియు గౌరవం. లోక్‌సభ స్థానాల సంఖ్యను గణనీయంగా పెంచుతూ, అందులో మూడింట ఒక వంతు మహిళలకు కేటాయించాలనే నిర్ణయం భారత రాజకీయాల్లో ఒక నూతన శకాన్ని ఆవిష్కరించనుంది. ఈ మార్పు ద్వారా ప్రస్తుతం ఉన్న పురుష ప్రతినిధుల స్థానాలకు ఎటువంటి భంగం కలగకుండానే, అదనంగా చేరే 273 స్థానాలను మహిళా శక్తికి అంకితం చేయడం ఒక ముందడుగు. దీనివల్ల రాజకీయాల్లో తలెత్తే అంతర్గత అసమ్మతిని తగ్గించడమే కాకుండా, శాసన వ్యవస్థలో మహిళల భాగస్వామ్యాన్ని శాశ్వతంగా సుస్థిరం చేయవచ్చు.

అయితే, ఇది సాకారం కావాలంటే జనాభా లెక్కల ఆధారంగా జరిగే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అత్యంత కీలకం. 2011 జనాభా గణాంకాల ప్రకారం సీట్ల కేటాయింపు జరగడం వల్ల ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి పెద్ద రాష్ట్రాల్లో మహిళల ప్రాతినిధ్యం భారీగా పెరుగుతుంది. ఉత్తరప్రదేశ్‌లో సీట్ల సంఖ్య 80 నుండి 120కి పెరగడం వల్ల జాతీయ స్థాయిలో మరింత బలపడుతుంది. అదే సమయంలో, అభివృద్ధి పథంలో దూసుకుపోతూ, జనాభా నియంత్రణలో అద్భుతమైన ఫలితాలు సాధించిన దక్షిణాది రాష్ట్రాల్లో ఒక రకమైన ఆందోళన నెలకొంది. క్రమశిక్షణతో జనాభాను తగ్గించుకున్నందుకు తమకు పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గిపోతుందేమోనన్న భయాలను నిర్మూలించడం కేంద్ర ప్రభుత్వం బాధ్యత కూడా. ప్రాంతీయ విభేదాలకు తావు లేకుండా జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ఏకాభిప్రాయం సాధించడం అనివార్యం. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీయకుండా ఈ సీట్ల పెంపుదల ప్రక్రియ సాగాలి.

మహిళా రిజర్వేషన్లతో పాటు సామాజిక సమతుల్యత కోసం షెడ్యూల్ కులాలు మరియు తెగల (SC/ST) సీట్లను కూడా పెంచడం ఈ సంస్కరణలో ఒక గొప్ప భాగం. ఎస్సీ సీట్లు 84 నుండి 126కి, ఎస్టీ సీట్లు 47




నుండి 70కి పెరగడం వల్ల అట్టడుగు వర్గాలకు చట్టసభల్లో మరింత బలమైన గొంతుక లభిస్తుంది. ఇది రాజ్యాంగ నిర్మాతలు కలలుగన్న సమ్మిళిత ప్రజాస్వామ్యానికి నిజమైన నిదర్శనం. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించడం అనేది కేవలం సంఖ్యాబలం మీద కాకుండా, రాజకీయ పక్షాల నైతిక బాధ్యత మీద ఆధారపడి ఉండాలి. మహిళా సాధికారత అనేది ఏ ఒక్క పార్టీకో లేదా ప్రభుత్వానికో పరిమితమైన అంశం కాకూడదు. స్త్రీ పురుష సమానత్వం కేవలం ఉద్యోగాల్లోనే కాదు, దేశ భవిష్యత్తును నిర్ణయించే చట్టసభల్లో కూడా ప్రతిబింబించాలి.

దేశంలో 'ఒకే దేశం - ఒకే ఎన్నికలు' విధానంపై కూడా తీవ్రమైన చర్చలు జరుగుతున్నాయి. ఇది 2034 నాటికి అమలులోకి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, 2029 ఎన్నికలే ఈ మార్పులకు పునాది కానున్నాయి. ప్రాంతీయ పార్టీల ఉనికి మరియు ప్రాధాన్యత దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. సమతుల్యతను సాధించడమే ప్రస్తుత రాజకీయ సంక్షోభాలకు పరిష్కారం. 2029 ఎన్నికలు భారత పార్లమెంటును ఒక సరికొత్త 'నారీ శక్తి' వేదికగా మార్చబోతున్నాయి.

తెరపై కనిపించే గణాంకాల కంటే, విధాన నిర్ణయాల్లో మహిళలు పోషించబోయే క్రియాశీలక పాత్ర దేశ భవిష్యత్తును నిర్దేశిస్తుంది. మహిళలు కేవలం ఓటర్లుగానే కాకుండా, దేశాన్ని నడిపించే శక్తివంతమైన నాయకులుగా ఎదిగినప్పుడే భారతదేశం 'విశ్వగురువు' గా తన ప్రస్థానాన్ని వేగవంతం చేయగలదు. ఇది కేవలం ఒక బిల్లు ఆమోదం కాదు, ఇది నవ భారత నిర్మాణానికి ఒక బలమైన పునాది.

**- వెంక గారి భూమయ్య**
9848559863

# సాటిలేని మేటి సంపాదకులు చలపతిరావు



మానికొండ చలపతిరావు (1908-1983) పత్రికా రచయిత, సంపాదకుడు, గ్రంథకర్త, సాహితీవేత్త, మానవతావాది. నిర్భయమైన, నిష్పాక్షికమైనశక్తి వంతమైన, పాఠకులను ఎంతగానో ఆకట్టుకునే రచనలకు చలపతిరావు, భారతదేశంలోనే ఇంగ్లీష్ జర్నలిజంలో గొప్ప సంపాదకులుగా మిగిలి పోయారు. భారతదేశ ప్రభుత్వం ప్రెస్ కమిషన్ (Press Commission) ఏర్పాటు చేయడానికి ఆయనే ప్రధాన కారకులు. మానికొండ చలపతి రావు1908 సంవత్సరంలో విశాఖ పట్నంలో జన్మించారు. బాల్యం నుండి ఆయన జర్నలిస్టు కావాలని అనుకోలేదు. అయితే వార్తా పత్రికలను మొదటి నుండి చివరి వరకు ఆసాంతం ఇష్టంగా చదివే అలవాటు చేసుకున్నారు.ఎం.ఏ., బి.ఎల్. పట్టాలను పొంది కొంతకాలం న్యాయ వాదిగా పని చేశారు. ఆయన విశాఖ పట్నంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షతన 'ఎథేనియం' అనే పేరుతో సాహిత్య సాంస్కృతిక సంస్థను నెలకొల్పి తాను కార్యదర్శిగా పనిచేశారు. తర్వాత 'పీపుల్స్ వాయిస్', 'వీక్ ఎండ్', 'హిందూస్థాన్ టైమ్స్' పత్రికలలో వేర్వేరు కాలాలలో సహాయ సంపాదకులుగా పనిచేశారు.

జవహార్ లాల్ నెహ్రూ 1938లో లక్నో నుండి ప్రారంభించిన 'నేషనల్ హెరాల్డ్' దినపత్రికకు చలపతిరావును సహాయ సంపాదకునిగా నియమించారు. అయన చిత్త శుద్ధితో, అంకిత భావంతో, రాజీ లేని, ఒత్తిళ్ళకు లొంగని శక్తి వంతమైన సంపాదకీయాలు, వ్యాసాలు రాశారు. దేశంలో కొద్ది మంది జర్నలిస్టులు అటువంటి శక్తితో వ్రాయగలిగారు, అతి తక్కువ మంది ఆయన అనుసరించిన పదబంధాలను, భాషపై పట్టును కలిగి ఉండేవారు. నేషనల్ హెరాల్డ్ మూసి వేయడం ద్వారా ది హిందూస్తాన్ టైమ్స్‌లో అసిస్టెంట్ ఎడిటర్‌గా పని చేయడానికి ముందు స్వాతంత్ర్య పోరాటంలో ప్రెస్ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.

1946 లో అప్పటి ప్రభుత్వం మూసివేసిన తరువాత తిరిగి తెరిచినప్పుడు ఆయన నేషనల్ హెరాల్డ్ ఆఫ్ లక్నోకు సంపాదకులు అయ్యాడు. అదే పత్రికకు సంపాదకులుగా 1946 నుండి 1978 వరకు కొనసాగి నెహ్రూకు సన్నిహిత మిత్రుడై భారతదేశం లోని ప్రముఖ పత్రికా సంపాదకులుగా పేరు పొందారు. శక్తివంతమైన సంపాదకీయాలు మరియు వ్యాసాలు రాశారు. దేశంలో కొద్దిమంది జర్నలిస్టులు మాత్రమే అటువంటి శక్తితో వ్రాయ గలిగారు, తక్కువ మంది ఆ పద బంధాన్ని కలిగి ఉండేవారు.

యునెస్కో ప్రెస్ నిపుణుల కమిటీలో సభ్యుడిగా పని చేశారు. ఆయన 1955లో యుఎస్ఎస్ఆర్, పోలాండ్ మరియు యుగోస్లేవియాలో పర్యటించిన జవహర్ లాల్ నెహ్రూతో కలిసి వచ్చిన ఇండియన్ ప్రెస్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించారు. 1958లో, ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో భారత దేశానికి ప్రాతినిధ్యం వహించారు. చలపతి రావు ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్‌స్టిట్యూట్ ఇనిషియేటింగ్ కమిటీ సభ్యులు కూడా.

ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (Indian Fedration of Working Journalists) అనే సంస్థను వ్యవస్థీకరించి దానికి మొదటి అధ్యక్షులై, ఆ సంస్థను 1950 నుండి 1955 వరకు ట్రేడ్ యూనియన్ పద్ధతిలో నడిపి దేశంలోని పత్రికా రచయితలకు మేలైన స్థితిగతులను కల్పించడానికి ఎంతగానో పాటు పడ్డారు.1952లో చైనాకు భారత ప్రభుత్వ గుడ్‌విల్ మిషన్ సభ్యులు. ఆయన మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, గోవింద వల్లభ పంత్‌ల జీవిత్ర చరిత్రలను ఆంగ్లంలో రచించారు. ది ప్రెస్ ఇన్ ఇండి యా (The Press in India) అనేది ఆయన ప్రసిద్ధిచెందిన గ్రంథం. దేశంలోని పలు సమస్యలపై విరివిగా వ్యాసాలు రాశారు. అంతే కాకుండా భారతదేశ పర్యాటక అభివృద్ధికి సంబంధించిన వ్యాసాలను, భారత దేశ రాజకీయాలు జర్నలిజం వంటి అంశాలపై సాధికార రచనలు చేశారు. 1983 మార్చి 25న ఢిల్లీలో ఆయన అకస్మాత్తుగా మృతి చెందారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# భీమేశ్వరుని సేవలో మంత్రి పొన్నం

- పట్టు వస్త్రాలు సమర్పణ
- భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు
- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ అర్చకులు
- హాజరైన కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే



**వేములవాడ,మార్చి 27(మనం న్యూస్):**శ్రీరామ నవమి సందర్భంగా వేములవాడలో శ్రీ సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అంతకుముందు మంత్రిని ఆలయ అతిథి గృహంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేశారు. శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణ వేడుకలు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో ఆద్వర్యంలో శివార్చన స్టేజీ వద్ద నిర్వహించనుండగా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేసేందుకు వచ్చి శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి చేరుకోగా, అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, శ్రీ సీతారాముల కల్యాణానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. మంత్రి, ప్రభుత్వ విప్ నకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈకార్యక్రమంలో,ఆర్డీవో రాధాబాయి, ఆలయ ఈఓ రమాదేవి, డీఎస్పీ శ్రీనివాసులు,తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు కొరతలేదు

- ప్రజల అవసరాలకు అనుగుణంగా నిలువలు ఉన్నాయి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల, మార్చి 27 (మనం ప్రతినిధి):** జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు కొరత లేదని కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా జిల్లాలో సిలిండర్ల నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలు పడవద్దని, వదంతులు నమ్మవద్దని సూచించారు. గృహ వినియోగదారులు తొందరపడి గ్యాస్ బుక్ చేసుకోవద్దని తెలిపారు. తమ అవసరాలకు అనుగుణంగా గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ పక్కదారి పట్టినా.. బ్లాక్ దందా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్పీజీ గ్యాస్ సరఫరా విషయమై జిల్లాలో కంట్రోల్ రూమ్ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో ఎల్పీజీ గ్యాస్కు సంబంధించిన సమస్యలు ఎదురైతే వినియోగదారులు 80084 29738 ఫోన్ నంబర్కు సంప్రదించి తమ ఫిర్యాదులను తెలియ జేయవచ్చని పేర్కొన్నారు. ఎల్పీజీ గ్యాస్ సరఫరా, పంపిణీకి సంబంధించిన సమస్యలను పర్యవేక్షించడంతోపాటు వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కంట్రోల్ రూమ్లో నమోదు అయ్యే ఫిర్యాదులను సంబంధిత అధికారులు, ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీలకు తెలియజేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు.

## స్నేహితుడికి చిన్నారుల అండ

**భీమదేవరపల్లి, మార్చి 27 మనం న్యూస్:** రత్నగిరి గ్రామంలో స్నేహితుడికి చిన్నారులు అండగా నిలిచారు. శుక్రవారం రోజున రత్నగిరి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో పోర్ణిందుల ప్రభాకర్ మరణించగా మృతుడి కుమారుడు అయినా చెర్రీ గట్ల నర్సింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతుండడంతో తన స్నేహితులు స్నేహితుడికి అండగా నిలవాలని తమ దగ్గర పాకెట్ మనీతో పోగు చేసి 50 కిలోల బియ్యాన్ని చెర్రీ కుటుంబానికి అందించారు. చిన్నారులు తమ స్నేహితుడి కి అండగా నిలవడం పాఠశాల ఉపాధ్యాయులను గ్రామస్తులను పలువురు చిన్నారులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో చరణ్, తనీష్ ,విగ్నేష్ ,నిశాంత్ ,జగదీష్ ,ఎండి తౌఫిక్ ,ఆకర్షిత్ ,వర్షిత్, గ్రీష్మ ,లక్ష్మి ,సాహితి ,ఐశ్వర్య ,అద్విక ,ధన్వి శ్రీ ,సహస్ర, ప్రణవి ,వర్షిక, లక్ష్మీసాయి ,తదితరులు పాల్గొన్నారు



# కళ్యాణం... కమనీయం



- అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం
- కళ్యాణ మహోత్సవానికి భక్తుల రద్దీ

**భీమదేవరపల్లి, మార్చి 27 మనం న్యూస్:** కన్నుల పండుగగా సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా కబనీయంగా జరిగింది. శుక్రవారం రోజున శ్రీరామనవమి సందర్భంగా మేజర గ్రామపంచాయతీ ముల్కనూర్ శ్రీ సాంబమూర్తి శివాలయం లో అర్చకుల వేద పండితుల వేదమంత్రాల మధ్య ఆలయ చైర్మన్ గన్ను శ్రీనివాస్ దంపతులు సీతారాముల కల్యాణ మహోత్సవం కు పట్టు వస్త్రాలు సమర్పించారు. భీమదేవరపల్లి భీమేశ్వరాలయంలో గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి దంపతులు సీతారాముల కళ్యాణ మహోత్సవానికి పట్టు వస్త్రాలు సమర్పించి కళ్యాణ మహోత్సవంలో భాగమయ్యారు. ముత్తారం అభయంంజనేయ స్వామి, త్రి కోటేశ్వరాలయం, కొప్పూర్ గద్దల బండ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభోగంగా జరిగింది. పలు దేవాలయాల్లో జరిగిన కళ్యాణ మహోత్సవం కార్యక్రమానికి భక్తిశ్రద్ధలతో అధిక గా భక్తులు పాల్గొన్నారు. ముల్కనూర్ సాంబశివ ఆలయంలో కళ్యాణ మహోత్సవంలో భాగమైన భక్తులందరికీ అన్నదాత అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పలు దేవాలయాల్లో శ్రీరామ కళ్యాణ మహోత్సవానికి అంగరంగ వైభవంగా జరుపుతూ భక్తులకు అన్నదాన ప్రధానం చేశారు. ఈ కళ్యాణ మహోత్సవంలో ముల్కనూర్ గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, ఉప సర్పంచ్ కాసగోని మమత బాలకృష్ణ, సీనియర్ టిఆర్ఎస్ నాయకులు దార్నా శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఊస కోయిల ప్రకాష్, గొల్లపల్లి లక్ష్మయ్య మాజీ ఎంపిటిసి అప్పని పద్మ బిక్షపతి, మాజీ ఎంపీటీసీ బొల్లంపల్లి రమేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ యదలాపురం తిరుపతి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కుల అనిల్, అలిగిరెడ్డి రాజిరెడ్డి, కొదురుపాక శ్రీనివాస్, బీజేవైఎం నాయకులు అయితేసాయి, చిదురాల శ్రీనివాస్, భీమదేవరపల్లి ఉపసర్పంచ్ శనిగరం ఐలయ్య, మాచర్ల సదానందం, బత్తినిరాంబాబు ,డబ్బా వెంకటేశ్వర్లు బొల్లంపల్లి శ్యామ్, శ్రీనివాసరెడ్డి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వైభవంగా సీతారాముల కళ్యాణం



**మహాదేవపూర్ మార్చి27మనం న్యూస్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని శ్రీ సీతారాముల దేవాలయంలో శుక్రవారం రోజున సీతారాముల కళ్యాణం లో ఉప సర్పంచ్ శ్రీజ సంతోష్ లు పాల్గొనడం జరిగింది. మండల కేంద్రంలోని శ్రీ సీతారాముల దేవాలయంలో అంగరంగ వైభవంగా కనుల విందుగా సీతారాముల కల్యాణాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన మహాదేవపూర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ శ్రీజ సంతోష్ లు సీతారాముల కళ్యాణం లో పాల్గొని సీతారాముల ఆశీర్వాదాలు గ్రామ ప్రజలకు ఉండాలని, రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ పంట అధిక దిగుబడి వస్తూ పండిన పంటకు లాభం చేకూరేలా ఉండాలని స్వామివారిని కోరుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

# రాములోరి కల్యాణానికి పురపాలక సంఘం తరపున పట్టువస్త్రాలు సమర్పణ



**వేములవాడ,మార్చి 27(మనం న్యూస్):** వేములవాడ రాజన్న క్షేత్రంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. లోక కల్యాణార్థం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం గుడి చెరువులో నిర్వహించిన శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణోత్సవానికి పురపాలక సంఘం తరపున పట్టువస్త్రాల సమర్పణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మరియు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు కలిసి ఈ వేడుకలో పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయంలో పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంగళ వాయిద్యాలు, కోలాటాలు మరియు వేద మంత్రోచ్చారణల నడుమ పురవీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. మున్సిపల్ కార్యాలయం నుండి రాజన్న సన్నిధి వరకు సాగిన ఈ శోభాయాత్రలో భక్తులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని జై శ్రీరామ్ నినాదాలతో మారుమోగించారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద దేవస్థాన అధికారులు వీరికి ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మరియు పుల్కం రాజు మాట్లాడుతూ సీతారాముల పవిత్ర బంధం లోకానికి ఆదర్శమని కొనియాడారు. రాజన్న క్షేత్రంలో జరిగే ఈ మహోత్కార్యాన్ని వీక్షించేందుకు వచ్చే వేలాది మంది భక్తులకు మున్సిపాలిటీ తరపున పక్కాగా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని ప్రధాన కూడళ్లలో చల్లని తాగునీరు మరియు మజ్జిగ పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం అదనపు సిబ్బందిని కేటాయించామని, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా మున్సిపల్ యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ముఖ్యంగా వేములవాడ నియోజకవర్గం పాడిపంటలతో విలసిల్లాలని ఆ దివ్యమూర్తులను వేడుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, వైస్ చైర్మన్ నరాల శేఖర్ తో పాటు వివిధ వార్డుల కౌన్సిలర్లు, రాజకీయ నాయకులు, మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సీతారామ కళ్యాణం రాముని పురుషోత్తమత్వానికి, సీతమ్మవారి పాతివ్రత్యానికి నిదర్శనం

**గజ్వేల్, మార్చి 27 మనం న్యూస్:** గజ్వేల్ పట్టణంలోని శ్రీ మురళీకృష్ణ ఆలయంలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా సుందర సత్సంగ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఉదయం 10 గంటలకు శ్రీ సీత రామ లక్ష్మణ హనుమ సమేత ఉత్సవిగ్రహాలతో పల్లకి సేవను శ్రీ మురళీకృష్ణ ఆలయం నుండి గాంధీ చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా సాగింది అనంతరము అక్కడనుండి తిరిగి ఆలయానికి చేరుకోవడం జరిగింది. అనంతరం సీతారాముల కల్యాణాన్ని వేద పండితులు అవినాష్ మిశ్రా, శ్రీనాథ్ లు కళ్యాణాన్ని వేదమంత్రాల మధ్య నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఉప్పల వెంకటేశం, దూబకుంట మైత్రములు మాట్లాడుతూ సీతారామ కళ్యాణం హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన, లోక కళ్యాణార్థం జరిగే వివాహ మహోత్సవం. విశ్వామిత్రుని వెంట మిథిలా నగరానికి వెళ్లిన శ్రీరాముడు, జనక మహారాజు ఏర్పాటు చేసిన స్వయంవరంలో శివధనుస్సును విరిచి, సీతాదేవిని వివాహం చేసుకున్న ఘట్టం ఇది. ఈ పవిత్రమైన వివాహం చైత్ర శుద్ధ నవమి శ్రీరామనవమి నాడు



జరుగుతుంది అని తెలిపారు.సీతారామ కళ్యాణం అంటే కేవలం ఒక వివాహం కాదు, రాముని మర్యాద పురుషోత్తమత్వానికి, సీతమ్మవారి పాతివ్రత్యానికి నిదర్శనం అన్నారు. అనంతరం అంతునూరి వినోద మాట్లాడుతూ పూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామి సుందర చైతన్యానందుల వారి దివ్య ఆశీస్సులతో ప్రతి సంవత్సరము మా కృష్ణాలయంలో శ్రీరామనవమి కానీ కృష్ణాష్టమి కానీ వివిధ పండుగలకు సంబంధించిన అన్ని కార్యక్రమాలు ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందని,రామో విగ్రహ వాన్ ధర్మః శ్రీరామచంద్రుడు ధర్మముతో పోతబోసిన ప్రేమ మూర్తి అని, సకల చరాచర సృష్టికి ఆధార మూలమైన విష్ణుమూర్తి ఏ సాక్షాత్ ధర్మాన్ని స్థాపించడానికి అధర్మాన్ని అంతం చేయడానికి శ్రీరామచంద్ర భగవానుడనిగా ఈ ప్రపంచంలో అవతరించడం జరిగిందన్నారు.భార్యాభర్తల మధ్య ఉండాల్సిన అన్యోన్యతకు, ఆదర్శ వివాహానికి ప్రతీక. ముఖ్యంగా గజ్వేల్ పట్టణంలోని శ్రీ మురళీకృష్ణ ఆలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా జరుపు కుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సుందర సత్సంగ్ సభ్యులు అత్తిలి లక్ష్మయ్య, అంతునూరి



శివకుమార్, చింతకుంట మల్లికార్జున్ రెడ్డి, తడకమండ్ల జై హిందు, దూ పకుంట లచ్చయ్య, కాశీనాథ్, బడ్జెట్ మున్సిపల్ వైస్ చైర్మన్ కళ్యాణ్కర్ నర్సింగరావు పద్మ భాయ్ కౌన్సిలర్ శ్రీనివాస్, స్వప్న సురేష్, గోలి మమతా సంతోష్, బండి వెంకట నరసయ్య, శ్రీనివాస్, సిరిపురం సత్యనారాయణ ధూపకుంట లక్ష్మణ్,తో పాటు తదితరులు పాల్గొన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ అన్న ప్రసాద కార్యక్రమాన్ని కమిటీ వాళ్ళు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో సుమారు వెయ్యి మంది వరకు పాల్గొనడం జరిగింది.

## సీతారాముల కళ్యాణం.. లోకకళ్యాణం!



- వైభవంగా రామయ్య పెళ్లివేడుక
- భక్తిపారవశ్యంలో మునిగితేలిన చేవెళ్ల
- ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాల సమర్పణ
- భారీగా తరలివచ్చిన భక్తులు.. కిక్కిరిసిన ఆలయ ప్రాంగణాలు

**చేవెళ్ల, మార్చి 27 (మనం న్యూస్):** మండల కేంద్రమైన చేవెళ్లలో శ్రీరామనవమి వేడుకలు అంబరాన్నంటాయి. సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రామాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. 'శ్రీరామ జయరామ' నామస్మరణతో మారుమోగాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తి స్వామివారిని దర్శించుకున్నారు.

### శాస్త్రోక్తంగా కళ్యాణ ఘట్టం

అభిజిత్ లగ్నంలో అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణల మధ్య సీతమ్మ, రామయ్యల కళ్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. మంగళవాయిద్యాల మోత, భక్తుల జయజయధ్వానాల మధ్య ముత్యాల తలంబ్రాల వేడుక కన్నులవిందుగా సాగింది. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

### భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర

కళ్యాణానికి ముందు సీతారామ లక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. మహిళలు హారతులు పట్టి స్వామివారికి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు, పోలీసులు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు.

## చలివేంద్రాన్నిప్రారంభించిన సర్పంచ్



**మహాదేవపూర్, మార్చి 27మనం న్యూస్:** శ్రీరామనవమి వేడుకలకు విచ్చేస్తున్న భక్తుల సౌకర్యం కొరకు మండల కేంద్రంలోని బొమ్మపూర్ క్రాస్ వద్ద శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ మరియు విశ్వబ్రాహ్మణ పంచ వృత్తుల సంఘం మహాదేవపూర్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ హసీనాబాన్ అక్బర్ ఖాన్ మరియు వార్డ్ మెంబర్స్ విశ్వబ్రాహ్మణ పంచ వృత్తుల సంఘ సభ్యులు చీర్లవంచ చంద్రశేఖర్ పోలోజు వెంకటేశ్వర్లు సతీష్ మనోహర్ చీర్లవంచ రమేష్ విజయగిరి దేవేందర్ పూసల వెంకటస్వామి లక్ష్మీనారాయణ సుదర్శన్తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకంపై అవగాహన

**మహాదేవపూర్ మార్చి27మనం న్యూస్:** శ్రీరామనవమి సందర్భంగా శ్రీ మందరగిరి వెంకటేశ్వరస్వామి మందిరం పరిసరాలలో ఏర్పాటు చేసిన శ్రీ సీతారామకళ్యాణానికి వచ్చిన భక్తులకు శుక్రవారం రోజున సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్ల వాడకంపై ఎన్జిసి ఇన్చార్జి ప్రభాకర్ రెడ్డి అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడటం వల్ల జరిగే వాతావరణ కాలుష్యం, అనారోగ్య సమస్యలు, జీవవైవిధ్యం దెబ్బతినడం వంటి అనర్థాలను వివరిస్తూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ ప్లాస్టిక్ వాడకం పూర్తిగా ఆపాలని, వాటి స్థానంలో బయోడిగ్రేడేబుల్ బ్యాగులు వాడాలని కోరడం జరిగింది. ఈ అవేరనెస్ ప్రోగ్రాంలో బాలుర పాఠశాల ఎన్ జి సీ ఇంచార్జి బి




ప్రభాకర్ రెడ్డి,బాలికల పాఠశాల సైన్స్ టీచర్ మడ్క మధు మరియు ఉభయ పాఠశాలల విద్యార్థులు సే నో టూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ అనే నినాదాలు ఉన్న ప్ల కారడ్స్ ప్రదర్శించి నినాదాలు చేశారు.ఓ విద్యార్థి వినూత్న ప్రయత్నంలో భాగంగా పలురకాల సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులను అంటించిన డ్రెస్ ధరించి అందరి దృష్టిని ఆకర్షించాడు.ఏ ఏ ప్లాస్టిక్ వల్ల మనకు హాని జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు.

మనం Manam



# భక్త జన క్షీరసాగర్

- వైభవోపేతంగా రాములోరి లగ్గం
- కమనీయం.. రాములోరి కల్యాణం
- కన్నుల పండువగా వివాహ వేడుక
- మార్మోగిన రామనామస్మరణ
- తిలకించి తరించిన భక్తజనం









**ములుగు, మార్చి 27(మనంన్యూస్):** జగదానందకారకుడు...జగదభిరాముడు...జానకిం ాముడు సర్వాంగ సుందరంగా ముస్తాబై కల్యాణ వేదికపై చిద్విలాసం చేశారు. సనాతన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు అనుసరించి తెలుగుగింటి ఆరాధ్య దైవం కోదండరామయ్య రమణీయంగా అలంకృతుడై పెళ్లివేదికకు చేరుకున్నారు. సద్గుణ సమ్మోహన స్వరూపం, లోకపావని, ధర్మదేవత సిగ్గులొలికే సీతమ్మ నవవధువుగా కల్యాణశోభతో కదిలివచ్చారు. రఘు కుల తిలకుడు దశరథ మహారాజు తనయుడు శ్రీరామచంద్రుడికి, జనక చక్రవర్తి స్వీకృత సుపుత్రిక మహాలక్ష్మీ స్వరూపిణి జానకిదేవి కల్యాణం రమణీయంగా, కమనీయంగా అంగరంగ వైభవంగా జరిగింది. సర్వమంగళ స్వరూపుడు శ్రీరాముడు, సకలజన శుభధాత్రి సీతమ్మ మూడు ముళ్ల బంధంతో ఒక్కటైన వేళ భక్తజనం ఆనందంతో పులకించిపోయారు. ప్రతి హృదిలో జగదానందం తొణికిసలాడింది. జగమంత సంబరం ముగ్ధమనోహరంగా సాగింది.

**భక్త జన క్షీరసాగర్....**

శ్రీరామ నవమి వేడుకలు ములుగు మండలం క్షీరసాగర్లో భక్తులు ఎంతో వైభవోపేతంగా నిర్వహించారు. ముఖ్యంగా శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని రామాలయాల్లో వేద మంత్రోచ్ఛరణల మధ్య సిద్దిపేట జిల్లా సర్పంచ్ల ఫోం జిల్లా అధ్యక్షుడు, క్షీరసాగర్ సర్పంచ్ కొన్యాల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కన్నులపండువగా రాములోరి కల్యాణం జరిపారు. ఒక్కరోజు ముందుగానే ఆల యాలను విద్యుత్కాంతులతో ముస్తాబు చేసిన ఆలయ కమిటీ సభ్యులు సీతారాముల కల్యాణానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లలో భాగంగా సీతాసమేతుడైన శ్రీరామచంద్రున్ని ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలయాలకు తీసుకొచ్చారు. సాయంత్రం వారి కల్యాణం నిర్వహించారు. జీలకర్ర బెల్లం ఘట్టం, మంగళసూత్రధారణ, తలంబ్రాలను చల్లుకునే ప్రక్రియలను చూసి భక్తులు పులకించారు. కల్యాణోత్సవాన్ని ఆద్యంతం భక్తులు కనులార్పకుండా చూసి ఆనంద పరవశులయ్యారు.

**వేడుకల్లో పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి**

క్షీరసాగర్ గ్రామంలో శ్రీ శ్రీ కోదండరామాస్వామి తిరుకల్యాణ మహోత్సవంలో మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అంతకుముందు కొన్యాల బాల్‌రెడ్డి మంత్రికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన పూజ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీర్వచనంతో పాటు వేదపండితుల ఆశీస్సులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తుమ్ముంట నర్సారెడ్డి, వంటెరు ప్రతాప్ రెడ్డి,మాజీ సర్పంచ్ వెంకటేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ తారక సురేష్,గ్రామ వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రొయ్యూరులో ఆధ్యాత్మిక శోభ

## శ్రీరామచంద్రుని పాద చెంత కాకులమర్రి లక్ష్మణ్ బాబు



**ఏటూరునాగారం,మార్చి 27 మనం ప్రతినిధి:** ఏటూరునాగారం మండలంలోని రొయ్యూరు గ్రామం భక్తి పారవశ్యంలో మునిగితేలింది. లోక కల్యాణార్థం నిర్వహించిన శ్రీ సీతారామచంద్రస్వామి వారి కళ్యాణ మహోత్సవ వేడుకలో ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మరియు ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయ అభివృద్ధికి భక్తితో పాటు సేవా దృక్పథాన్ని చాటుకుంటూ, రొయ్యూరు దేవస్థానంలోని 'ముత్యాల మండప' నిర్మాణ పనుల నిమిత్తం లక్ష్మణ్ బాబు రూ. 25,000/- (ఇరవై ఐదు వేల రూపాయలు) నగదును ఆలయ కమిటీకి విరాళంగా అందజేశారు.భక్తి శ్రద్ధలతో దర్శనంకళ్యాణ మహోత్సవ వేడుకను వీక్షించిన అనంతరం, కాకులమర్రి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'సీతారాముల ఆశీస్సులతో మన ఏటూరునాగారం మరియు ములుగు జిల్లా ప్రజలందరూ సుఖసం తోషాలతో ఉండాలని, ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో ఐక్యతను పెంచుతాయని' పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ పిఏ సిఎస్ చైర్మన్ కూనూరు అశోక్ గౌడ్ స్థానిక సర్పంచ్ కవిరి అర్జున్, గుడి చైర్మన్ అల్లంల రమేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు దుర్గం లక్ష్మణ్, వార్డ్ సభ్యులు కొండగుర్ల తిరుపతి, కురుమ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి

# పోటెత్తిన భక్త జనం



**మంగపేట, మార్చి 27 : మనం ప్రతినిధి,:** శ్రీరామ నవమి సందర్భంగా ములుగు జిల్లా మంగపేట మండలంలోని పలు గ్రామాలలోని రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాలలో శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. మంగపేట మండలంలోని కమలాపురంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, పాత ఊరులోని ( వేప చెట్టు దగ్గర ) శ్రీ సంజీవ అంజనేయ స్వామి ఆలయం, బోరు నర్సాపురంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయం, చెరుపల్లిలోని కోదండ రామాలయం, తిమ్మంపేటలోని రామాలయం, రాజుపేటలోని రామాలయం, జిల్లా సరిహద్దు గ్రామమైన అకినేపల్లి మల్లారం గ్రామంలోని రామాలయంలో జరిగిన రాములోరి కళ్యాణానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. శ్రీరామ నవమిని పురష్కరించుకుని కమలాపురంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రతాపురం శ్రీనివాసాచార్యులు, ఆలయ అర్చకులు ప్రతాపురం వంశీ కుమారాచార్యులు, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు ఈశ్వరానందశర్మ, ఆయా ఆలయాలలో ఆయా ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, వేద మంత్రాల నడుమ శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా పలు ఆలయాలలో ఆలయ కమిటీ అధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి భక్త జనం పోటెత్తారు. ఆయా ఆలయాలలో జరిగిన రాములోరి కళ్యాణం, అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ఆయా ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లను చేశారు.

# కాటికి పోయే ఈ ముసలి తనంలో కష్టాలు ఎదురయ్యావయ్యా...?

- అల్లమురబ్బా అమ్ముకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న వృద్ధురాలు
- నా గోడు ఎవరికి చెప్పుకుంటే తీరునయ్యా
- వృద్ధురాలు ఎల్లమ్మ వేదన...



**ఉమ్మడి మహబూబ్ నగర్ మార్చి 27 (మనం బ్యూరో):** కాటికి పోయే ఈ ముసలితనములో ఈ కష్టాలు ఏంటయ్యా అంటూ ఆ వృద్ధురాలు కన్నీటి పర్యంతమైంది. అందుకు సంబంధించిన వివరాల ప్రకారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రాంతానికి చెందిన వారినని వృద్ధురాలు ఎల్లమ్మ బోరున విలపిస్తుంది చెప్పుకొచ్చింది. 70 ఏళ్ల వయసులో నాకింకా ఈ కష్టాలు వింటయ్యా దేవుడా....! అంటూ తొందరగా నాకు చావైనా ప్రసాదించు అంటూ నిండు హృదయ సోదరులతో చెప్పుకొచ్చారు. ప్రస్తుతం మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన బస్టాండ్ సమీపంలో అల్లమురబ్బా అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్ననని ఆ 70 ఏళ్ల వృద్ధురాలు తెలిపారు. ఎంతో కష్టపడి అల్లంబ్బరప్ప తయారు చేసుకుని బస్టాండ్ కు వస్తే వాటిని అమ్ముకోవడానికి అటు ఇటు తిరుగుతూ ప్రాణం అలసిపోతుందని ఆవేదలు వెలిబుచ్చారు. ఎంతో కష్టపడితే తెచ్చిన అల్లబ్బరప్ప అమ్ముడుపోతేనే కాస్తో కోస్తో ఆకలితో కాలిన కడుపులు సగం నిండుతుందని ఆ ముసలి కన్నీరుతో ఆవేదన వెలిబుచ్చారు. ఆ వృద్ధురాలికి 5 మంది పిల్లలు ఉన్నారన్నారు. ఉన్న భర్త, ఒక్క కొడుకు మరణించడంతో ఒంటరితనం మిగిలిందన్నారు. 10 ఏళ్ల క్రితం ఒక్కగానోక కొడుకు మరణం, ఆ తరువాతి సంవత్సరానికే కుటుంబానికి పెద్ద దిక్కైన భర్త మృతి చెందడంతో కష్టాలు షురూ అయినాయని వృద్ధురాలు ఎల్లమ్మ తెలిపారు. తన భర్త ఉండగానే పిల్లల పెళ్లిళ్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎల్లమ్మ భర్త చనిపోయిన తరువాత ఉన్న 6 ఎకరాల పొలాన్ని అల్లుళ్లు స్వాధీనం చేసుకున్నారని వాపోయింది ఆ ముసలి తల్లి. ప్రస్తుతం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని బాలాజీనగర్లో చిన్న కూతురు వద్ద నివాసం ఉంటున్నానని తెలిపారు. ప్రస్తుతం నా కూతురును భర్త వదిలి వెళ్లడంతో అటు బ్రతకలేక ఇటు చావలేక, ఇటు చావలేక, బ్రతుకు జీవుడా అంటూ జీవనం వెళ్ళదిస్తున్నానని రోదిస్తూ తెలిపారు. కష్టంలో ఉన్న బిడ్డని చంపుకోలేక, కష్టపడలేని స్తోమత లేక నాకు చావు రాక, ఏంటా ఈ కర్మ అంటూ బ్రతుకు జీవన ప్రయాణంలో గడుపుతున్నామన్నారు. 6 ఏళ్లుగా మహబూబ్నగర్ పట్టణంలో అద్దె ఇంట్లో ఉంటూ బస్టాండ్లో అల్లబ్బురప్ప అమ్ముకుంటూ రోజుకు వచ్చిన పైసలు సుమారు రూ. 200 వస్తె, ఆ వచ్చిన డబ్బుతో కాస్తో కూస్తో బ్రతుకు పోరాటం చేస్తున్నామన్నారు. ఒక్కరోజు అల్లంబురప్ప అమ్మడం మానేస్తే ఆ రోజంతా పస్తువులు ఉండవలసిందేనని ముసలి కన్నీరుతో తమ ఆవేదన వెలిబుచ్చారు. పొట్టకూటికోసం రోజువారిగా కాళ్లు అరిగేటట్లు తిరిగితే బస్టాండ్లో కొంతమంది వ్యాపారస్తులు అసభ్యకరంగా మాట్లాడుతూ తరిమేస్తున్నారని వేదనతో ఆ వృద్ధురాలు తెలిపారు. తనకు తెల్ల రేషన్ కార్డు ఉన్నప్పటికీ నెలకు కేవలం 6 కిలోల బియ్యం మాత్రమే అందుతుందని తెలిపారు. కటిక దరిద్రంలో ఉన్న నాకు ఆసరా పెన్షన్ అందడం లేదన్నారు. 70 ఏళ్ల వయసులో ఇంక నాకికష్టం ఏంటని కన్నీటి పర్యాయంతమయ్యారు. కాటికి పోయే వయసులో ముసలవ్వ పడుతున్న కష్టాన్ని చూసి పట్టణంలో ఉన్న పరువు పట్టణ ప్రజలు ఎల్లమ్మ ధైర్యాన్ని చూసి సుభాష్ అంటున్నారు. మరి కొంతమంది పట్టణ ప్రజలు ఎల్లమ్మకు తక్షణ సహాయంగా ప్రజాప్రతినిధులు నిలువ వలసిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు. రెక్క ఆడితే గాని డొక్కాడని ఆ వృద్ధురాలు ఎల్లమ్మ దీనగాద స్థితిని గమనించి తక్షణమే ఆసరా పెన్షన్, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండదండలు ఉండాలని పట్టణ ప్రజలు క్షేత్రస్థాయిలో కోరుతున్నారు.

# ముగిసిన మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతులు

- పునరుద్ధరించబడిన తాగునీటి సరఫరా

**ఏటూరునాగారం, మార్చి 27: మనం ప్రతినిధి:** ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో గత మూడు రోజులుగా తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగించిన మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ మరమ్మతు పనులు ఎట్టకేలకు శుక్రవారం సాయంత్రానికి విజయవంతంగా పూర్తయ్యాయి. సర్పంచ్ శ్రీమతి కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు మరియు వార్డు సభ్యులు బట్టు మానస గోపి ప్రత్యేక చొరవ తీసుకుని, మూడు రోజుల పాటు అహర్నిశలు శ్రమించి ఈ సమస్యను పరిష్కరించారు. విద్యుత్ శాఖ పనుల వల్ల ప్రమాదవశాత్తు ధ్వంసమైన ఈ పైపులైన్ మరమ్మతు చేయడం సవాలుగా మారింది. అయినప్పటికీ, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయి పర్యవేక్షణ: సర్పంచ్ శ్రీలత మరియు బట్టు మానస గోపి స్వయంగా పనుల వద్దే ఉండి, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. యుద్ధప్రాతిపదికన పనులు: ఇతర ప్రాంతాల నుండి ప్రత్యేక వెల్డింగ్ యంత్రాలను, సామాగ్రిని తెప్పించి, మూడు రోజుల పాటు పనులను కొనసాగించారు.ప్రధాన పైపులైన్ లీకేజీలను అరికట్టి, శనివారం ఉదయం నుండి గ్రామమంతటా యథావిధిగా తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. 'పైపులైన్ దెబ్బతినడం వల్ల గత మూడు రోజులుగా ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బంది మాకు తెలుసు. ఈ క్లిష్ట సమయంలో మా పనులకు ఆటంకం కలగకుండా, ఎంతో ఓపికతో మాకు సహకరించిన గ్రామ ప్రజలందరికీ, ముఖ్యంగా వార్డు ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాం' అని పేర్కొన్నారు.ముఖ్యంగా వార్డు సభ్యులు బట్టు మానస గోపి ఈ పనుల పూర్తి కోసం సిబ్బందితో కలిసి నిరంతరం శ్రమించారని, వారి కృషితోనే పనులు త్వరగా పూర్తయ్యాయని సర్పంచ్ ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, మిషన్ భగీరథ అధికారులు మరియ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# శ్రీరామనవమి వేడుకల్లో పల్లవి రాజు నాయక్



**హనుమకొండ, మార్చి 27(మనం న్యూస్):** గుండ్ల సింగారం గణేష్ నగర్ ఆలయంలో శ్రీ సీతారామచంద్ర వారి కళ్యాణం లో భాగంగా హనుమకొండ జిల్లా 2వ డివిజన్ గుండ్ల సింగారం గణేష్ నగర్లో శ్రీ రాములవారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణానికి చింతలపూడి చంద్రశేఖర్ సంధ్య, చక్రపాణి కవిత , శశిధర్ లత, లక్ష్మీనారాయణ లావణ్య, రాజయ్య సుజాత ,అశోక్ ఉమా, సురేంద్ర చారి అను ,సదానందం రజిత, సత్యనారాయణ, రమేష్, లావుడియా పల్లవి రాజు నాయక్, వనిత, సౌందర్య కాంతి, కమల, రాధిక, సరిత, సునీత, రాజేశ్వరి, కమల, రజిని, రజిత, భారతి, చంద్రకళ, సునీత, భారతి, రాజేశ్వరి, సునీత, బోడ బాలమణి, నవ్య, శారద రవి, సురేష్, రంగ, గ్రామ ప్రజలు పాల్గొని పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది .ఈ కార్యక్రమంలో రాజేష్, అభిలాష్, పూజిత కుమార్, హేమంత్ ,పవన్ ,చరణ్ తేజ, విష్ణువర్ధన్ ,సురేష్ బాబు, భక్తులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో వైభవంగా సీతారాముల కళ్యాణం

- సీతారాములకు 2కిలోల 250 గ్రాముల బంగారు ఆభరణాలతో అలంకరణ
- 10కిలోల వెండితో ఆదిశేషుడు, కళ్యాణ పీటను చేయించిన జగ్గారెడ్డి
- కళ్యాణ వేడుకలో 3 క్వింటాళ్ల మేలిమి ముత్యాల తలంబ్రాలు సమర్పణ
- అనంతరం భక్తులకు పంపిణీ
- భక్తులతో కిక్కిరిసిన సంగారెడ్డి రామ్ మందిర్
- సంగారెడ్డిలో వైభవంగా సీతారాముల కళ్యాణం





**సంగారెడ్డి మార్చి 27 మనం న్యూస్ ప్రతినిధి:** సంగారెడ్డి లోని రామ్ నగర్ రామ్ మందిర్ లో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సీతారాముల కళ్యాణం కన్నుల పండువగ జరిగింది. టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కళ్యాణ వేడుకకు ఘనమైన ఏర్పాట్లు చేశారు. కళ్యాణ మహోత్సవం కొరకు తాను స్వయంగా చేయించిన 2 కిలోల 250 గ్రాముల బంగారు ఆభరణాలను తన ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్దకు వచ్చారు. ఉదయం సీతా సమేత శ్రీరామచంద్రుడి విగ్రహాలకు అలంకరింప చేశారు. స్వర్ణాభరణాలతో ఆధ్యాత్మికత ఉట్టిపడుతున్న సీతారామ చంద్రులను చూసి భక్తులు తన్మయత్వం చెందారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి అర్ధరాత్రి వరకు రామ్ మందిర్ లో భక్తుల రద్దీ కిక్కిరిసింది. భక్తులందరికీ తీర్థం ప్రసాదాలను అందించారు.

**వైభవంగా కళ్యాణ వేడుక...**

రంగంపేట పీఠాధిపతులు పూజ్యశ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి పర్యవేక్షణలో జ్యోతిర్వాస్తు విద్యాపీఠం పీఠాధిపతి శ్రీ మహేశ్వర సిద్ధాంతి ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. వేదమంత్రోచ్చారణలు, డప్పు చప్పుళ్ళ నడుమ భక్తుల అందరి సమక్షంలో కళ్యాణ మంత్రాలు మార్మోగాయి. కళ్యాణ వేడుకలు పుస్తెలతాడు కట్టే సమయంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. జగ్గారెడ్డి సమర్పించిన 3 క్వింటాళ్ల ముత్యాల తలంబ్రాలతో అంగరంగ వైభవంగా కళ్యాణ వేడుకలు జరిపించారు. అనంతరం ముత్యాల తలంబ్రాలను మహేశ్వర సిద్ధాంతి చేతులమీదుగా భక్తులకు పంపిణీ చేశారు. ఈ కళ్యాణ వేడుకలో జగ్గారెడ్డి తో పాటు ఆయన భార్య టిజిఐఐసి చైర్పర్సన్ నిర్మల, కూతురు జయ రెడ్డి, అల్లుడు గుణ చైతన్య రెడ్డి, కొడుకు భరత్ సాయిరెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

**జగ్గారెడ్డి సమర్పించిన కానుకలు ఇవే..**

సీతారాముల వారికి 2 కిలోల 250 గ్రాముల బంగారం తో కర్ణాభరనాలతో కూడిన కిరీటాలు, కంటాభరణాలు, వడ్డానాలు, పద్మ పాదాలు, ధనస్సు, బాణం, యజ్ఞోపవేతం, నయనాలు , తిలకాలు, ముక్కు పోగు, శంకు చక్రాలు, అమ్మవారికి మంగళ సూత్రం , అమ్మవారికి కమల హస్తం, శ్రీ రాముల వారికి శరం తో కూడిన హస్తం తో పాటు10 కిలోల వెండి తో ఆదిశేషుడు, వెండి కల్యాణ పీటను జగ్గారెడ్డి సమర్పించారు. అంతకు ముందు తన ఇంట్లో ఆభరణాలకు పూజలు చేసి ఊరేగింపుగా ఆలయానికి బయలుదేరి వచ్చారుసంగారెడ్డి లోని రామ్ నగర్ రామ్ మందిర్ లో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సీతారాముల కళ్యాణం కన్నుల పండువగ జరిగింది. టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కళ్యాణ వేడుకకు ఘనమైన ఏర్పాట్లు చేశారు. కళ్యాణ మహోత్సవం కొరకు తాను స్వయంగా చేయించిన 2 కిలోల 250 గ్రాముల బంగారు ఆభరణాలను తన ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్దకు వచ్చారు. ఉదయం సీతా సమేత శ్రీరామచంద్రుడి విగ్రహాలకు అలంకరింప చేశారు. స్వర్ణాభరణాలతో ఆధ్యాత్మికత ఉట్టిపడుతున్న సీతారామ చంద్రులను చూసి భక్తులు తన్మయత్వం చెందారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి అర్ధరాత్రి వరకు రామ్ మందిర్ లో భక్తుల రద్దీ కిక్కిరిసింది. భక్తులందరికీ తీర్థం ప్రసాదాలను అందించారు.

**వైభవంగా కళ్యాణ వేడుక.**

రంగంపేట పీఠాధిపతులు పూజ్యశ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి పర్యవేక్షణలో జ్యోతిర్వాస్తు విద్యాపీఠం పీఠాధిపతి శ్రీ మహేశ్వర సిద్ధాంతి ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. వేదమంత్రోచ్చారణలు, డప్పు చప్పుళ్ళ నడుమ భక్తుల అందరి సమక్షంలో కళ్యాణ మంత్రాలు మార్మోగాయి. కళ్యాణ వేడుకలు పుస్తెలతాడు కట్టే సమయంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. జగ్గారెడ్డి సమర్పించిన 3 క్వింటాళ్ల ముత్యాల తలంబ్రాలతో అంగరంగ వైభవంగా కళ్యాణ వేడుకలు జరిపించారు. అనంతరం ముత్యాల తలంబ్రాలను మహేశ్వర సిద్ధాంతి చేతులమీదుగా భక్తులకు పంపిణీ చేశారు. ఈ కళ్యాణ వేడుకలో జగ్గారెడ్డి తో పాటు ఆయన భార్య టిజిఐఐసి చైర్పర్సన్ నిర్మల, కూతురు జయ రెడ్డి, అల్లుడు గుణ చైతన్య రెడ్డి, కొడుకు భరత్ సాయిరెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

**జగ్గారెడ్డి సమర్పించిన కానుకలు ఇవే..**

సీతారాముల వారికి 2 కిలోల 250 గ్రాముల బంగారం తో కర్ణాభరనాలతో కూడిన కిరీటాలు, కంటాభరణాలు, వడ్డానాలు, పద్మ పాదాలు, ధనస్సు, బాణం, యజ్ఞోపవేతం, నయనాలు , తిలకాలు, ముక్కు పోగు, శంకు చక్రాలు, అమ్మవారికి మంగళ సూత్రం , అమ్మవారికి కమల హస్తం, శ్రీ రాముల వారికి శరం తో కూడిన హస్తం తో పాటు10 కిలోల వెండి తో ఆదిశేషుడు, వెండి కల్యాణ పీటను జగ్గారెడ్డి సమర్పించారు. అంతకు ముందు తన ఇంట్లో ఆభరణాలకు పూజలు చేసి ఊరేగింపుగా ఆలయానికి బయలుదేరి వచ్చారు.

# అంగరంగ వైభవంగా శ్రీ రామువడి కళ్యాణం

- వాడవాడలా సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహణ
- పలుచోట్ల అన్నదానం



మణుగూరు, మార్చి 27(మనం న్యూస్): మండల వ్యాప్తంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మణుగూరు పట్టణం, గ్రామాలు, అన్న తేడా లేకుండా ప్రతి ఆలయంలో భక్తి శ్రద్ధలతో సీతారాముల కల్యాణం నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడగా, ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించి అనంతరం శ్రీరాముడు-సీతమ్మల దివ్య కల్యాణం ఘనంగా జరిపారు.మండలంలోని పలు గ్రామాల్లో గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కల్యాణోత్సవాలను నిర్వహించారు. పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆలయాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి. వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కళ్లారా దర్శించుకుని పులకించిపోయారు.ప్రత్యేకంగా యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి గీతాలు, హరికథలు, భజనలు నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని మరింత పెంచారు. కొన్నిచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

వాడవాడలా జరిగిన ఈ సీతారాముల కల్యాణాలు గ్రామీణ ప్రాంతాల్లో ఐక్యతను, భక్తి భావాన్ని ప్రతిబింబించాయి. భక్తులు తమ కుటుంబాల సౌఖ్యసంపదల కోసం, సమాజ శాంతి కోసం శ్రీ సీతారాములను ప్రార్థించారు.మొత్తంగా మండల వ్యాప్తంగా జరిగిన ఈ శ్రీరామ కళ్యాణోత్సవాలు భక్తి, సంప్రదాయం, సంస్కృతి సమ్మేళనంగా నిలిచి ప్రతి ఒక్కరినీ ఆధ్యాత్మిక భావనలో ముంచెత్తాయి. శ్రీరాముని కళ్యాణం అనంతరం పలుచోట్ల అన్నదానాన్ని కూడా చేశారు.

## గోదావరి పుష్కరాల నాటికి ఆలయ తొలి దశ అభివృద్ధి పనులు పూర్తి..

రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ



భద్రాచలం, మార్చి 27 (మనం న్యూస్): గోదావరి పుష్కరాల నాటికి ఆలయ తొలి దశ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ తెలిపారు. శుక్రవారం భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అనంతరం మంత్రివర్యులు కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ భద్రాచలంలోని శ్రీ సీతారాముల వారి కళ్యాణానికి ప్రాముఖ్యత ఉందని, దేశ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు శ్రీ సీత రామచంద్ర స్వామి కళ్యాణాన్ని వీక్షిస్తారని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడవ సంవత్సరం మంత్రిగా తాను ఈ కళ్యాణ మహోత్సవ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలం ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో డిప్యూటీ సీఎం, స్థానిక మంత్రుల సహకారంతో స్థానికంగా అవసరమైన భూ సేకరణ చేసిన తర్వాత, రాబోయే సంవత్సరం గోదావరి పుష్కరాలు జరుగుతున్న నేపథ్యంలో మొదటి విడత కింద భద్రాచలం ఆలయానికి 351 కోట్ల రూపాయలతో చేపట్టే అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. గోదావరి పుష్కరాల సమయానికి ప్రస్తుతం చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు దేవాదాయ శాఖ కృషి చేస్తుందని అన్నారు. తర్వాత రెండవ విడత నిధులు విడుదల చేసుకొని కృష్ణ పుష్కరాల నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. కళ్యాణ మహోత్సవాన్ని తిలకించిన భక్తులందరికీ శ్రీ రామచంద్ర స్వామి ఆశీస్సులు ఉండాలని, ప్రజా ప్రభుత్వానికి శ్రీరామచంద్రమూర్తి శక్తిని కల్పించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఆశీర్వదించాలని మంత్రి కోరారు.

## మత సామరస్యానికి ప్రతీక

### మజ్జిగ పంపిణీ చేసిన ముస్లిం యువత



ఖమ్మం, మార్చి 27(మనం న్యూస్): శ్రీ రామ నవమి పర్వదిన సందర్భంగా భక్తులు ఇబ్బంది పడకుండా ముస్లిం యువత మజ్జిగ పంపిణీ చేసి తమ ఔన్నత్యాన్ని చాటుకున్నారు. ఖమ్మం నగరంలోని నిజాం పేట కు చెందిన నిజామ్స్ ముస్లిం యూత్ ఆధ్వర్యంలో శ్రీ రామ నవమి పండుగ సందర్భంగా కళ్యాణం చూసేందుకు వెళ్లి వస్తున్న భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. జెడ్పీ సెంటర్ నుండి పాత బస్ స్టాండ్ వచ్చి పోయే భక్తులకు నిజం పేట్ మజీద్ మెయిన్ రోడ్ వద్ద మజ్జిగా పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి,వచ్చి పోయే భక్తులకు మజ్జిగ పంపిణీ చేసి, వారి దాహార్తిని తీర్చారు. ఈ తంతును గత 15 ఏళ్లుగా నిర్వహిస్తున్నట్లు నిజామ్స్ ముస్లిం యువత పేర్కొన్నారు. గత ఏడాది భద్రాచల రాములవారి సన్నిధిలో కూడా మజ్జిగ పంపిణీ చేశామని, సమయాభావం తో ఈ సారి ఖమ్మంలోనే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. భారత దేశంలో నివసిస్తున్న ప్రజలందరూ ఒకే కుటుంబమని, కుల మతాలకు అతీతంగా అందరం సుఖ శాంతులతో సంతోషంగా జీవించేలా చూడాలని ఆ అల్లాని వేడుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ఆర్టీసీ బస్సు లో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులకు సైతం మజ్జిగ పంపిణీ చేశారు.

## కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కాటూరి సంజీవరావు ఎన్నిక..

### పేదలకు న్యాయం చేయడమే లక్ష్యం : సంజీవరావు



పాల్వంచ, మార్చి 27(మనం న్యూస్): కొత్తగూడెం న్యాయవాదుల సంఘం (బార్ అసోసియేషన్) ఉపాధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది కాటూరి సంజీవరావు ఎన్నిక కావడం న్యాయవాద వర్గాల్లో ఆనందాన్ని కలిగించింది. ఎన్నో సంవత్సరాలుగా న్యాయవాదిగా సేవలందిస్తూ.. న్యాయ రంగంలో మంచి పేరు సంపాదించిన ఆయనకు సహచర న్యాయవాదులు ఘన విజయం అందించారు. మొత్తం ఓట్లలో 87 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందిన సంజీవరావు నాయకత్వాన్ని న్యాయవాదులు ప్రశంసించారు. కాటూరి సంజీవరావు చాలా కాలంగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ.. ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నారు. ముఖ్యంగా పేదలు, బలహీన వర్గాల ప్రజలు ఎదుర్కొనే న్యాయ సమస్యల పరిష్కారానికి ఆయన ప్రత్యేకంగా ముందుకు వచ్చి ఉచిత న్యాయ సేవలు అందించడం ద్వారా మంచి గుర్తింపు పొందారు. డబ్బుల లేమి కారణంగా న్యాయం పొందలేక ఇబ్బంది పడుతున్న వారికి ఆయన అండగా నిలిచి అనేక కేసుల్లో సహాయం చేశారు. దీంతో ఆయనపై ప్రజల్లో విశ్వాసం పెరిగింది.

### న్యాయవాద వృత్తిపై అమితమైన ప్రేమ

న్యాయవాద వృత్తిపై ఉన్న ఆయనకు ఉన్న అమితమైన ఆకాంక్ష, అంకితభావం కుటుంబంపై కూడా ప్రభావం చూపింది. తన ఇద్దరు పిల్లలను కూడా అదే వృత్తిలోకి ప్రోత్సహించారు. ప్రస్తుతం ఆయన కుమారుడు న్యాయవాదిగా సేవలందిస్తుండగా.. కుమార్తె పట్టుదలతో చదువుకొని జడ్జిగా ఎంపికై న్యాయ రంగంలో సేవలు అందిస్తోంది. ఒక కుటుంబంలో తండ్రి, కుమారుడు న్యాయవాదులుగా ఉండగా.. కుమార్తె న్యాయమూర్తిగా సేవలందించడం న్యాయవాద వర్గాల్లో ప్రత్యేకంగా చర్చనీయాంశంగా మారింది. సేవా దృక్పథం కలిగిన వ్యక్తి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడం అభినందనీయమని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో న్యాయవాదుల సంక్షేమం, న్యాయ వ్యవస్థ పట్ల గౌరవం మరింత పెరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే సహచర న్యాయవాదులు, స్నేహితులు, పరిచయస్తులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

### నిరుపేదల చెంతకు న్యాయ సేవలు..

ఈ సందర్భంగా మాట్లాడిన కాటూరి సంజీవరావు తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రతి న్యాయవాదికి కృతజ్ఞతలు తెలిపారు. 87 ఓట్ల భారీ మెజారిటీతో గెలిపించిన వారి విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని హామీ ఇచ్చారు. న్యాయవాదుల సమస్యలు, వారి సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని అన్నారు. అంతే కాకుండా బార్ అసోసియేషన్ అభివృద్ధికి సహచరులతో కలిసి ముందుకు సాగుతానని తెలిపారు. అదేవిధంగా పేదలు, న్యాయం పొందలేని అభాగ్యులు న్యాయం పొందేందుకు ఎదుర్కొనే సమస్యలను దృష్టిలో పెట్టుకొని తన సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తానని సంజీవరావు వెల్లడించారు. న్యాయం అందరికీ అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో తన వంతు బాధ్యతను నెరవేర్చేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని చెప్పారు.

### న్యాయవాదుల్లో నూతనోత్సాహం

కాటూరి సంజీవరావు ఎన్నికతో కొత్తగూడెం న్యాయవాదుల సంఘంలో కొత్త ఉత్సాహం నెలకొంది. న్యాయవాదుల ఐక్యతతో పాటు పేదలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో ఆయన ముందుకు సాగుతారని న్యాయవాదులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## రామ భక్తుల సేవలో త్రివేణి



ఖమ్మం, మార్చి 27(మనం న్యూస్): గత పుష్కర కాలంగా భద్రాచలంలో శ్రీరామనవమి వేడుకలు సందర్భంగా త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థలు భక్తుల దాహార్తిని తీర్చడం కోసం తమ వంతు కృషి చేస్తున్నాయి. డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ రామభక్తులకు సేవ చేయడం సాక్షాత్తు శ్రీరాముడికి సేవ చేయడం గానే మేమందరం భావిస్తున్నామని అన్నారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా భక్తుల కోసం భద్రాచలం బస్టాండ్లో డిపో ఆర్ఎంఓ సరిరామ్, ఎస్ఐ నవిత చేతుల మీదుగా ప్రారంభించిన మజ్జిగ, మంచినీటి ప్యాకెట్ల వితరణ కేంద్రం ద్వారా యాత్రికుల దాహం తీర్చే ప్రయత్నం చేశారు. అలాగే రామాలయం దగ్గరలో ప్రారంభించబడిన కేంద్రంలోనూ మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా దాదాపు 50 వేల మజ్జిగ ప్యాకెట్లు, 50 వేల మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఉడతా భక్తిగా భక్తులకు సేవ చేసుకోవడం ఆ శ్రీరామచంద్రుడు తమకు ఇచ్చిన ఓ చిరు అవకాశం గా భావిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొని శ్రీరాముని సేవలో తరించారు.

## పలుచోట్ల శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ఎంపీ రఘురాం రెడ్డి

భక్త రామదాసు ధ్యాన మందిరంలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవానికి హాజరైన ఎంపీ





ఖమ్మం, నేలకొండపల్లి, మార్చి 27(మనం న్యూస్): శ్రీరామనవమి సందర్భంగా ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి జిల్లాలో పలు ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో పాల్గొని భక్తులతో కలిసి పూజలు నిర్వహించారు.

₹ఖమ్మం నగరంలోనిశ్రీనగర్ కాలనీ 7, 18 డివిజన్లలో, సాయి గణేష్ నగర్లలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డితో కలిసి హాజరై పూజల్లో పాల్గొన్నారు. నేలకొండపల్లిలోని ప్రసిద్ధ భక్త రామదాసు ధ్యాన మందిరంలో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని సీతారాములకు మంగళ హారతులు సమర్పించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య కార్యక్రమాన్ని నిర్వహించగా, ఎంపీ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు స్వయంగా ప్రసాదాన్ని అందజేశారు. పిల్లలు, మహిళలు, వృద్ధులతో మమేకమై వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. నేలకొండపల్లి మండలం కొత్త కొత్తూరు, నాచేపల్లి, మంగాపురం గ్రామాల్లో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని, అన్నదానాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఇటువంటి పండుగలు సమాజంలో ఐక్యత, భక్తి భావాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

### రెండు కుటుంబాలకు ఎంపీ పరామర్శ:

నేలకొండపల్లి మాజీ సర్పంచ్ వంగవీటి నాగేశ్వరరావుకు ఇటీవల మోకాలి ఆపరేషన్ జరగగా.. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి శుక్రవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం వివరాలు తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే.. కాంగ్రెస్ సీనియర్ నాయకులు వాకా శ్రీనాథ్ తండ్రి వాకా రంగయ్య ఇటీవల మరణించగా.. ఎంపీ వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఏదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిన అనిత, కార్పొరేటర్ నీరజ, కౌన్సిలర్ వెంకటరెడ్డి, మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు కొడాలి గోవిందరావు, కొప్పుల చంద్రశేఖర్, నెల్లూరి భద్రయ్య, మామిడి వెంకన్న, బొడ్డు బొందయ్య, టీపీసి సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, రంజిత్ నాయక్, విప్లవ్, ఎనగండ్ల నాగేశ్వరరావు, తిప్పిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, అయోధ్య, నాగ ప్రసాద్, పలువురు సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కమనీయం.. శ్రీ సీతారాముల కల్యాణం..!

- పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో గ్రామోత్సవం
- కల్యాణ తంతు జరిపించిన చెవిరెడ్డి దంపతులు
- కల్యాణ వేడుకకు పెద్ద ఎత్తున హాజరైన భక్తజనం
- అలరించిన కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుపతి రూరల్, మార్చి 27, మనం న్యూస్: శ్రీరామ నవమి సందర్భంగా తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శ్రీ సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా సాగింది. కల్యాణం సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామి వార్లకు ఆలయ వ్యవస్థాపకులు, రాష్ట్ర ప్రభుత్వ మాజీ విప్ చెవిరెడ్డి భాస్కర్రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. చెవిరెడ్డి నివాసం నుంచి గ్రామంలో ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. అప్పటికే కల్యాణ వేదికపైకి వచ్చిన శ్రీసీతారామసమేతలక్ష్మణులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు, మంగళ శాసనం ఆ తర్వాత ఉత్సవ మూర్తులకు కల్యాణం నిర్వహించారు.

### అత్యంత వేడుకగా పట్టాభిషేకం

శ్రీసీతారాముల కల్యాణం ముగిసిన తరువాత శ్రీరాముని పట్టాభిషేకం ఘట్టాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల శ్రీరామ నామ స్మరణల మద్యన శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవంను అర్చకస్వాములు శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. కల్యాణ రాముడు మహారాజుగా పట్టాభిషక్తుడయ్యే అద్భుత ఘట్టాన్ని చూసిన భక్తులు తరించారు. శ్రీరామ పట్టాభిషేకం తరువాత భక్తులు అందరికీ అక్షతలు, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

### అత్యద్భుతంగా విందు ఏర్పాటు

ఆలయం వద్ద శ్రీసీతారాముల కల్యాణం, శ్రీ రామ పట్టాభిషేకంను కనులారా వీక్షించిన భక్తులు



అందరికీ చెవిరెడ్డి కుటుంబీకులు అత్యద్భుతమైన విందు ఏర్పాటు చేశారు. పది రకాల వంటకాలతో తయారైన పసందైన విందును అందరికీ అందించడంతో భక్తులు అందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. విందు భోజనంను చెవిరెడ్డి కుటుంబీకులతో పాటు గ్రామస్తులు దగ్గరుండి భక్తులు అందరికీ పంపిణీ చేశారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీసీతారాముల కల్యాణం, పట్టాభిషేకం మహోత్సవాలు జరిగిన తరువాత కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీరాముని జీవితం, అరణ్యకష్టాలు, శ్రీసీతారముల కల్యాణం, పట్టాభిషేకం వరకు వివిద రకాల నృత్యాలతో భక్తులు అందరికీ అర్థమయ్యేలా ప్రదర్శించారు. ఎస్వీ మ్యూజిక్ కాలేజీ నుంచి వచ్చిన గాయకులు శ్రీరామునిపై పలు రకాల పాటలు పాడుతూ భక్తులను భక్తి సాగరంలో ముంచెత్తారు. అలాగే ఆలయం వద్ద నిర్మించిన కల్యాణ వేదిక భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తుల సౌకర్యార్థం ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసి అతి దగ్గరగా స్వామి, అమ్మవార్ల కల్యాణం చూసే ఏర్పాటు చేశారు.

## సీతా రామ భక్త బృందం ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం

- పాల్గొన్న డాక్టర్ కూరపాటి ప్రదీప్



ఖమ్మం, మార్చి 27(మనం న్యూస్): ఖమ్మం నగరంలోని ట్రంక్ రోడ్ శ్రీ సీతా రామ భక్త బృందం ఆధ్వర్యంలో గత 14ఏళ్లుగా శ్రీరామ కళ్యాణ మహోత్సవం కనుల పండగగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు . శ్రీరామనవమి సందర్భంగా భక్తుల సందోహంలో పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు . డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారి కృపలకు పాత్రులు అయ్యారు . అనంతరం శాలవతో సత్కరించారు. మంగళ తోరణాలతో అలంకరించి స్వామి వారి విగ్రహాలను, ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు, మంగళసూత్రాలు కళ్యాణ మండపానికి ఊరేగింపుగా తీసుకొని వచ్చారు . ఆ తర్వాత కళ్యాణం ప్రారంభమైంది. పానకం వితరణ, జీలకర్ర బెల్లం సమర్పించుట, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంకాల పూజ, పవళింపు సేవ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి, డాక్టర్ వీరేంద్ర చిట్టి, డాక్టర్ నాగేశ్వరరావు, పొన్నూరు లక్ష్మణరావు, వేముల వెంకట శ్రీనివాస్, దాచేపల్లి గురుప్రసాద్, బోజెడ్ల రామ్మోహన్రావు, చరణ్ కుమార్, పసుమర్తి శ్రీనివాస్, కనమర్లపూడి శ్రీరాములు, మర్రి రాజేష్, శ్రీరంగం రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# నేడు విజయవాడలో ఐజేయు ప్లీనరీ సమావేశం

- లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు నాయుడు
- పాత్రికేయుల పింఛన్ పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రకటించే అవకాశం



**పాలకొల్లు,మార్చి 27,మనం ప్రతినిధిః** విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ఐజేయు 11వ ప్లీనరీ సమావేశాన్ని సీఎం చంద్రబాబు నాయుడు శనివారం సాయంత్రం ఐదు గంటలకు లాంచనంగా ప్రారంభించనున్నారు. ఈ సమావేశానికి ఐజేయు అధ్యక్షులు కే శ్రీనివాసరెడ్డి, నూతనంగా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ డి సోమ సుందరం తో పాటు 27 రాష్ట్రాల నుంచి 350 మందికి పైబడి ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, మంత్రులు,ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. సమావేశంలో ఐదు రాష్ట్రాల్లో 60 సంవత్సరాల పైబడిన విశ్రాంత పాత్రికేయులకు తమిళనాడు తదితర రాష్ట్రాల్లో నెలకు రూ. 15000/-చొప్పున ఇస్తున్న నెలవారి పింఛన్ పథకం ఏపీలో కూడా అమలు చేయడానికి సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటన చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈమెరకు ఆ ప్రకటన కోసం విశ్రాంత పాత్రికేయులు ఆత్రుతతో ఆశగా ఎదురుచూస్తున్నారు. అదేవిధంగా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, మెడిక్లెయిం, పథకాలు పై కూడా సీఎం ప్రకటన చేస్తారని సమాచారం. ఇప్పటికే ఈ మేరకు ఈ డిమాండ్ల తో కూడిన వినతి పత్రాన్ని సీఎంకు అందజేయడానికి యూనియన్ పెద్దలు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. కాగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సీనియర్ పాత్రికేయుల పింఛన్ కల సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఈ సమావేశంలో అయినా సాకారం అవుతుందా లేదా అనేది వేచి చూడాల్సిందే మరి.

# ఆచంట స్థలాలను పరిశీలిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్



**ఆచంట, మార్చి 27 మనం న్యూస్ః** నియోజకవర్గ కేంద్రమైన ఆచంటలో చిల్డ్రన్ పార్క్ మరియు రైతు బజారులను నిర్మించేందుకు ప్రధాన రహదారి మరియు సంత మార్కెట్ లో ఉన్న స్థలాలను శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం ద్వారా ప్రజలకు మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని చేకూరుతుందన్నారు. రైతు బజారును నిర్మిస్తే రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించే అవకాశం ఉంటుందని అన్నారు తద్వారా మధ్యవర్తుల దోపిడీ తగ్గి రైతులు సరసమైన ధరకు విక్రయించవచ్చని వినియోగదారులకు తాజా కూరగాయలు ఆకుకూరలు పండ్లు తక్కువ ధరలకు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగబాబు వీఆర్వోలు శేషగిరి రాజబాబు ఏఎస్ఐ వెంకటేశ్వరరావు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# వెన్నపువారిపాలెంలో అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం



**ఆచంట మార్చి 27 మనం న్యూస్ః** నియోజకవర్గ కేంద్రమైన ఆచంట మండల పరిధిలోని వెన్నపువారిపాలెం గ్రామంలో శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆచంటలోని ప్రతి గ్రామంలో త్రేతాయుగంలో జన్మించిన శ్రీరాముడు సీతమ్మవార్లకు కళ్యాణం మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి పసుపు రంగు పువ్వులు తులసి ఆకులు గంధం పండ్లు మరియు స్వీట్లు నెయ్యి దీపం వెలిగించి శ్రీరామ చరిత మానస్ యొక్క బాలకంధాని అర్చకులు పాటించారు అనంతరం ఓం శ్రీ రామాయ నమః శ్రీరామ్ జై రామ్ జై జై రామ్ అనే మంత్రాన్ని 108 సార్లు జపించారు అనంతరం రామాలయానికి విచ్చేసిన భక్తులకు పిల్లలకు బెల్లం పానకం పండ్లు పంచిపెట్టారు అంతేకాక అన్ని ప్రాంతాల వారికి అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

# శేషవాహనంపై శ్రీ సీతా లక్ష్మణ సమేత రఘురాముడు



**ఒంటిమిట్ట,మార్చి 27, మనం న్యూస్ః** కడప జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో మొదటి రోజు శుక్రవారం రాత్రి శేషవాహనంపై శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్రుడు భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. ఈ వాహనసేవను దర్శించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి. వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవోలు ఎ. ప్రశాంతి, శివప్రసాద్, ఇతర అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. ఆదిశేషుడు స్వామివారికి అత్యంత ప్రియ భక్తుడు. త్రేతాయుగంలో లక్ష్మణుడిగా, ద్వాపరయుగంలో బలరాముడిగా ఆదిశేషుడు అవతరించినట్లు పురాణాలు చెబుతున్నాయి. శ్రీవైకుంఠంలోని నిత్యసూరుల్లో ఆద్యుడైన ఆదిశేషుడు భూభారాన్ని భరిస్తూ స్వామివారికి సేవ చేస్తున్నాడు. శేషవాహనం దాస్యభక్తికి ప్రతీకగా భావించబడుతుంది. ఈ భక్తితో జీవిలోని అహంకారం తొలగి మానవత్వం, దైవత్వం వైపు నడిపిస్తుందని ఆధ్యాత్మిక వేత్తలు పేర్కొంటారు.

**ఆకట్టుకున్న కవి సమ్మేళనం...**

శ్రీ పోతన జయంతిని పురస్కరించుకుని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆలయ సమీపంలోని ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం కవి సమ్మేళనం నిర్వహించారు. ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు పోతన మహాభక్తుడని, ఆయన రచించిన భాగవతం భక్తి ప్రవాహంలా ప్రజల్లో విస్తరించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పసుపులేటి శంకర్ భాగవతం ప్రాచుర్యం, శ్రీ నారాయణ రెడ్డి గజేంద్ర మోక్షం, శ్రీ మల్లికార్జున రెడ్డి వామన చరిత్ర, శ్రీమతి దామోదరమ్మ ప్రహ్లాద చరిత్ర తదితర అంశాలపై ప్రసంగించి భక్తులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# వడగాల్పులు వీచే అవకాశాలు ఉన్నాయి



**గుంటూరు,మార్చి,27,(మనం న్యూస్) :** జిల్లాలో 16 మండలాల్లో శనివారం వడగాల్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించిందని, ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా కోరారు. వడగాల్పులపై శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పనులు ఉంటే మినహా ఎవరు బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పనులకు బయటకు వస్తే గొడుగు ఉపయోగించాలని, వదులు దుస్తులు ధరించాలని, తగినంత నీటిని తాగాలని సూచించారు. చిన్నారులు, వయసు మీరినవారు బయటకు వెళ్లకుండా కుటుంబ సభ్యులు చూడాలని చెప్పారు. డీ హైడ్రేషన్ కు గురికాకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంబంధించి అధికారులు ప్రజలకు తగు సూచనలు, సలహాలు అందించాలని ఆదేశించారు.

# క్రైస్తవ మతం స్వీకరిస్తే ఎస్టీ హోదా రద్దు కాదు

- అసత్య ప్రచారాలు మానండి
- నియోజకవర్గ క్రిస్టియన్ జె.ఏ.సి అధ్యక్షులు బరగడ ఎజ్రాశాస్త్రి



**జీలుగుమిల్లి,మార్చి 27(మనం న్యూస్):** గిరిజనులు క్రైస్తవ మతం స్వీకరిస్తే ఎస్టీ కుల ధ్రువీకరణ రద్దు అవుతుందని పలు మాధ్యమాలలో తప్పుడు ప్రసారం చేస్తున్నారని వాటిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పోలవరం నియోజకవర్గ క్రిస్టియన్ జె.ఏ.సి అధ్యక్షులు బరగడ ఎజ్రా శాస్త్రి పేర్కొన్నారు.శుక్రవారం జీలుగుమిల్లి గ్రేస్ మందిర్ వద్ద క్రిస్టియన్ జె.ఏ.సి,యు. పి.ఎఫ్,యు.పి.ఏ గిరిజన ప్రతినిధులు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎజ్రా శాస్త్రి మాట్లాడుతూ గిరిజనులు ప్రత్యేక తెగకు చెందిన వారని వారికి ఏ మతాన్ని అయినా ఏ ధర్మాన్నైనా స్వీకరించి ఆచరించే హక్కు కలిగి ఉన్నట్లు గుర్తు చేశారు.ముఖ్యంగా క్రైస్తవ మతం స్వీకరిస్తే గిరిజనులు తెగకు ఉన్న ఎస్టీ కుల ధ్రువీకరణ రద్దు కాబడి బి.సి(సి) కులముకు చెందిన వారిగా గుర్తింపు బడతారు అని పలువురు అసత్య ప్రచారాలను ప్రసారం చేయడమే కాకుండా క్రైస్తవ మతం స్వీకరించిన గిరిజనులపై దాడులు చేస్తున్నారని వాటన్నిటిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం గిరిజనులు ప్రత్యేక తెగలుగా గుర్తింపబడి మతాల విషయంలో స్వేచ్ఛ కల్పించబడి ఉన్నారని అన్నారు. భారతదేశంలో నాగాలాండ్,మేఘాలయ,మిజోరాం మణిపూర్ వంటి రాష్ట్రాలలో 80 శాతంకి పైగా క్రిస్టియన్లు గిరిజన తెగలలో ఉన్నారని ఆయా రాష్ట్రాలు వారిని ఎస్టీ జాబితాలోనే గుర్తించారని వివరించారు.కానీ కొంతమంది అజ్ఞానులు గిరిజనుల హక్కులను తెలుసుకోపోగా, అజ్ఞానంతో ఎస్టీ కుల దృవీకరణ రద్దవుతుంది అంటూ పలు మాధ్యమాలలో ప్రసారం చేయడం తగదని హెచ్చరించారు.

# యుద్ధం ఆపండి... అన్నార్తుల్ని ఆదుకోండి...

- జంపని అతా నిజామ్ బాబా పిలుపు







**జంపన్నీ, తెనాలి, మార్చి 27 మనం న్యూస్:** పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం మానవ సమాజానికి హానికరమని, దీని వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఆహార భద్రతకే ముప్పు ఎదురువుతుందని గుంటూరు జిల్లా జంపని అతా నిజాం బాబా ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా, ఇజ్రయేల్, ఇరాన్ యుద్ధాన్ని తక్షణమే నివారించాలన్నారు. గుంటూరు జిల్లా, వేమూరు నియోజకవర్గం జంపనిలో అఅఅఖీఖీఅ దర్బార్ షరీఫ్ అతా నిజాం బాబా శుక్రవారం మనం న్యూస్ ప్రతినిధితో మాట్లాడుతూ, ఈ యుద్ధం వల్ల చమురు నిల్వలు అడుగంటిపోయి ఆహార భద్రతకు ప్రపంచ వ్యాప్తంగా విఘాతం కలుగుతోందన్నారు. అన్న సంతర్పణ ఆధ్యాత్మిక సేవలో ఒక మహత్తర ప్రయత్నమని, దీనికి యుద్ధం వల్ల విఘాతం కలుగుతుందన్నారు. యుద్ధాలతో ఆర్థిక విధ్వంసం తప్పదని, ప్రస్తుతం ప్రపంచంలోని 97 దేశాలు ఏదో ఒకరకమైన సంఘర్షణల చట్రంలో చిక్కుకున్నాయని, వీటి కారణంగా 9.5 కోట్ల మంది శరణార్థులుగా మారారని అతా నిజాం బాబా తెలిపారు. ఈ సంఖ్య మించిపోకుండా, భారత్ వంటి దేశాలు కూడా ఆర్థిక సంక్షోభంలో ఇరుక్కోకుండా...అమెరికా, ఇరాన్ ల మధ్య యుద్ధం నిలిచిపోయేలా సూఫీ, మానవతా వాదులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో తీవ్రమైన యుద్ధం ఎంతో మందిని బాధిస్తోందని, సత్యం, ప్రేమ, కరుణతో నిండిన జీవనంతోనే భగవంతునితో అనుసంధానం ఏర్పడుతుందని సూఫీ సంప్రదాయ సేవకులు అతా నిజామ్ బాబా తెలిపారు. అన్నదానంతోనే ఉత్తమ సద్గతులు కలుగుతాయని, కానీ యుద్ధం వల్ల మనిషి ఆహార భద్రతకే ముప్పు కలుగుతోందన్నారు. చమురు, గ్యాస్ సరఫరా లేక చాల చోట్ల ఆహార తయారీకి విఘాతం కలుగుతోందని, ఇది తీవ్రం అయితే, సామాన్యులకు తిండి కూడా కరువతుందన్నారు. సూఫీ సంతుల బోధనల ప్రకారం ఇతరులకు అన్నం పెట్టేవాడే ఉత్తమ మనిషి, ఆహారం పంచితే ఆశీర్వాదం పెరుగుతుందని తాము బలంగా నమ్ముతామని అతా నిజాం బాబా చెప్పారు. అందుకనే నిరంతరం తాము ఏఏబిఎస్ టిఏ దర్బార్ షరీఫ్ ద్వారా లంగర్ షరీఫ్ అన్నదానాలు, సంతర్పణలు చేస్తున్నామని అతా నిజాం బాబా వివరించారు. భారత దేశంలోనే కాదు, ఏ దేశంలో కూడా ఆహారంలేక ఎవరూ ఇబ్బందులు పడకూడదనేది తమ సూఫీ మానవతా సిద్ధాంతమని, దీని కోసమే యుద్ధాన్ని నిలిపివేయాలని కోరుతున్నామని అతా నిజాం బాబా మనం న్యూస్ కి తెలిపారు.ఈ సందర్భంగా మనం అమరావతి స్పెషల్ కరస్పాండెంట్,ఉమ్మడి కృష్ణా,గుంటూరు జిల్లాల బ్యూరో చీఫ్ పి.మీరాహుస్సేన్ ఖాన్,అధ్యాత్మిక వేత్త గౌస్ మొహిద్దీన్ బేగ్ తదితరులు నిజామ్ బాబా వారిని శాలువతో ఘనంగా సత్కరించారు. బాబా చేస్తున్న సేవలు మన వాళికి ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు.శాంతి,సేవా,దాన గుణం అన్నదానం చేస్తు నిజామ్ బాబా సేవలు అభినందనీయమని మీరాహుస్సేన్ కొనియాడారు..

# కళ్యాణం కమనీయం

- వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు
- సీతారాముల కళ్యాణంలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ దంపతులు



**(విజయవాడ,మనం బ్యూరో ):** విజయవాడ స్టెల్లా కాలేజి సమీపంలోని సాయిబాబా దేవాలయం వద్ద శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ దంపతులు హాజరై సీతా రాముల కళ్యాణాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణ వేడుకలు ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని ప్రతిబింబించాయి. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సతీమణితో కలిసి పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆలయ నిర్వాహకులు వారికి సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికి, పూజా కార్యక్రమాలలో భాగస్వామ్యం కల్పించారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని వారు భక్తిపూర్వకంగా నిర్వహించారు. ఆలయ పరిసరాలు మంగళవాయిద్యాల నినాదాలతో మార్మోగాయి. వేదపండితులు వేదమంత్రోచ్చారణల మధ్య యాగాలు, హోమాలు నిర్వహించగా, అనంతరం సీతారాముల కల్యాణోత్సవం సాంప్రదాయబద్ధంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. స్థానిక ప్రజలు, మహిళలు, యువత, వృద్ధులు పెద్ద ఎత్తున హాజరై భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం నిర్వహణలో నిర్వాహకులు క్రమశిక్షణతో, శ్రద్ధతో ఏర్పాట్లు చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ వేడుకల సందర్భంగా శ్రీరామ తత్వం ద్వారా అధికారానికి మించి బాధ్యత ముఖ్యమనే సందేశం, సీతాదేవి తత్వం ద్వారా కష్టసుఖాలలో సహజీవనం అవసరం, లక్ష్మణుని ద్వారా కుటుంబ బాధ్యతల పంచుకోవడం, ఆంజనేయుని ద్వారా నమ్మిన ధర్మం కోసం అంకితభావం వంటి విలువలను భక్తులకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమం సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం, ఐక్యత, మరియు సన్మార్గంలో నడవాలనే సంకల్పాన్ని పెంపొందించేలా విజయవంతంగా ముగిసింది.

# కాజలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం



**మంగళగిరి మార్చి 27, మనం న్యూస్ః** కాజ శ్రీ కోదండ రామ స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ చింకా కోటేశ్వరరావు, నాగమణి దంపతులు, పోతురాజు పానకాలు దంపతులు కళ్యాణం జరిపారు. అర్చకస్వామి సత్య ప్రసాద్ కళ్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్ల కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. దీంతో దేవాలయం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పులగం సీతారావమ్మ, బండారు మంగమ్మ, వల్లభాపురం వెంకటేశ్వరరావు, దానబోయిన లక్ష్మి తిరుపతమ్మ, అప్పికట్ల బసవ పూర్ణమ్మ, కొండూరు శ్రీనివాసరావు, మేడ శ్రీవిద్య, కూటమి నాయకులు దానబోయిన రామరాజు, సింహాద్రి భాస్కరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, తోట సాంబయ్య, పీ రామిరెడ్డి, ఎం శ్రీకాంత్, పోతురాజు శ్రీను, చప్పిడి వెంకటేష్, పల్లబోతుల శివ సాయి, ఎల్చీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బడే లీగ్ కా షేవ్ ఆవిష్కరణకు బ్రాండ్ అంబాసిడర్‌గా అభిషేక్ శర్మ

- శర్మతో కలిసి, జిల్లెట్ ఇండియా సరికొత్త జిల్లెట్ గార్డ్ 3-ఇన్-1

**విశాఖపట్నం, మార్చి 27:** యువ భారతీయ పురుషులకు అత్యుత్తమ గ్రూమింగ్ పరిష్కారాలను అందించడం పట్ల తన నిబద్ధతను మరింత బలోపేతం చేస్తూ, అభిషేక్ శర్మతో కూడిన కొత్త ప్రచారంతో 'జిల్లెట్ గార్డ్ 3-ఇన్-1'ను ప్రారంభించినట్లు జిల్లెట్ ప్రకటించింది. భారతీయ వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా రూపొందించిన ఈ గార్డ్ 3-ఇన్-1, విలువ విభాగంలో అధిక పనితీరును అందించే అగ్రస్థానంగా నిలుస్తుంది. ఈ ఆవిష్కరణకు ముఖచిత్రంగా ఉన్న అభిషేక్ శర్మ, 'బడే లీగ్ కా షేవ్' ప్రచారానికి నేతృత్వం వహిస్తూ, కొత్త తరం పురుషులు ప్రాథమిక షేవింగ్ దశను దాటి మరింత ఆత్మవిశ్వాసం మరియు మెరుగైన గ్రూమింగ్ అనుభవం వైపు ముందడుగు వేయాలని ప్రేరేపిస్తాడు. జిల్లెట్ గార్డ్ 3-ఇన్-1 'తగినంత మంచి' పరిష్కారాలను దాటి, తమ అభివృద్ధిని ప్రతిబింబించే మెరుగైన గ్రూమింగ్ అనుభవాన్ని కోరుకునే యువ భారతీయుల ఆకాంక్షలకు ప్రత్యక్ష ప్రతిస్పందనగా నిలుస్తుంది. అభిషేక్ శర్మ ప్రధానంగా నిలిచిన ఈ ప్రచారం, ప్రొడక్టును పురోగతికి ప్రతీకగా స్థాపిస్తూ, వినియోగదారులు మరింత ఆత్మవిశ్వాసంతో జీవితంలోని పెద్ద అవకాశాలకు 'మ్యాచ్-రెడీ'గా ఉండేందుకు ప్రేరేపిస్తుంది. దాని ప్రత్యేకమైన మూడు ప్లాటినం-కోటెడ్ బ్లేడ్లు, యాంటీ-స్లిప్ రబ్బరు గ్రిప్ హ్యాండిల్ మరియు ఆక్వాజెల్ లుబ్రాస్ట్రిప్తో, జిల్లెట్ గార్డ్ 3-ఇన్-1 తన ప్రధాన వాగ్దానం -ఒకే స్ట్రోక్లో స్మూత్ షేవ్. కట్ లేకుండా, మంట లేకుండాను₹ నెరవేర్చుతుంది.ఈ సందర్భంగా మాట్లాడుతూ, మిస్టర్. కపిల్ శర్మ, గ్రూమింగ్ వైస్ ప్రెసిడెంట్ మరియు కేటగిరీ హెడ్, జిల్లెట్ ఇండియా ఇలా పేర్కొన్నారు, జిల్లెట్ గార్డ్ 3-ఇన్-1తో, ప్రాథమిక గ్రూమింగ్ పరిధిని దాటి మెరుగైన అనుభవాన్ని కోరుకునే లక్షలాది యువకులకు మేము అగ్రస్థానం అందిస్తున్నాం. భారతీయ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ ప్రొడక్టు, అందుబాటు ధరలో 3-బ్లేడ్ షేవ్ పనితీరును అందిస్తూ, కోతలు లేకుండా స్మూత్ మరియు క్లోజ్ షేవ్ను మరింత మందికి చేరుస్తుంది. అభిషేక్ శర్మతో మా అనుబంధం, నేటి యువ భారతదేశం యొక్క దృక్పథం-అభిలాషతో ముందుకు సాగుతూ, ఎదుగుదల వైపు దూసుకెళ్తూ, పెద్ద లీగ్లో స్థానం సంపాదించడానికి సిద్ధంగా ఉన్న తరంను ప్రతిబింబిస్తుంది. అభిషేక్ శర్మ ప్రధాన పాత్రలో




నటించిన డిజిటల్ ఫిల్మ్తో ప్రారంభమై, ఆన్-గ్రౌండ్ ఎక్స్పీరియెన్షియల్ యాక్టివేషన్లతో కూడిన 360-డిగ్రీ హై-ఇంపాక్ట్ రోల్అవుట్ ద్వారా ఈ ప్రచారం ప్రేక్షకుల ముందుకు వస్తుంది.

## రామనవమి వేళ అద్భుత దృశ్యం..
# అయోధ్యరాముడికి 'సూర్యతిలకం'




**అయోధ్య, మార్చి 27:** ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు అంబరాన్నంటాయి. శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన తర్వాత వచ్చిన మూడో శ్రీరామ నవమి ఇది. ఈ సందర్భంగా ఆలయంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. బాలరాముడి నుదిటిపై 'సూర్య తిలకం' చూసి భక్తులు పరవశించారు. ఈ పండగ వేళ స్వామి దర్శనం కోసం దేశవిదేశాల నుంచి భక్తులు పోటెత్తారు.

అయోధ్య ఆలయంలో గర్భగుడిలోని బాలరాముడి విగ్రహం నుదుటిపై సూర్యకిరణాలు పడేందుకు మూడో అంతస్తులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరిమిత సంఖ్యలో పైపులు, కుంభాకార, పుటాకార కటకాలతో ఒక వ్యవస్థను రూపొందించారు. ఆలయ శిఖర భాగంలో సూర్యకాంతి గ్రహించేందుకు ఒక పరికరాన్ని ఏర్పాటుచేశారు. అక్కడినుంచి పైపు లోపలికి కాంతి ప్రసరించి తిలకం వలే కన్పిస్తోంది. బెంగళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ శాస్త్రవేత్తలు, పరిశోధకుల సాయంతో కేంద్ర భవన నిర్మాణ పరిశోధన సంస్థ(సీబీఆర్ఐ) శాస్త్రవేత్తలు దీనిని నిర్మించారు.

ప్రతి శ్రీరామ నవమి రోజున బాలరాముడి నుదుటిపై ఈ తిలకం దిద్దేలా ఏర్పాట్లు చేశారు. అందుకోసం గడియారంలో ముల్లులు తిరిగేందుకు ఉపయోగించే పరిజ్ఞానం తరహాలో గేర్ టీత్ మెకానిజం వినియోగించారు. సూర్యకాంతిని గ్రహించే పరికరం వద్దే మరో పరికరం ఉంచారు. ఇది కాంతిని గ్రహించే అద్దాన్ని 365 రోజులు స్వల్పంగా కదుపుతూ ఉంటుంది. మళ్లీ శ్రీరామనవమి రోజు వారు అనుకున్న చోటుకు తీసుకొస్తుంది. అంతకుముందే ఏటా శ్రీరామనవమి వచ్చే కాలాన్ని అత్యంత కచ్చితత్వంతో గణించారు.

## చరిత్ర సృష్టించనున్న ట్రంప్
### అమెరికా కరెన్సీ నోట్లపై సంతకం



**వాషింగ్టన్, మార్చి 27:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చరిత్ర సృష్టించనున్నారు. ఆ దేశ కరెన్సీ నోట్లపై సంతకం చేయబోయే తొలి అధ్యక్షుడిగా నిలవనున్నారు. యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఈ విషయాన్ని ప్రకటించింది. త్వరలో జరగనున్న అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

1861 నుంచి అమెరికా కరెన్సీ నోట్లపై ట్రెజరర్, ట్రెజరీ కార్యదర్శి సంతకం ఉండడం సంప్రదాయంగా వస్తోంది. ఈ 165 ఏళ్ల సంప్రదాయాన్ని ట్రంప్ ఇప్పుడు బ్రేక్ చేయబోతున్నారు. ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ప్రకారం.. ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్‌తోపాటు ట్రంప్ సంతకం ఉన్న తొలి 100 డాలర్ల నోట్లను జూన్‌లో ముద్రించనున్నట్లు పేర్కొంది. స్వాతంత్ర్య వేడుకలకు గుర్తుగా ట్రంప్ ముఖ చిత్రంతో స్మారక నాణెం రూపొందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఇటీవల వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అందులోభాగంగా తాజా నిర్ణయం కూడా తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై బెసెంట్ మాట్లాడుతూ తమ దేశం సాధించిన చరిత్రాత్మక విజయాలను గుర్తుచేసుకోవడానికి ఇంతకంటే గొప్ప మార్గం మరొకటి ఉండదని అభిప్రాయపడ్డారు. అమెరికన్ ట్రెజరర్ బ్రాండన్ బీజ్ కూడా ఈ నిర్ణయాన్ని సమర్థించారు. ఇది సరైన నిర్ణయమేనని అందుకు ఆయన పూర్తి అర్హులని వ్యాఖ్యానించారు.

## అణు విద్యుత్ ప్లాంట్ సమీపంలో దాడి..
### రేడియేషన్ లీకేజీపై ఐఏఈఏ ఆందోళన




**వియన్నా, మార్చి 27:** ఇరాన్‌లోని బుషెహర్ న్యూక్లియర్ ప్లాంట్లో రేడియేషన్ లీకేజీ భయాలపై అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఅఉఅ) ఆందోళన వ్యక్తంచేసింది. ఆ ప్లాంట్‌లో పెద్ద మొత్తంలో అణుపదార్థాలు ఉన్నట్టు ఐఏఈఏ డైరెక్టర్ జనరల్ రఫేల్ గ్రూసి పేర్కొన్నారు.

''బుషెహర్లోని న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌లో ఎక్కువ మొత్తంలో అణుపదార్థాలు నిల్వ ఉన్నాయి. దీనికి ప్రమాదం జరిగితే రేడియేషన్ లీకేజీ వల్ల ఇరాన్‌తో పాటు ఆ దేశం వెలుపలా భారీస్థాయిలో ప్రమాదం జరిగే ముప్పు పొంచిఉంది. ఇలాంటి ప్రమాదాన్ని నివారించేందుకు అన్ని పక్షాలు సంయమనం పాటించాలి'' అని ఐఏఈఏ డైరెక్టర్ గ్రూసి పిలుపునిచ్చారు.ఇరాన్ సైనిక స్థావరాలు, క్షిపణి తయారీ కేంద్రాలు, ఆయుధ నిల్వలే లక్ష్యంగా ఇజ్రాయెల్-అమెరికా భీకరంగా దాడులు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో బుషెహర్ ప్రావిన్స్‌లోని ఐఆర్జీసీ నేవీ, వైమానిక స్థావరాల మౌలిక సదుపాయాలు ధ్వంసమైనట్లు ఇటీవల శాటిలైట్ చిత్రాల్లో వెల్లడైంది. ఈ దాడులు బుషెహర్ అణు విద్యుత్ ప్లాంట్‌కు సమీపంలోనే జరిగినట్లు వార్తలు రావడంతో రేడియేషన్ లీకేజీపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఇక్కడ పనిచేసే తమ సిబ్బందిని రష్యా తరలించినట్లు సమాచారం.

## నదిలో మునిగిన బస్సు..
### బంగ్లాదేశ్‌లో 24 మంది మృతి



**ఢాకా, మార్చి 27:** బంగ్లాదేశ్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. సుమారు 40 మంది ప్రయాణికులతో వెళ్తోన్న బస్సు పద్మానదిలో పడిపోవడంతో 24 మంది మృతిచెందారు. కొందరు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకొని ప్రాణాలు కాపాడుకున్నారు. మరికొంతమంది గల్లంతయ్యారు. బస్సు నుంచి 22 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. వారిలో 11 మంది మహిళలు, ఆరుగురు పురుషులు, ఐదుగురు పిల్లలున్నారని పోలీసులు తెలిపారు. ఢాకాలో ఈద్ వేడుకలను పూర్తిచేసుకొని బుధవారం సాయంత్రం తిరిగి వస్తుండగా రాజ్బరి జిల్లాలోని దౌలత్దియా టెర్మినల్ దగ్గర దుర్ఘటన జరిగింది. బల్లకట్టు మీదుగా అవతలి ఒడ్డుకు వెళ్తున్నప్పుడు మరో చిన్న బల్లకట్టు వచ్చి ఢీకొంది. స్టీరింగుపై బస్సు డ్రైవరు నియంత్రణ కోల్పోవడంతో అది బల్లకట్టుపై నుంచి జారి నదిలో పడిపోయింది.

### సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయి..
# కంగారుపడొద్దు
### కేంద్ర మంత్రి జేపీనడ్డా



**ఢిల్లీ, మార్చి 27:** పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ మార్కెట్లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది. దీనిపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా లోక్‌సభలో స్పందించారు. ఎరువులపై యుద్ధ ప్రభావం పడకుండా రైతుల అవసరాలకు తగ్గట్టు సరఫరా చేస్తాం అని మంత్రి హామీ ఇచ్చారు.

''ముడిసరకుల దిగుమతి విషయంలో ఒక్క దేశం పైనే ఆధారపడకుండా పలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాం. ఈ విషయంలో ఇప్పటికే అనేక దేశాలతో భారత్ సుదీర్ఘకాలానికి ఒప్పందాలు చేసుకుంది. ఔషధాల తయారీ కోసం ఇతర దేశాల నుంచి ముడిసరకు దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం'' అంటూ జేపీ నడ్డా లోక్‌సభలో వివరించారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఇటీవల కేంద్ర మంత్రివర్గం సమావేశమైంది.

ఇందులో నిత్యావసరాలు, ఎరువుల సరఫరా గురించి చర్చించినట్లు సమాచారం. ప్రస్తుతానికి ఖరీఫ్ సీజన్ వరకూ ఎరువులకు కొరత ఉండదు. కానీ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే ఎరువుల ఉత్పత్తి 0.6 నుంచి 0.9 మిలియన్ టన్నుల మేరకు తగ్గే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఎరువుల వాడకంలో భారత్ రెండో అతిపెద్ద దేశం. ఫెర్టిలైజర్స్ ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉంది. ఎల్ఎన్జీ ధరల పెరుగదల కారణంగా యూరియా ఉత్పత్తి వ్యయాలపై ప్రత్యక్ష ప్రభావం పడుతోంది. అదే సమయంలో, ఎరువులు, ముడి పదార్థాల రవాణా ఆలస్యం అవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

## ఇరాన్కు మరో 10 రోజుల గడువు



● ట్రంప్ కీలక ప్రకటన

**వాషింగ్టన్, మార్చి 27:** యుద్ధం ముగింపునకు సంబంధించి అమెరికా- ఇరాన్ మధ్య చర్చలపై అనిశ్చితి కొనసాగుతోంది. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులను మరో 10 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. టెహ్రాన్ ప్రభుత్వం అభ్యర్థన మేరకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రూత్ సోషల్లో ఆయన పోస్టు పెట్టారు.

యుద్ధం నేపథ్యంలో మూసివేసిన హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తిరిగి తెరవాలని ఇరాన్‌కు ట్రంప్ ఇటీవల అల్టిమేటం జారీచేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఈ విషయంలో వెనక్కితగ్గిన ట్రంప్ ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్నాయని, ఆ దేశ ఇంధన మౌలిక సదుపాయాలు, విద్యుత్ కేంద్రాలపై దాడులను ఐదు రోజుల వరకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తాజాగా ఈ దాడుల నిలిపివేతను మరో 10 రోజుల వరకు అంటే.. ఏప్రిల్ 6 వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక, యుద్ధం ముగింపునకు సంబంధించి ఇరాన్‌తో చర్చలు అద్భుతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పురోగతి సంకేతాలు కూడా కన్పిస్తున్నాయన్నారు. వీటిపై మీడియాల్లో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దన్నారు. ఈ 10 రోజుల విరామం కాల్పుల విరమణకు దారితీస్తుందా లేక తాత్కాలిక ఉద్రిక్తతలను మాత్రమే తగ్గిస్తుందా అనేది అస్పష్టం.

## హెచ్-1బీలో కొత్త రూల్స్..
### కనీస వేతనం పెంచే యోచనలో అమెరికా




**వాషింగ్టన్, మార్చి 27:** టెక్ కంపెనీల్లో విదేశీయులను తగ్గించి అమెరికన్లకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అగ్రరాజ్యం మరో కీలక చర్యకు సిద్ధమైంది. ఇందులో భాగంగానే హెచ్-1బీ వీసాదారుల వేతనాలను పెంచేలా అమెరికా కార్మిక శాఖ కీలక ప్రతిపాదనలు చేసింది. ఇవి అమల్లోకి వస్తే విదేశీ ఉద్యోగుల వార్షిక వేతనం 14వేల డాలర్ల మేర పెరిగే అవకాశం ఉంది. అమెరికన్లతో పోలిస్తే విదేశీ ఉద్యోగులకు వేతనం విషయంలో భారీ వ్యత్యాసం ఉంటోందని, దీనివల్ల చౌకగా లభించే ఉద్యోగులకే కంపెనీలు మొగ్గుచూపుతున్నాయని ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే అగ్రరాజ్య అధికారులు తాజా ప్రతిపాదనలు తీసుకొచ్చారు.

ప్రస్తుతం అమెరికాలో స్థానిక ఉద్యోగులతో పోలిస్తే హెచ్-1బీ వీసాదారులు సగటున 10,191 డాలర్లు తక్కువగా వార్షిక వేతనం అందుకుంటున్నారు. కంప్యూటర్ ఆధారిత వృత్తుల్లో ఈ వ్యత్యాసం మరింత ఎక్కువగా ఉంటోంది. వాస్తవానికి ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన ప్రతిభావంతుల కోసం హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్‌ను తీసుకొచ్చారు. కానీ, అందుకు భిన్నంగా కొన్ని కంపెనీలు ఈ వీసాను దుర్వినియోగం చేసి తక్కువ వేతనం తీసుకునే ఉద్యోగులను విదేశాల నుంచి నియమించుకుంటున్నాయనే ఆరోపణలున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరంలో జారీ అయిన హెచ్-1బీల్లో 63శాతం ఎంట్రీ లెవల్ ఉద్యోగస్థులే ఉన్నట్లు కార్మికశాఖ గణాంకాలు తెలిపాయి. ఈ నేపథ్యంలోనే వేతన పెంపు ప్రతిపాదనలు చేసినట్లు అమెరికా అధికారులు వెల్లడించారు. అధ్యక్షుడి సంతకం తర్వాత ఈ ప్రతిపాదనలు అమల్లోకి వచ్చే అవకాశాలున్నాయి. కార్మిక శాఖ ప్రతిపాదనల ప్రకారం నాలుగంచెల వేతన వ్యవస్థలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఎంట్రీ లెవల్ ఉద్యోగాలకు కనీస వేతనం 34శాతం, లెవల్ 2 వారికి 52శాతం, లెవల్ 3 ఉద్యోగులకు 70శాతం, లెవల్ 4 ఉద్యోగులకు 88శాతం మేర పెంచాలని అగ్రరాజ్యం భావిస్తోంది. ఈ ప్రతిపాదనలతో హెచ్-1బీ వీసాదారుల సగటు వార్షిక వేతనం 14వేల డాలర్ల మేర పెరిగే అవకాశం ఉంది. దీంతో విదేశీ ఉద్యోగులను నియమించే కంపెనీలు ఏటా 6.56 బిలియన్ డాలర్ల వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది.

## నార్డ్‌స్ట్రీమ్'ను అమెరికా స్వాధీనం చేసుకోవాలనుకుంటోంది!
### రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్



**వాషింగ్టన్, మార్చి 27:** రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నార్డ్‌స్ట్రీమ్ పైప్‌లైన్‌లను అమెరికా స్వాధీనం చేసుకోవాలనుకుంటోందని ఆరోపించారు. ఫ్రాన్స్ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై ఆధిపత్యం కోసం అమెరికా ప్రయత్నిస్తోందని, ఇందులో భాగంగానే ఐరోపాకు సరఫరా చేసే గ్యాస్ పైప్‌లైన్లను తమ చేతుల్లోకి తీసుకోవాలని చూస్తోందన్నారు. ఇందుకు సంబంధించి లావ్రోవ్ ఎటువంటి ఆధారాలు చూపించలేదు. అయితే, అమెరికాకు చెందిన ఓ ఇన్వెస్టర్ ఈ పైప్‌లైన్‌లను కొనేందుకు యత్నించినట్లు 2024లో వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం ప్రచురించింది. ఐరోపా ఖండానికి శీతాకాలంలో రష్యా నుంచి గ్యాస్ సరఫరా చేయడంలో నార్డ్‌స్ట్రీమ్ కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా జర్మనీకి సహజ వాయువు తీసుకొచ్చేందుకు బాల్టిక్ సముద్రంలో నార్డ్‌స్ట్రీమ్ 1, 2 గొట్టపు మార్గాలు నిర్మించింది. అయితే, 2022లో ఈ పైప్‌లైన్‌లలో పలు లీకేజీలు వచ్చాయి. వీటికి పేలుళ్లే కారణమని భావించారు. విధ్వంస ఘటనకు సంబంధించి ఆయా దేశాలు దర్యాప్తు చేపట్టినప్పటికీ స్పష్టమైన ఆధారాలు లభ్యం కాలేదు. ఈ క్రమంలోనే గతేడాది ఓ ఉక్రెయిన్ పౌరుడిని ఇటలీ పోలీసులు అరెస్టు చేశారు. అంతేకాదు విధ్వంసం వెనుక అమెరికా హస్తం ఉందని రష్యా గతంలోనూ ఆరోపించింది.

## సముద్రంలో 600కి.మీ మేర చమురు తెట్టు.. జలచరాలపై ఎఫెక్ట్

**మెక్సికో, మార్చి 27:** గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో 600 కి.మీ మేర భారీ చమురు తెట్టు ఏర్పడిందని మెక్సికన్ అధికారులు వెల్లడించారు. దీనివల్ల ఏడు ప్రకృతి సంరక్షణ ప్రాంతాలతో సహా సముద్రంలోని జీవరాశులపై పెను ప్రభావం పడిందన్నారు. రెండు సహజ చమురు ఊటలు, ఓ చమురు నౌక సముద్రంలో బోల్తాపడడం వల్ల ఈ ముప్పు సంభవించిందన్నారు.

ఐదు నెలల క్రితం భారీ వర్షాలు, వరదల కారణంగా మెక్సికోలోని తూర్పు రాష్ట్రమైన వెరాక్రూజ్‌లోముడి చమురు సహజంగా ఊరే ఒక పైప్‌లైన్ పగిలిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. దానినుంచి లీకైన చమురు పాంటెపెక్ నది, టబాస్కో దక్షిణ రాష్ట్రాలలోని 200 కిలోమీటర్ల తీరప్రాంతంతో సహా 600 కి.మీ వ్యాపించింది. కాంపెచే బేలో ఉన్న మరొక సహజ చమురు ఊట కూడా సముద్రతీరంలో వ్యాపిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటికీ అందులోనుంచి చమురు లీక్ అవుతుందన్నారు. గత నెల రోజులుగా వాటినుంచి పెద్ద మొత్తంలో కలుషితాలు వెలువడుతున్నాయని పేర్కొన్నారు. మరోవైపు మూడు నెలల క్రితం గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో చమురు నౌక బోల్తా పడడంతో సముద్రంలో చమురు లీక్ అయ్యిందని అధికారులు తెలిపారు. దానివల్ల వందల సంఖ్యలో సముద్ర తాబేళ్లు, చేపలతో సహా వివిధ జలచరాలు ప్రాణాలు కోల్పోతున్నాయన్నారు. వెరాక్రూజ్ రాష్ట్రంలోని ఐదు అభయారణ్యాలు, బయోస్పియర్ రిజర్వ్, నేషనల్ పార్కుల్లో వ్యాపించిన చమురు కలుషితాలను తమ సిబ్బంది శుభ్రం చేస్తున్నారన్నారు.



## వైట్హౌస్ క్రిప్టిక్ పోస్టులు.. దేని గురించో?



**వాషింగ్టన్, మార్చి 27:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ (గ్ర్చిజూచీ భీటఱుఖఇ) రోజుకో ప్రకటన చేస్తున్నారు. ఈ క్రమంలో అధ్యక్ష కార్యాలయం వైట్హౌస్ కూడా వినూత్న రీతిలో పోస్టులు పెట్టింది. 'మరికొన్ని గంటల్లో అద్భుతమైన ప్రకటన వెలువడుతుంది' అనే అర్థం వచ్చేలా ఓ వీడియోను షేర్ చేసింది. దీనికి హుష్.. అంటూ ఓ ఎమోజీని జతచేసింది. ట్రంప్, జేడీ వాన్స్‌పాటు మరో వ్యక్తి అస్పష్ట ఇమేజ్లను వైట్హౌస్ అధికారిక ఎక్స్, ఇన్స్టా ఖాతాల్లో పెట్టింది. ఇలా అధ్యక్ష కార్యాలయం క్రిప్టిక్ పోస్టులు పెట్టడాన్ని నెటిజన్లు ఆసక్తిగా గమనిస్తున్నారు. అది ఇరాన్ యుద్ధం గురించే ఉండవచ్చంటూ చర్చించుకుంటున్నారు.

## ఇరాన్‌లో 1900 దాటిన మృతుల సంఖ్య



**టెహ్రాన్, మార్చి 27:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో మృతుల సంఖ్య పెరుగుతోంది. ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో ఇరాన్లో ఇప్పటి వరకు 1,900 మందికి పైగా ప్రజలు మరణించినట్లు ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇరాన్ చేసిన ప్రతీకార దాడుల్లో ఇజ్రాయెల్లో 18 మంది, గల్ఫ్‌లో 20 మంది మృతి చెందారు. 13 మంది అమెరికన్ సైనికులు కూడా మృతిచెందినట్లు తెలుస్తోంది. మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 1,100 మందికి పైగా మరణించారని అక్కడి అధికారులు తెలిపారు. ఇరాక్‌లో మరో 80మంది ప్రాణాలు కోల్పోయారు.

ఇజ్రాయెల్-అమెరికా దాడులను ఖండిస్తూ.. టెహ్రాన్‌కు సంఘీభావం తెలిపిన దేశాలకు ఇరాన్ వినూత్నంగా కృతజ్ఞతలు చెప్పింది. క్షిపణిపై 'భారత ప్రజలకు కృతజ్ఞతలు' అనే సందేశాన్ని రాసి ఇజ్రాయెల్‌పై ప్రయోగించింది. స్పెయిన్, జర్మనీ వంటి ఇతర దేశాలకు కూడా టెహ్రాన్ కృతజ్ఞతలు చెప్పింది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్గా మారాయి. ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాలలోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని.. దీర్ఘ, మధ్యశ్రేణి క్షిపణుల దాడులు చేసినట్లు ఐఆర్జీసీ వెల్లడించింది. ఈ దాడుల్లో బహ్రెయిన్‌లోని అమెరికా పేట్రియాట్ వైమానిక రక్షణ వ్యవస్థ నిర్వహణ కేంద్రం ధ్వంసమైనట్లు తెలిపింది. యుద్ధం మొదటి రోజు మినాబ్‌లోని ఓ పాఠశాలపై జరిగిన దాడి అమెరికా ప్రణాళిక ప్రకారమే చేసిందని ఇరాన్ విదేశాంగ మంత్రి ఆరోపించారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలికి పంపిన వీడియో ప్రసంగంలో ఆయన మాట్లాడుతూ ఈ ఘటనలో 160 మందికి పైగా చిన్నారులు, 14 మంది టీచర్లు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

## మంచు చరియలు విరిగిపడి.. ఏడుగురి మృతి



**లద్దాఖ్ మార్చి 27:** లద్దాఖ్‌లో శ్రీనగర్- లేహ్ హైవేపై జోజిలా పాస్ వద్ద మంచు చరియలు విరిగిపడిన ఘటనలో ఏడుగురు మృతి చెందారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. మంచు చరియల కింద అనేక వాహనాలు చిక్కుకుపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్వో), పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. మంచును తొలగించడంతోపాటు ట్రాఫిక్ను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాయి.

ఈ ప్రమాదంపై లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనా స్థలాన్ని సందర్శించి, సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతుల కుటుంబాలకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సంతాపం ప్రకటించారు. గాయపడిన వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

# మ్యాచ్ ఫిక్సింగ్... ఏనా...?

**అధికార పార్టీ ఏకపక్షంగా కొనసాగించేనా**
**విపక్షాలు గళం విప్పేనా..?**
**పట్టణ సమస్యలపై చర్చ సాగేనా**
**పుర సమావేశానికి సిద్ధమవుతున్న పాలకవర్గం**
**రంగం సిద్ధం చేసుకుంటున్న అధికార గణం**
**వార్డు అభివృద్ధికై ప్రత్యేక నిధుల మంజూరు**






**సూర్యాపేట, మార్చి 27 (మనం ప్రతినిధి):** సూర్యాపేట నూతన మున్సిపల్ పాలకవర్గ తొలి సమావేశం ఈనెల 30వ తేదీన జరగనుంది.. అయితే ఈ సమావేశంలో జిల్లా కేంద్రమైన పట్టణంలో ఎంతో కాలంగా విలయ తాండవం చేస్తున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే పట్టణ ప్రజలు ఎంతో ఆశతో ఉన్నారు.. ఈ నేపథ్యంలో గతంలో లాగా పాలకవర్గ సభ్యులు అంతా మ్యాచ్ ఫిక్సింగ్ అవుతారా అనే సందేహాలు కూడా పట్టణ ప్రజల్లో వినిపిస్తుంది. సభ్యులు మ్యాచ్ ఫిక్సింగ్ అయితే సమస్యల పరిష్కారం మాట ఏమిటో బోధ పడటం లేదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు ఏదైతే ఏంటి గతంలో గెలిచిన అనుభవం ఉన్న కొందరు కౌన్సిల్ సభ్యులు మాత్రం తమకు ఉన్న అనుభవంతో గళాలు విప్పుతానని సందేహాలు లేకపోలేదు ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల తోపాటు బిజెపి స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించిన సభ్యులు ఈ సమావేశంలో ఎంతవరకు సమస్యల పరిష్కారానికై కొట్లాడుతారు వేచి చూడాల్సిందే.

**కాంగ్రెస్ పై గుస్సా...**

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పర్యాటక శాఖ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అనుచరులుగా ఉంటూ గత మున్సిపల్ ఎన్నికల్లో 18. 48 .వ వార్డుల కౌన్సిలర్ సభ్యులు బీసీ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్. రామ్మూర్తి యాదవ్. వెలుగు వెంకన్నలు. తమ నాయకుడు మున్సిపల్ ఎన్నికల ముందు తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని తమ వర్గ నాయకునికి అంటి ముట్టనట్టుగా కుంటున్నట్టు సమాచారం. దీంతో పదవి ఆశించి భంగపడ్డ ఈ ఇరువురు పాలకవర్గ సభ్యులు కాంగ్రెస్ పార్టీపై కొంతకాలంగా గుస్సాగా ఉంటున్నట్లు తెలుస్తోంది.

**పట్టణంలో ప్రధాన సమస్యలపై చర్చ జరిగేనా..?**

సూర్యాపేట పట్టణంలో ప్రధాన సమస్యలు మొదటి నుండి ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయి. చైర్పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ నూతన పాలకవర్గం జరగబోయే తొలి సమావేశంలో ఆ ప్రధాన సమస్యలపై చర్చ కొనసాగిస్తుందో లేదో అనే పట్టణ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు జిల్లా కేంద్రంలో ప్రధాన సమస్యలు ఏంటంటే.. 2016 నుండి విలీన గ్రామాల వార్డులు శివారు ప్రాంతాలు కావడంతో ప్రధానంగా రోడ్లు చిన్నపాటి వర్షం కురిస్తే మునిగిపోయే పరిస్థితి ఇలాగే పారిశుద్ధ కాలువలు చిన్న చిన్న వర్షాలకి నిండిపోవడం శివారు ప్రాంత నివాసాలలోకి వరద నీరు చేరడం చూస్తూ ఉన్నాం. దీనితో విలీన గ్రామాల వార్డులకు దయనీయ పరిస్థితి ఏర్పడింది.. ఇదిలా ఉండదా త్రాగునీటి ఎద్దడి వేసవి కాలం మాసంలో చూసాం. కొన్ని వార్డులకు సంబంధించి కౌన్సిలర్లు దీనిపై ప్రశ్నించేందుకు సిద్ధంగా ఉన్నారు... ఏదైనా పైపుల లీకేజీ మరమ్మత్తులు జరిగిన మున్సిపల్ కుళాయిలు రెండు రోజులు వరకు రాకపోవడం జరుగుతుంది. దీనితో స్థానికంగా నీరు అందక కొన్ని వార్డుల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. కొన్నిచోట్ల మున్సిపల్ ట్యాంకర్లతో నీటి సరఫరా చేసిన సమస్య శాశ్వత పరిష్కారం మాత్రం దొరకలేదు. ఇక బోరు వేసుకోలేని నిరుపేద కుటుంబాల పరిస్థితి సరిపడ నీరు అందక అగమ్యగోచరంగా తయారైంది..

**అభివృద్ధి మరమ్మతులపై ప్రత్యేక నిధులు అవశ్యం...**

ఇక పలు వార్డుల్లో అభివృద్ధి మరోపక్క మరమ్మత్తుల పనులు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా విలీన గ్రామాల వార్డుల్లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం..

చిన్నచిన్న కాలువల మరమ్మతులు పారిశుద్ధ్యం వీధిలైట్ల సరఫరా ఇలా పలు సమస్యలు వార్డులో నెలకొన్నాయి.. వీటితోపాటు పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం సంబంధిత కాంట్రాక్టు దక్కించుకున్న గుత్తేదారుడు. ప్రతి గల్లీలో రోడ్లను తవ్వి డ్రైనేజ్ పైప్ లైన్ వేయడం జరిగింది.. దీంతో పైప్ లైన్ కోసం గుంతలు తీసిన రోడ్లను సిమెంట్ కంకరతో పైప్ లైన్ పూడ్చివేయాల్సి ఉంది. కానీ సదరు కాంట్రాక్టర్ అలా చేయకుండా అవి తీసిన మట్టినే పైపు లైన్ పై వేసి తాత్కాలికంగా పూడ్చారు.. దీంతో ప్రతి గల్లీలోను పూడ్చిన రోడ్లపై మట్టి వర్షానికి కొట్టుకొని పోయి సిసి రోడ్లు గుంతల మయం గా మారిపోయాయి.. దీనివల్ల ఎంతోమంది పాదాచార్యులు వాహనదారులు. ప్రమాదాలకు గురైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.. ఇలా పట్టణంలో ఎన్నో సమస్యలు శాశ్వత పరిష్కారం కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది... ఇది ఇలా ఉండగా ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో పట్టణంలోని 48 వార్డుల్లో మొదటి విడతగా అభివృద్ధి పనులపై స్థానిక ప్రజలకు ఇచ్చిన హామీని స్థానిక కౌన్సిలర్లు నిలబెట్టుకునేందుకు వార్డుల వారీగా ప్రత్యేక నిధులు మంజూరు చేసుకొని మొదటి పాలకవర్గ సమావేశంలో ఎంతో కొంత నూతనంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలి. లేకుంటే వార్డు ప్రజలకు అభివృద్ధి పనులపై దాటవేసి ధోరణి అవలంబించాల్సిన పరిస్థితి అటు అధికార ప్రతిపక్ష స్వతంత్ర కౌన్సిల్ సభ్యులకి ఏర్పడుతుంది అనటంలో సందేహం లేదు.

# శ్రీ సీతారాముల కళ్యాణం మహాకమనీయం

**ప్రధాన ఆలయాలలో పోటెత్తిన భక్తజనం**
**స్వామివార్ల కళ్యాణం సందర్భంగా పట్టు వస్త్రాలు, అన్నదాన కార్యక్రమాలు**
**సీతారామచంద్ర స్వామి వార్లకు పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు**
**స్వామివార్ల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు**



**ఉమ్మడి మహబూబ్ నగర్ మార్చి 27 (మనం బ్యూరో):** శ్రీరామ నామమి పర్వదినం సందర్భంగా శుక్రవారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా శ్రీరాములవారి ప్రధాన ఆలయాల్లో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ పండుగ వేడుకలను ఆయా జిల్లా ప్రజలు, భక్తులు అంగరంగ వైభవంగా జరుపుకోవడం జరిగింది. సీతారాముల కళ్యాణ మహోత్సవానికి ఆయా పట్టణాల, గ్రామాల, మండలాల నుండి గ్రామ ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున స్వామి వారి కళ్యాణంలో పాల్గొని వేడుకలను తిలకించారు. సీతారాముల కల్యాణ కార్యక్రమానికి భక్తులు నలుమూలల నుండి ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణంలో పాల్గొన్నారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవం వేదమంత్రోత్సవాల నడుమ కన్నుల పండుగ కొనసాగాయి. అచ్చంపేట నియోజకవర్గం చారకొండ మండలం శిరీషనుగండ్ల కొండపై వెలిసిన సీతారామచంద్ర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన దేవాలయంలో ఒకటైన సిరిసినగండ్ల గ్రామంలో ఉన్నటువంటి సీతారామచంద్రస్వామి కళ్యాణ వేడుక ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుంది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యి కళ్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. అదేవిధంగా అక్కడక్కడ జిల్లాలో వరుడు రాములవారు, పెళ్లికూతురు సీత దేవి తరపున పెద్ద మనుషులుగా పలువురు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించడం జరిగింది. కళ్యాణ వేడుకలు ముగిసిన అనంతరం ప్రధాన ఆలయాల్లో అక్కడక్కడ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. భక్తులు ముందస్తుగా వచ్చే ఏడాది వరకు అందరం చల్లంగా ఉంటే స్వామి వాళ్లకు పట్టు వస్త్రాలు సమర్పించి అదేవిధంగా వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపడతారని ఆయా ప్రధాన ఆలయాల్లో ముందస్తుగా ప్రకటించడం జరుగుతుంది. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా స్వామి వారి కళ్యాణ మహోత్సవ వేడుకలు కన్నుల పండుగ కొనసాగాయి.

నాగర్ కర్నూల్ జిల్లాలో సిరిసినగండ్ల, లింగాల, అమ్రాబాద్, మాచారం, మన్ననూర్ తదితర ప్రధాన ఆలయాలలో భక్తిశ్రద్ధలతో కళ్యాణం మహా కమనీయం అన్న విధంగా కొనసాగడం జరిగింది.

గ్రామంలో రామాలయం ఒకటే ఉండడం పట్ల గ్రామాల నుండి నలుమూలల స్వామివారి కళ్యాణ మహోత్సవానికి వేలాదిగా తరలివచ్చి కళ్యాణాలు తిలకించి, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఘనంగా సీతారామ కళ్యాణం



**పాలకీడు, మార్చి 27 (మనం న్యూస్):** మండల పరిధిలోని అలింగాపురం గ్రామంలో శ్రీ సీతారాముల కళ్యాణం శుక్రవారం వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం క్రీస్తు శేషులు ఆత్మకూరి నాగరాజు జ్ఞాపకార్థకం వారి కుమారులు నరేందర్ సురేందర్ మహా అన్న ప్రసాద సమర్పణ భక్తులకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నామ సత్యనారాయణ పద్మావతి దంపతులు, గ్రామ సర్పంచ్ బొమ్మన బోయిన సైదమ్మ, మట్టయ్య, నామ జీనత్ కుమార్ దంపతులు, సురేందర్ దంపతులు, గ్రామ పెద్దలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సిర్సనగండ్లలో కన్నుల పండుగగా
# సీతారాముల కల్యాణోత్సవం



**ఉమ్మడి మహబూబ్ నగర్ మార్చి 27 (మనం బ్యూరో):** చారిత్రాత్మక పుణ్యక్షేత్రమైన దేవాలయంలో ఒకటైన సిర్సనగండ్లలో శ్రీరామ నవమి వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. శుక్రవారం లోక కల్యాణం కోసం జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. అనంతరంస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. వేద మంత్రోచ్చారణలు, మంగళవా యిద్యాల మధ్య అర్చకులు సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు వెలదిగా తరలివచ్చారు. పూజా కార్యక్రమాల అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. సిర్సనగండ్ల క్షేత్రానికి ఉన్న విశిష్టతను కాపాడుతూ, భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పుణ్యక్షేత్రాన్ని పర్యాటక పరంగా కూడా అభివృద్ధి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రెండవ భద్రాద్రి స్థాయిలో రామగిరి రామాలయం అభివృద్ధి

- **వచ్చే వైకుంఠ ఏకాదశికి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం గోపురం**
- **రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



**నల్లగొండ, మార్చి 27( మనం ప్రతినిధి):** నల్గొండలోని రెండవ భద్రాద్రిగా వెలుగొందుతున్న రామగిరి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి వచ్చే సంవత్సరం శ్రీరామనవమి నాటికి మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని శుక్రవారం నల్గొండ పట్టణంలోని రామగిరి దేవాలయంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణోత్సవంలో మంత్రి పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తమ నివాసం నుంచి బాజా బాజా భజంత్రీలతో స్వామివారి కల్యాణోత్సవానికి ముత్యాల తలంబ్రాలు తీసుకొచ్చారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఘనంగా జరిగింది. సీతారాముల కళ్యాణోత్సవం తిలకించిన అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు మీడియాతో మాట్లాడుతూ రామగిరి దేవాలయానికి ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు తరలివస్తారని చెప్పారు. రెండవ భద్రాద్రి పేరు స్వార్థకం అయ్యేలా రామగిరి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని అదే స్థాయిలో అభివృద్ధి చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. దేవాలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని, వైకుంఠ దర్శనం, ఉత్తర ద్వార దర్శనం వంటి సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. దర్శన మార్గాల విస్తరణ కోసం అవసరమైన స్థల సేకరణకై ఇప్పటికే చర్చలు జరుపుతున్నామని, నెల రోజుల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. రామగిరి రామాలయానికి గొప్ప చరిత్ర ఉందని గుర్తుచేస్తూ, భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

అలాగే, దేవాలయ భూములకు ఇబ్బంది కాకుండా నేషనల్ హైవే మార్గాన్ని బైపాస్ ద్వారా మళ్లించామని పేర్కొన్నారు. నల్గొండ పట్టణ ప్రజలు శ్రీరాముని కృపతో సుఖ : సంతోషాలతో ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి సహకారంతో రామగిరి రామాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఉత్తర ద్వార దర్శనానికి కృషి చేస్తానని చెప్పారు. కళ్యాణోత్సవం అనంతరం నవమి వేడుకల సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన సొంత ఖర్చులతో 4 వేల మందికి ఏర్పాటు చేసిన అన్న ప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి , మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, ధర్మకర్తలు, ఆలయ ఈవో జయరామయ్య, స్థానిక కార్పొరేటర్ యామ కవితా దయాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ , తిప్పర్తి మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి,47వ డివిజన్ కార్పొరేటర్ అబ్బగోని కవిత రమేష్ గౌడ్, అర్చకులు షటారి ,రఘు ,గిరి, పలువురు కార్పొరేటర్లు, ఈశ్వర్ రెడ్డి, రాజేష్ ,సుజాత, బోనగిరి ప్రభాకర్, వంగాల అనిల్ రెడ్డి, పాదం అనిల్ భక్తులు ,ప్రజలు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరత లేదు....
## ప్రజలు ఇబ్బందులు పడ వద్దు



- **కోదాడలో గ్యాస్ గోడౌన్ సందర్శించిన బీజేపీ సూర్యా పేట జిల్లా ఉపాధ్యక్షుడు మల్లే బోయిన వెంకటేష్ బాబు**

**కోదాడ, మార్చి 27(మనం న్యూస్):** నియోజకవర్గంలో ఎటువంటి గ్యాస్, పెట్రోల్, డీజిల్ ఇంధనాల కొరత లేదని బీజేపీ సూర్యా పేట జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేబోయిన వెంకటేష్ బాబు అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణం లోని గ్యాస్ గోడౌన్ ను సందర్శించి మాట్లాడారు. గ్యాస్ కొరత లేకుండా కేంద్రం లో ఉన్న బీజేపీ ప్రభుత్వం చూస్తుందన్నారు. గ్యాస్ లోడ్ లు వస్తున్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. కొందరు బ్లాక్ మార్కెట్ కోసం కృత్రిమ కొరత సృష్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. పెట్రోల్ డీజిల్ కొరత లేదని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు ప్రజలు నమ్మ వద్దన్నారు. ప్రజలకు బీజేపీ పార్టీ అండగా ఉంటుందన్నారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ సరఫరా పై బీజేపీ రాష్ట్ర నాయకత్వం కేంద్రం తో నిత్యం సంప్ర దిస్తుందన్నారు. గ్యాస్ అధిక ధరకు విక్రయించిన , కృత్రిమ కొరత సృష్టించేందుకు ప్రయతించిన బీజేపీ పక్షాన అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు ఉన్నారు.

## దామరగిద్దలో రామయ్యకు ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రత్యేక పూజలు



- **లోకకళ్యాణమే శ్రీరాముని మార్గం: ఎమ్మెల్యే**

**చేవెళ్ల, మార్చి 27 (మనం న్యూస్):** లోక రక్షకుడు శ్రీరామచంద్రుడు చూపిన ధర్మ మార్గం అందరికీ ఆదర్శనీయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దామరగిద్ద గ్రామంలో వెలసిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి: చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య. సీతారాముల ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రాముడి పాలన (రామరాజ్యం) స్ఫూర్తితో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీతారాముల వందవ కళ్యాణ మహోత్సవ వేడుకలు





**చింతలపాలెం, మార్చి 27 (మనం న్యూస్):** మండల పరిధిలోని దొండపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి 100 వ కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పురాతన కాలం నుండి ఉన్న ఈ గుడిని కాసర్ల వారి కుటుంబానికి చెందినవారు పాడుబడిన ఈ గుడిని పున:నిర్మాణం చేసి ఆనాటి నుండి ప్రతి సంవత్సరం స్వామివారి కళ్యాణాన్ని వారి ఆధ్వర్యంలో గ్రామ ఆలయ కమిటీ వారిచే ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు ఇప్పటికీ ఈ కళ్యాణం తో 100 సంవత్సరములు పూర్తి చేసుకున్నాయి. ఈ శతాధిక కళ్యాణ మహోత్సవ వేడుకలను పురస్కరించుకొని స్వామివారికి రెండు లక్షల రూపాయలు ఖర్చుతో ఊరేగింపు రథాన్ని అన్నపురెడ్డి నరసింహారెడ్డి s/o వెంకటేశ్వర్ రెడ్డి (పెద్దబ్బాయి) తయారు చేయించి ఇచ్చినారు. స్వామివారిని ప్రధాన వీధుల్లో ఊరేగించుటకు అవసరమైన జనరేటర్ మరియు లైట్లు సుమారు 35 వేల రూపాయలతో మెట్టు వెంకటరామిరెడ్డి,అనూష దంపతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు వేద పండితుల మంత్రోచ్చారణాలు మంగళ వాయిద్యాలు నడుమ స్వామి వారి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కళ్యాణం అనంతరం వచ్చిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలతో పాటు వడపప్పు, బెల్లంపానకం పంపిణీ చేశారు అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని భక్తుల సహాయ సహకారంతో నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చింత కుంట్ల శాంతారెడ్డి, వైస్ చైర్మన్ బరిగల నరసింహారావు, ఆలయ ధర్మకర్త లు కాసర్ల చిన్నప్రసాద్, సర్పంచ్ చెన్నకేశి వెంకయ్య, వైస్ సర్పంచ్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ పగిడి బ్రహ్మం దంపతులు పీటలపై కూర్చొగా, ఆలయ వేదాంత పండితులు పరంకుశం లక్ష్మీనరసింహ చార్యులు, బొర్రా నరసింహచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని కళ్ళారా చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల భక్తులు, మహిళలు తరలివచ్చారు ఈ కార్యక్రమంలో చివరిగా మహాలక్ష్మి, నికిత చిన్నపిల్లలు లవకుశల వేషధారణలో రామాయణాన్ని పారాయణం తో భక్తులను ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పండగ వాతావరణం నెలకొంది.

# సీతారామ కళ్యాణం కమనీయం

- **స్వామివారికి నూతన పట్టు వస్త్రాలను సమర్పించిన పలువురు**
- **వాడవాడలో వివాహ వేడుకలు నిర్వహించిన భక్తులు**





**సూర్యాపేట మార్చి 27 (మనం ప్రతినిధి):** శ్రీరామనామ స్మరణతో మారుమోగిన సూర్యాపేట సూర్యాపేట జిల్లా కేంద్రంలో శ్రీరామనవమి ఉత్సవాలు కన్నుల పండుగ అంగరంగ వైభవంగా నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వేదాంత బజన మందిరంలో 74వ వార్షిక కళ్యాణోత్సవంలో భాగంగా శుక్రవారాం స్వామి అమ్మవార్లను ప్రత్యేక మండపంపై పట్టు వస్త్రాలతో అలంకరించి వేదమంత్రాలు నడుమ వేద బ్రాహ్మణులు కళ్యాణ తంతు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు జైశ్రీరామ్ జైశ్రీరామ్ అంటూ నినాదాలతో హోరు ఎత్తించారు. కళ్యాణం అనంతరం భక్తులు పెద్ద ఎత్తున స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సూర్యాపేట మున్సిపల్ చైర్మన్ మొ రి శెట్టి నివేదిత లక్ష్మాది, ఎఐసిసి సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వర్ రావు, ఆలయ ప్రధాన అర్చకులు ధరూరి సింగరాచార్యులు, సహాయ అర్చకులు రాఘవాచార్యులతో పాటు ఆయా అవార్డుల కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శ్రీ కార్యసిద్ధి సీతారామాంజనేయ స్వామి ఆలయంలో వేడుకః సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 24 వ వార్డులోని శ్రీ కార్యసిద్ధి సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామనవ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి కళ్యాణాన్ని నిర్వహించారు. అంతకుముందు వార్డులో ఊరేగింపుగా ఉత్సవ విగ్రహాలను తీసుకొచారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మన్నం అరుణ మల్లేష్, ఆలయ కమిటీ అధ్యక్షులు ఎం.పుల్లయ్య, ఉపాధ్యక్షులు ఎలుగూరి అంజయ్య, కార్యదర్శి పరమేష్, మాజీ కౌన్సిలర్ ఆకుల లవకుశ, ఎలుగురి ఆశాలు, సాధనాల ఉపేందర్ బండారు లక్ష్మయ్య రఘు ఎలుగురి వెంకన్న, పట్టేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**నల్లాలబాయి చౌరస్తాలో...**

జిల్లా కేంద్రంలోని నల్లాల బావి చౌరస్తాలో మార్గదర్శి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు సరిగంటి శ్రీనివాస్ ఇంటి నుంచి సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక మండపంపై ఉంచి విశేషంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు నేరెళ్ల మధు గౌడ్, కొండ రాజేష్, సలిగంటి నాగయ్య, గుణగంటి మధు, కంచగట్ల జానయ్య, పర్వతం ఉపేంద్ర చారి, తాటి రాంబాబు, కారింగుల, వేణు గౌడ్, ఉపేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తితో కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ

## మొక్కజొన్న రైతులకు భారీ ఊరట దిశగా కీలక ప్రయత్నం



**అమరావతి/ విశాఖపట్నం , మార్చి 27:** రాష్ట్రంలో మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులను గమనించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రైతుల అభ్యున్నతే లక్ష్యంగా వెంటనే చర్యలు చేపట్టారు. 2025-26 రబీ సీజన్లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4.83 లక్షల హెక్టార్లలో సాగు జరిగి 37 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి నమోదైనప్పటికీ, మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే తక్కువగా ఉండటంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని మంత్రి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. అత్యవసర అవసరాల నిమిత్తం రైతులు తక్కువ ధరలకు పంటను అమ్ముకోవాల్సి వస్తోందని వివరించిన మంత్రి, ఈ పరిస్థితుల్లో తక్షణమే కేంద్రం జోక్యం అవసరమని ముఖ్యమంత్రి కి స్పష్టం చేశారు. రైతులకు న్యాయమైన ధర కల్పించాలనే లక్ష్యంతో ధర లోపం చెల్లింపు (పిడీపీఎస్ స్కీం) ను మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ (ఎమ్ ఐ ఎస్) ద్వారా అమలు చేయాలని, ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్కు 100% నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం భరించేలా చేయాలని, అలాగే ప్రస్తుత 25% పరిమితిని 100% ఉత్పత్తికి విస్తరించి, జూన్ 2026 వరకు పథకాన్ని కొనసాగించాలని మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి, కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ కి లేఖ రాసి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# జీవీఎంసీ కమిషనర్‌ను కలిసిన బళ్లారి సిటీ కార్పొరేషన్ మేయర్

- విశాఖ అభివృద్ధి వివరించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్
- విశాఖ ఇతర నగరాలకు ఆదర్శంగా నిలుస్తూ స్ఫూర్తిని కలిగిస్తోందన్న బళ్లారి మేయర్



**విశాఖపట్నం, మార్చి 27 (మనం న్యూస్):** అధ్యయన యాత్రపై విశాఖ నగరానికి విచ్చేసిన బళ్లారి సిటీ కార్పొరేషన్ మేయర్ పి.గాదెప్ప ,బళ్లారి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ జె. ఎస్. ఆంజనేయులు, బళ్లారి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ మెంబర్ రంజిత్ కుమార్ లతో కలసి శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం కమిషనర్ ఛాంబర్ లో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ను మర్యాదపూర్వకంగా కలిసి విశాఖ నగర సుందరీకరణ ,అభివృద్ధి కార్యక్రమాలు ఆకట్టుకుంటూ ఇతర నగరాలకు ఆదర్శంగా నిలుస్తూ స్ఫూర్తిని కలిగిస్తుందని ప్రశంసలను వ్యక్తం చేస్తూ అభినందనలను తెలిపారు.ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ బళ్లారి మేయర్ మాట్లాడుతూ విశాఖ నగర అభివృద్ధి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా సంక్షేమ పథకాలు నిర్వహణ, నగర సుందరీకరణ పై నిత్యం చేపడుతున్న కార్యాచరణను బళ్లారి మేయర్ కు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్డి సిస్టం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ప్రతి సోమవారం నిర్వహిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని, అలాగే జీవీఎంసీ సిటీ ఆపరేషన్స్ సెంటర్ ద్వారా ఐ వి ఆర్ ఎస్, టోల్ ఫ్రీ నెంబర్ 1800 4250 0009 ప్రజా ఫిర్యాదులను స్వీకరించడం, వాటి పరిష్కారం పై సంబంధిత విభాగాలకు సమాచారం చేరవేసినిర్ణీత సమయంలో ఆయా సమస్యలు పరిష్కరించే కార్యక్రమం జీవీఎంసీ నిత్యం జరుపుతుందన్నారు. విశాఖ నగరంలో వాహనాల రాకపోకలకు సౌకర్యంగా ట్రాఫిక్ రద్దీని అరికట్టేందుకు, ప్రజలకు వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పించేందుకు, జీవీఎంసీ పరిధిలో పార్కులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమణలకు గురికాకుండా రక్షణ కల్పించే దిశగా జీవీఎంసీ వినూత్నంగా ఆపరేషన్ లంగ్స్ (లైఫ్ టు అర్బన్ గ్రీన్ స్పేసెస్) 1,2,3 లను దశలవారీగా చేపట్టడం జరిగిందన్నారు. ప్రజలకు అందించే నీటి సరఫరా 24/7 వాటర్ సప్లై నిర్వహణను వివరించారు. నగరంలో ఎస్టీలను నిర్వహిస్తూ నీటిని శుద్ధి చేసి పరిశ్రమలకు సరఫరా చేయడం ద్వారా జీవీఎంసీకి ఆదాయంచేకూరుతుందన్నారు. జీవీఎంసీ ఆస్తులను గుర్తించి ఆయా ప్రదేశాలలో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయడం ద్వారా జీవిఎంసీ ఆదాయాన్ని చేకూర్చుకుంటుందన్నారు. వీధిలైట్లు నిర్వహణ ద్వారా నగర సుందరీకరణ , సోలార్ ప్లాంట్లు నిర్వహణ, రోడ్లు విస్తరణ, జంక్షన్లో అభివృద్ధిని వివరించారు. నగరంలో అన్ని మౌలిక సదుపాయాలతో ప్రజలకు అందుబాటులో ఉండేలా, వీధి విక్రయదారులను గుర్తించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా జీవీఎంసీ వినూత్నంగా స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ జోన్లను నగరంలో ఏర్పాటు చేస్తుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయడంలో జీవీఎంసీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. అనంతరం బళ్లారి మేయర్ పి గాదెప్ప మాట్లాడుతూ విశాఖ నగరానికి అధ్యయన యాత్రకు విచ్చేయడం జరిగిందని, గురువారం వి ఏం ఆర్ డి ఏ చైర్మన్ ను కలిసి విఎమ్ఆర్డిఏ ద్వారా నగరంలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నామన్నారు. విశాఖ నగర సుందరీకరణ, అభివృద్ధి చాలా ఆకర్షణీయంగా ఉందని జీవీఎంసీ కార్యాచరణ ఇతర నగరాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. త్వరలో బళ్లారి సిటీ కార్పొరేషన్ నుండి విశాఖ నగర అభివృద్ధి కార్యక్రమాలపై అధ్యయనం చేసేందుకుగాను ప్రత్యేకమైన సాంకేతిక బృందాన్ని విశాఖ నగరానికి పంపిస్తామని, జీవీఎంసీ చేపట్టి ఆచరిస్తున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమం, నగర సుందరీ కరణ తదితర అంశాలను బళ్లారి సిటీ కార్పొరేషన్ సాంకేతిక బృందానికి వివరించేలా జీవీఎంసీ సహాయ సహకారాలు అందించాలని జీవీఎంసీ కమిషనర్ ను ఈ సందర్భంగా బళ్ళారి మేయర్ పి. గాదెప్ప కోరారు.ఈ కార్యక్రమంలో బళ్లారి సిటీ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి తిప్పేస్వామి పాల్గొన్నారు.

# కుదిరిన ముంబై ఇండియన్స్, కోల్గేట్ టోటల్ మధ్య భాగస్వామ్యం

**విశాఖపట్నం, 27 మార్చి, 2026:** ముంబై ఇండియన్స్, కోల్గేట్ టోటల్ మధ్య భాగస్వామ్యం కుదిరింది. క్రీడాకారుల దంత ఆరోగ్యాన్ని అత్యున్నత స్థాయిలో నిర్వహించేందుకు వీరు సంయుక్తంగా ప్లాట్ అనే వినూత్నమైన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందస్తు దంత సంరక్షణ మరియు పూర్తి ఆరోగ్యం పట్ల తన నిబద్ధతను మరింత బలోపేతం చేస్తూ, కోల్గేట్ టోటల్ సంస్థ ముంబై ఇండియన్స్ జట్టుతో దంత పనితీరు భాగస్వామిగా(డెంటల్ పెర్ఫార్మెన్స్ పార్టనర్) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం ద్వారా 2026 సీజన్కు ముందే క్రీడాకారుల సన్నద్ధతలో దంత ఆరోగ్యం అనేది అత్యంత కీలకమైన అంశంగా ముందుకు వచ్చింది. కోల్గేట్ తన సరికొత్త కార్యక్రమమైన ప్లాట్ (పిఓఎల్టి-



పర్ఫార్మెన్స్ లింక్డ్ ఓరల్ టెస్ట్)ను ఆవిష్కరించింది. ఇది క్రీడాకారుల దంత ఆరోగ్యాన్ని ముందుగానే అంచనా వేయడానికి మరియు అత్యున్నత స్థాయిలో నిర్వహించడానికి రూపొందించబడిన ఒక సమగ్రమైన దంత ఆరోగ్య పరీక్షా విధానం. ఈ భాగస్వామ్యం దంత ఆరోగ్యాన్ని జట్టు యొక్క పనితీరు ప్రణాళికలో ఒక భాగంగా మార్చింది. శరీర ఆరోగ్యం అనేది మైదానంలో క్రీడాకారుడి సహనశక్తి మరియు కోలుకునే సామర్థ్యాన్ని నిర్ణయించే కీలకమైన అంశమని గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నారు. నోరు శరీరానికి ఒక ప్రవేశ ద్వారం వంటిది. శాస్త్రీయ ఆధారాల ప్రకారం, మీ నోటిలోని క్రిములు శరీరంలోకి ప్రవేశించి వాపులు లేదా ఇన్ఫ్లమేషన్ని కలిగించవచ్చు. దీనివల్ల క్రీడాకారులు గాయాల నుండి కోలుకునే వేగం తగ్గిపోవడమే కాకుండా వారి ఆట తీరుపై కూడా ప్రభావం పడుతుంది. అందుకే, మైదానంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచడం ముఖ్యం కాబట్టి, నోటిలో క్రిములు చేరకుండా ముందుగానే అరికట్టడం చాలా కీలకం. ఈ కార్యక్రమంలో భాగంగా, ప్రముఖ వైద్యులు డాక్టర్ మోయిజ్ ఖాకియాని(డా. మోయి జ్ ఖాకియానీ) ఆధ్వర్యంలో ముంబై ఇండియన్స్ ఆటగాళ్లకు అత్యాధునిక ఇంట్రాఓరల్ స్కానింగ్ టెక్నాలజీతో సమగ్ర దంత పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ( డబ్ల్యుహెచ్ఒ) ప్రమాణాల ఆధారంగా రూపొందించిన ఈ ఓరల్ హెల్త్ అసెస్మెంట్ ద్వారా క్రీడాకారుల దంత ఆరోగ్యాన్ని అంచనా వేస్తారు. ఆటగాళ్ల మొత్తం ఫిట్నెస్ మరియు మైదానంలో వారి ప్రదర్శనపై ప్రభావం చూపే అవకాశం ఉన్న దంత సమస్యలను ముందే గుర్తించడం ఈ పరీక్షల ప్రధాన ఉద్దేశం.

# రాములోరికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఈవోవెంకటరావు

**సింహాచలం మార్చి 27 (మనం న్యూస్):** శ్రీ రామనవమి సందర్భముగా రామ తీర్థాలలో వెలసిన సీతారాముల కళ్యాణానికి ప్రతి సంవత్సరం వలే ఈ సంవత్సరం కూడా సాంప్రదాయబద్ధంగా శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం నుండి ఆలయ కార్యనిర్వహణాధికారి దంపతులు ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు సిబ్బంది సీతారాముల వారి కళ్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పించారు. రామతీర్థం చేరుకున్న సింహాచల ఈవో దంపతులకు మరియు అర్చక బృందానికి, అక్కడి ఆలయ కార్యనిర్వహణాధికారి వి. శ్రీనివాసరావు నాదస్వర మేళతాళాలు, వేదమంత్రాలతో ఘనంగా స్వాగతం పలికారు.వేదమంత్రాలతో స్వాగతం పలికి



స్వామివారికి పట్టు వస్త్రాల సమర్పించిన అనంతరము సింహాచలం కార్యనిర్వహణాధికారి దంపతులకు స్వామివారి దర్శనంకల్పించి శేష వస్త్రంతో సత్కరించి ఆలయ కార్యనిర్వహణాధికారి వి. శ్రీనివాసరావు స్వామివారి ప్రసాదాలను అందజేశారు

## శ్రీ శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి

# దేవస్థానం సింహాచలం

### సింహాచల క్షేత్రాన్ని దర్శించుకున్న అల్లూరి సీతారామరాజు మరియు అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు



**సింహాచలం, 27 మార్చి:** శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారిని శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ శ్రీ ఏ.ఎస్. దినేష్ కుమార్, ఐ.ఏ.ఎస్. మరియు అనకాపల్లి జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ కృష్ణన్, ఐ.ఏ.ఎస్. తమ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్లకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు, సహాయ కార్య నిర్వహణాధికారి కె తిరుమలేశ్వరావు సాదరంగా ఆహ్వానం పలికారు. తొలుత కలెక్టర్లు ఆలయ ప్రాంగణంలోని అత్యంత మహిమాన్వితమైన 'కప్పస్తంభాన్ని' ఆలింగనం చేసుకున్నారు. అనంతరం వారు స్వామి వారి అంతరాలయంలో జరిగిన సహస్రనామార్చన సేవలో అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. లక్ష్మీనరసింహ స్వామి వారి దర్శనం అనంతరం వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు



నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు కలెక్టర్ల కుటుంబ సభ్యులకు వేద మంత్రోచ్ఛారణలతో 'వేదాశీర్వచనం' అందజేశారు. చివరగా, ఆలయ కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు స్వామి వారి శేష వస్త్రంతో కలెక్టర్లను సత్కరించి, లడ్డూ ప్రసాదాలను మరియు స్వామి వారి దివ్య స్వరూపంతో కూడిన జ్ఞాపిక (ఫోటో)ను అందజేశారు.

# నవమి వేడుకల్లో పాల్గొన్న విఎంఆర్‌డి ఎ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్

**విశాఖపట్నం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి మార్చి 27:** విశాఖపట్నం నగరం లో శ్రీ రామ నవమి సందర్భంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన పూజాది కార్యక్రమాలు, శ్రీ సీతా రాముల కల్యాణంలో ముఖ్య అతిథి గా వి. ఎం. ఆర్. డి ఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ గారు పాల్గొన్నారు.పాత వెంకోజీపాలెం సమీపంలోని శ్రీ సీతా రామ సేవా సంఘం ఆధ్వర్యంలో సీతారాముల ఆలయంలో జరిగిన శ్రీ సీతా రాముల కల్యాణంలో పాల్గొన్నారు. సీతారాముల వారిని దర్శించుకొని పూజలు చేశారు.కృష్ణా కళాశాల రోడ్ లో ఏలియన్స్ హోటల్ మేనేజ్మెంట్ కళాశాల ఆవరణలో నిర్వహించిన కల్యాణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్య సభ్యులు సతీష్ , విద్యార్థులు పాల్గొన్నారు.పెదవాల్తైర్ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో శ్రీ రామ నవమి వేడుకలు, శ్రీ సీతా రామచంద్రమూర్తి స్వామి



కళ్యాణం ఎంతో ఘనంగా జరిపారు. ఈ కళ్యాణ వేడుకల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని పూజలు జరిపారు. కమిటీ సభ్యులు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు. పేద వాల్తేర్ కూడలి దరి చిన్మయ మిషన్ ఆవరణలో నిర్వహించిన సీతా రాముల కళ్యాణం లో పాల్గొన్నారు.ఉత్తర నియోజకవర్గంలోని రేసపువాని పాలెం వద్ద రామాలయం విధిలో రేసపువాని పాలెం అధ్యక్షుడు గురుమూర్తి రెడ్డి నేతృత్వంలో శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించిన సీతా రాముల కళ్యాణం లో ఆయన పాల్గొన్నారు. ఇక్కడ ఏర్పాటుచేసిన అన్న ప్రసాద వితరణ లో పాల్గొని, భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. రామాటాకీస్ దరి వినాయక నగర్ లో శివాలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ రామ నవమి వేడుకలు, సీతా రాముల కళ్యాణం లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు.సీతంపేట లో సంపంగి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన శ్రీ రామ నవమి వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు తో కలిసి పాల్గొన్నారు. శ్రీ రామ చంద్ర మూర్తి స్వామి కి పూజలు జరిపారు. ఈ సందర్భంగా స్థానిక నేతలు వీరిని ఘనంగా సత్కరించారు.సీతంపేట శివాలయం సమీపంలో ఉన్న శ్రీ రామాలయం ఆవరణలో జరిగిన కళ్యాణం లో పాల్గొని, భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. స్థానిక యువత ఉమేష్, హేము పాల్గొన్నారు.బీచ్ రోడ్ పాండురంగ స్వామి వీధిలో సన్ గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన శ్రీ సీత రాముల కళ్యాణం లో పాల్గొని, పూజలు జరిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ ని ఘనంగా సత్కరించారుఈ సందర్భంగా వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ నగర ప్రజలకు శ్రీ రామ నవమి శుభాకాంక్షలు తెలిపారు.

# పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గింపు

- ప్రజలపై భారం తగ్గించడంలో మోదీ దృఢ సంకల్పం
- చంద్రబాబు మద్దతుతో ప్రజా సంక్షేమానికి పెద్దపీట
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు



**అమరావతి/ విశాఖపట్నం , మార్చి 27:(మనం న్యూస్):** పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతిస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలపై భారం తగ్గించేలా ధైర్యవంతమైన నిర్ణయాలు తీసుకోవడం ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా సంక్షేమ నిబద్ధతకు, దూరదృష్టి నాయకత్వానికి స్పష్టమైన నిదర్శనమని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరల ఒత్తిడి పెరుగుతున్న సమయంలో అనేక దేశాలు ఆ భారం ప్రజలపై మోపుతున్నప్పటికీ, భారత్ మాత్రం ప్రజా ప్రయోజనాలను ముందుంచి ఉపశమనం కలిగించే నిర్ణయం తీసుకోవడం ఎన్డీయే ప్రభుత్వ ప్రజాకేంద్రిత పాలననుప్రతిబింబిస్తోందన్నారు. సవాళ్ల సమయంలో నాయకత్వం అసలైన శక్తి బయటపడుతుందని, అలాంటి సందర్భాల్లో మోదీ నిర్ణయాలు దేశానికి స్థిరత్వం, విశ్వాసం తీసుకువస్తున్నాయన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని పల్లా ప్రశంసిస్తూ, ప్రజల సంక్షేమం, ఆర్థిక సమతుల్యతను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లగల దూరదృష్టి, పరిపాలనా అనుభవం ఆయనదేనన్నారు. కేంద్రం తీసుకున్న ప్రజా అనుకూల నిర్ణయాలను వెంటనే స్వాగతిస్తూ, రాష్ట్ర ప్రజలకు గరిష్ట ప్రయోజనం చేకూరేలా స్పందించడం చంద్రబాబు సమర్థ నాయకత్వానికి నిదర్శనమన్నారు.కేంద్ర-రాష్ట్ర సమన్వయంతో ప్రజలపై భారం తగ్గిస్తూ, అభివృద్ధి సంక్షేమం రెండింటినీ సమతుల్యంగా అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం నిజమైన ప్రజా ప్రభుత్వమని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ప్రజల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చే ఎన్డీయే ప్రభుత్వ పరిపాలన దేశానికి మార్గదర్శకంగా నిలుస్తోందనీ పల్లా తెలిపారు.

# ఓలా ఎలక్ట్రిక్ ఎండ్ ఐస్ ఏజ్




- **క్యాంపెయిన్ ప్రారంభం**

**విజయవాడ:** కేటగిరీలో అగ్రగామి ఉత్పత్తులు, విప్లవాత్మక ధరలు మరియు హామీతో కూడిన యాజమాన్య అనుభవాన్ని కలపడం ద్వారా భారతదేశం యొక్క ఎలక్ట్రిక్ మొబిలిటీ పరివర్తనను వేగవంతం చేయడానికి ఒక నిర్ణయాత్మక ముందడుగుగా, ఓలా ఎలక్ట్రిక్ ఈరోజు తన ఎండ్ ఆఫ్ డిపెండెన్సి ఇంటర్నల్ కంబ్యూషన్ ఇంజన్ ఏజ్ (ఎండ్ ఐస్ ఏజ్)క్యాంపెయిన్ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ క్యాంపెయిన్లో భాగంగా, కంపెనీ తన జెన్ 3 ఎస్1 ఎక్స్ (2 కే డబ్ల్యూ హెచ్ ) మరియు రోడ్స్టర్ ఎక్స్ (2.5 కే డబ్ల్యూ హెచ్) మోడళ్లను కేవలం రూ. 49,999 కే అందిస్తోంది. దీనితో పాటు, పోర్ట్‌ఫోలియో అంతటా రూ. 50,000 వరకు ప్రయోజనాలు కూడా లభిస్తున్నాయి. ఇది కేవలం 31 మార్చి 2026 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. దీనితో, ముఖ్యంగా ఇంధన ధరలు నిరంతరం పెరుగుతున్న తరుణంలో, ఓలా భారతీయ వినియోగదారులకు ఎలక్ట్రిక్ వాహనాలను అత్యంత ఆకర్షణీయమైన ఎంపికగా మారుస్తోంది.

**హామీతో కూడిన యాజమాన్య అనుభవం:**

ఈ క్యాంపెయిన్లో భాగంగా, ఓలా స్పష్టమైన, వినియోగదారు-కేంద్రీకృత యాజమాన్య హామీలను అందిస్తోంది. ప్రస్తుతం 80 శాతం కంటే ఎక్కువ సర్వీస్లను అదే రోజున పరిష్కరిస్తున్న ఈ కంపెనీ, నిర్దేశిత సమయానికి మించి ఏవైనా సర్వీస్ ఆలస్యాలు జరిగితే ఉచిత ఓలా క్యాబ్ వోచర్లను అందించడం ద్వారా నిరంతరాయ ప్రయాణ సౌకర్యం పట్ల తన నిబద్ధతను మరింత బలోపేతం చేస్తోంది. 60 శాతం వరకు హామీతో కూడిన బైబ్యాక్ విలువ, ఇది మనశ్శాంతిని మరియు భవిష్యత్తులో సులభమైన అప్గ్రేడ్ను అందిస్తుంది. తమ ఎస్ 1 స్కూటర్లు మరియు రోడ్స్టర్ మోటార్సైకిళ్ల పోర్ట్‌ఫోలియో అంతటా ఇప్పుడు 8 సంవత్సరాల పొడిగించిన వారంటీ ప్రామాణికంగా లభిస్తుందని ఓలా ఎలక్ట్రిక్ ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ భవిష్ అగర్వాల్ తెలిపారు. చమురు సంక్షోభం ప్రతి భారతీయుడికి ఇంధన భద్రతపై మళ్లీ స్పష్టమైన దృష్టిని తీసుకువచ్చింది, మరియు పెరుగుతున్న ఇంధన ధరలు మనం ఇంధన స్వాతంత్ర్యం వైపు మన ప్రయాణాన్ని ఎందుకు వేగవంతం చేయాలో స్పష్టంగా గుర్తు చేస్తున్నాయన్నారు. ఎండ్ ఐస్ ఏజ్‌తో, మేము ఇప్పుడు తిరిగి వృద్ధి వైపు మళ్లుతున్నామని చెప్పారు.

# కనుల విందుగా సీతారాముల కళ్యాణం



- **చింతూరులో భక్తి పరవశం**

**(చింతూరు, మనం న్యూస్) మార్చి 27:** శ్రీరామచంద్రుడు తన తండ్రి మాటను అనుసరించి అరణ్యవాస సమయములో ఈ ప్రాంతంలో నడయాడిన పవిత్ర భూమి శబరి నది తీరాం ఈ చింతూరు ప్రాంతం. భద్రాచలానికి అతి సమీపంలో చింతూరులో ని శ్రీ శ్రీ కోదండ రామాలయం లో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా, కనుల విందుగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు.అలంకరించిన శ్రీ రాముడు, సీతమ్మ, లక్ష్మణుల విగ్రహాలు కళ్యాణ వేదికపై ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్థానిక గిరిజనుల సహకారంతో ఏర్పాట్లు అద్భుతంగా జరిగి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించారు. మధ్యాహ్నం 12 గంటల అభిషిక్త లగ్నంలో మంగళ వాయిద్యాల నడుమ మంగళధారణ, తలంబ్రాలు కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలో స్థానిక ఎస్ఐ రమేష్ దంపతులు ప్రత్యేకంగా పాల్గొని కళ్యాణాన్ని జరిపించడం విశేషంగా నిలిచింది. కళ్యాణం అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర ప్రసాదం అందజేయగా, పట్టణంలోని వ్యాపారులు బెల్లం పానకం పంపిణీ చేసి భక్తి భావాన్ని చాటుకున్నారు. పవిత్ర శబరి నది తీరాన వెలసిన ఈ ప్రాంతం రామాయణ కాలానికి చెందినదిగా భావించబడుతూ, చింతూరు ప్రాంతానికి ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను తీసుకొచ్చింది. మేళతాళాల మధ్య, మంగళ వాయిద్యాల నడుమ సాగిన సీతారాముల కళ్యాణం భక్తులను పరవశింపజేసి, చింతూరు ప్రాంతాన్ని ఆధ్యాత్మికోత్సాహంతో నింపింది.

# శ్రీవారి ఆలయంలో ఘనంగా శ్రీరామనవమి ఆస్థానం

**తిరుమల,మార్చి 27,మనం న్యూస్:** తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం శ్రీరామనవమి ఆస్థానాన్ని పురస్కరించుకొని సాయంత్రం 6.30 నుండి 8 గంటల వరకు శ్రీరాములవారు తన భక్తుడైన హనుమంతునిపై తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. హనుమంత వాహనం - భగవత్ భక్తి ప్రాప్తి హనుమంతుడు భగవత్ భక్తులలో అగ్రగణ్యుడు. రామాయణంలో మారుతి స్థానం అద్వితీయం. చతుర్వేద నిష్ణాతుడుగా, నవవ్యాకరణ పండితుడుగా,



లంకాభీకరుడిగా ప్రసిద్ధుడైన ఆంజనేయుడు వేంకటాద్రివాసుని మూపున వహించి తిరువీధులలో దర్శనమివ్వడం భక్తులను ఆనందపరవశులను చేసింది. గురు శిష్యులై శ్రీరామ హనుమంతులు తత్త్వ వివేచనగావించిన మహనీయుడు కనుక వాహ్య వాహకరూపంలో ఈ ఇరువురినీ చూసిన వారికి వేదాలతత్త్వం ఒనగూరుతుంది. శ్రీరామనవమి ఆస్థానం అనంతరం రాత్రి 9 నుండి 10 గంటల నడుమ బంగారువాకిలి చెంత శ్రీరామనవమి ఆస్థానాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళి కృష్ణ, జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# టీమిండియాలోకి వైభవ్



వరల్డ్ క్లాస్ బౌలర్లను సైతం తన బ్యాటింగ్తో వణికిస్తున్న ఈ బిహార్ ఆటగాడు.. 27 మార్చి 2026న తన 15వ పుట్టిన రోజును జరపునకున్నాడు. దీంతో వైభవ్ అంతర్జాతీయ క్రికెట్ లో అరంగేట్రం చేసేందేకు అర్హత సాధించాడు. ఐసీసీ నిబంధనల ప్రకారం.. ఒక ఆటగాడు అంతర్జాతీయ క్రికెట్ ఆడాలంటే కనీసం 15 ఏళ్లు నిండి ఉండాలి. ఇప్పుడు సరిగ్గా ఐపీఎల్ 2026 ప్రారంభానికి ఒక్క రోజు ముందే తన 15వ ఏటలోకి అడుగుపెట్టాడు. దీంతో సీనియర్ జట్టు తరుపున ఆడేందుకు ఎలాంటి అడ్డంకులు లేవు.

వైభవ్ జోరు కొనసాగుతుందా?

తన అరంగేట్ర ఐపీఎల్ సీజన్ లో దుమ్ములేపిన వైభవ్ ఇప్పుడు.. ఐపీఎల్ 2026లో ఎలా రాణిస్తాడో అని అందరూ అతృతగా ఎదురు చూస్తున్నారు. గత సీజన్ లో వైభవ్ తన ఆడిన తొలి బంతినే సిక్సర్ గా మలిచాడు. అది కూడా శార్ధూల్ ఠాకూర్ వంటి సీనియర్ బౌలర్ బౌలింగ్ లో కావడం గమనార్హం.

ఆ తర్వాత గుజరాత్ టైటాన్స్ తో 35 బంతుల్లోనే సెంచరీ బాదిన వైభవ్.. ఐపీఎల్ చరిత్రలో శతక్కొట్టిన అతి పిన్న వయష్కుడిగా రికార్డులెక్కాడు. అనంతరం అండర్-19 ప్రపంచకప్ లోనై ఈ యువ సంచలనం సత్తాచాటాడు. ఇంగ్లండ్ తో జరిగిన ఫైనల్లో భారీ సెంచరీ వైభవ్(175) చెలరేగాడు. ఇప్పుడు అదే జోరును ఈ ఏడాది ఐపీఎల్ లో కొనసాగించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

డేంజర్ లో సచిన్ రికార్డు!

భారత్ తరపున అంతర్జాతీయ క్రికెట్ లో అరంగేట్రం చేసిన అత్యంత పిన్నవయష్కుడిగా రికార్డు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కలిగి ఉన్నాడు. సచిన్ 16 ఏళ్ల 205 రోజుల్లో టీమిండియా తరపున డెబ్యూ చేశాడు. ఇప్పుడు ఈ క్రికెట్ దేవుడు రికార్డు డేంజర్ లో పడింది. వైభవ్ సూర్యవంశీ ఈ ఏడాది జూన్ లో ఐర్లాండ్ తో జరగనున్న టీ20 సిరీస్ కు ఎంపిక చేసే అవకాశముంది. ఐపీఎల్ తర్వాత టీమిండియా రెండు టీ20ల సిరీస్ కోసం ఐర్లాండ్ పర్యటనకు వెళ్లనుంది.

అనంతరం అక్కడ నుంచి ఇంగ్లండ్ టూర్ కు మెన్ ఇన్ బ్లూ వెళ్లనుంది. అయితే టీమిండియా బిజీ షెడ్యూల్ కారణంగా ఐరీష్ టూర్ కు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ వంటి ప్లేయర్లకు విశ్రాంతి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. దీంతో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి భారత సీనియర్ జట్టు నుంచి పిలుపు వచ్చే ఛాన్స్ ఉందని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఇదే జరిగితే భారత్ తరపున అంతర్జాతీయ అరంగేట్రం చేసిన అతి పిన్న వయష్కుడిగా వైభవ్ చరిత్ర సృష్టించనున్నాడు. ఒకవేళ ఐర్లాండ్ టూర్ కు ఎంపిక కాకపోయినా.. ఈ ఏడాది ఆఖరిలో జరిగే ఏషియన్ గేమ్స్ లోనైనా అతడు భారత్ తరపున డెబ్యూ చేసే ఛాన్స్ ఉంది.

## టీమ్ఇండియా షెడ్యూల్..

### హైదరాబాద్‌లో రెండు మ్యాచ్‌లు

### 2026-27 షెడ్యూల్ ప్రకటించిన బీసీసీఐ




2026-27 సీజన్ లో సొంతగడ్డపై జరిగే అంతర్జాతీయ మ్యాచ్ ల షెడ్యూల్ ను గురువారం బీసీసీఐ ప్రకటించింది. రానున్న సీజన్ లో వెస్టిండీస్, శ్రీలంక, జింబాబ్వే, ఆస్ట్రేలియా జట్లు భారత్ లో పర్యటించనున్నాయి. ఈ పర్యటనల్లో భారత్ 17 నగరాల్లో 22 మ్యాచ్ లు ఆడనుంది. అందులో 5 టెస్టులు, 9 వన్డేలు, 8 టీ20లు ఉన్నాయి. హైదరాబాద్ లోని ఉప్పల్ స్టేడియం రెండు మ్యాచ్ లకు ఆతిథ్యమివ్వనుంది. ఈ ఏడాది సెప్టెంబరు 27న వెస్టిండీస్ పర్యటనతో స్వదేశీ సీజన్ ప్రారంభమవుతుంది. ఈ సిరీస్లో మూడు వన్డేలు.. అయిదు టీ20ల్లో భారత్, విండీస్ తలపడతాయి.

అక్టోబరు 14న ఉప్పల్ స్టేడియంలో నాలుగో టీ20 జరగనుంది. మిగతా మ్యాచ్ లకు వరుసగా త్రివేండ్రం, గువాహటి, చండీగఢ్, లఖ్ నవూ, రాంచి, ఇండోర్, బెంగళూరు వేదికలుగా నిలవనున్నాయి. డిసెంబరు 13 నుంచి 27 వరకు శ్రీలంకతో మూడేసి వన్డేలు, టీ20లకు వరుసగా దిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్, రాజ్ కోట్, కటక్, పుణె ఆతిథ్యమివ్వనున్నాయి.. 2027 జనవరి 3న మొదలయ్యే జింబాబ్వేతో మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ ను వరుసగా కోల్ కతా, హైదరాబాద్ (జనవరి 6న), ముంబయిలలో నిర్వహించనున్నారు. 2027 జనవరి 21న బోర్డర్- గావస్కర్ ట్రోఫీ ప్రారంభమవుతుంది. ఈ సిరీస్ లో అయిదు టెస్టు మ్యాచ్ లకు నాగ్ పుర్, చెన్నై, గువాహటి, రాంచి, అహ్మదాబాద్ వేదికలుగా నిలువనున్నాయి. గత కొంతకాలంగా కీలక మ్యాచ్ లకు ఆతిథ్యమిస్తున్న విశాఖపట్నానికి 2026-27 సీజన్ లో ఒక్కటి కూడా కేటాయించలేదు.



# పొడగంటి మయ్యా నిన్ను పురుషోత్తమ మోషన్ పోస్టర్

కొలచెల డ్రీమ్ వరక్స్ పతాకంపై యతీంద్ర, రమ్య దినేష్ జంటగా రూపొందుతున్న సరికొత్త చిత్రం పొడగంటి మయ్యా నిన్ను పురుషోత్తమ. ఏ. ఫణీంద్ర దర్శకత్వంలో సురేఖ కొలచెల నిర్మిస్తున్న ఈ సినిమా మోషన్ పోస్టర్ ను శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పలువురు సినీ ప్రముఖులు విడుదల చేశారు. కామెడీ డ్రామా మరియు థ్రిల్లర్ అంశాల కలయికతో ఈ చిత్రం ప్రేక్షకులను అలరించనుంది.

ఒక్క రాత్రిలో, ఒక హాస్పిటల్ నేపథ్యంలో జరిగే ఉత్కంఠభరిత కథాంశంతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇందులో హీరో యతీంద్ర విభిన్నమైన బ్రాహ్మణ గెటప్ లో కనిపిస్తుండటం విశేషం. కథలో ఉండే మలుపులు, హాస్యం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేసింది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ 15వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. అమలాపురం మరియు దాని పరిసర ప్రాంతాల్లో దాదాపు 40 రోజుల పాటు సింగిల్ షెడ్యూల్ లో చిత్రీకరణ పూర్తి చేయాలని నిర్మాతలు ప్రణాళిక సిద్ధం చేశారు. విలక్షణమైన టైటిల్ తో వస్తున్న ఈ చిత్రంపై టాలీవుడ్ లో ఆసక్తి నెలకొంది.



# క్షమాపణలు చెప్పనక్కర్లేదు.. సమంత ఆసక్తికర వ్యాఖ్యలు

సినిమా ఇండస్ట్రీలోనే కాదు అన్ని చోట్ల మహిళలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వృత్తి జీవితంలో సర్దుకొని పోవాల్సి వస్తుంది. చాలా సందర్భాలలో తమ అభిప్రాయాలు, లక్ష్యాలు, ప్లాన్లు అన్నీ ఇతరులకు అనుకూలంగా మార్చుకుంటారని, అది త్యాగమని కూడా భావించకుండా..ముందుకు సాగుతున్నారు' అని స్టార్ హీరోయిన్ సమంత ఆవేదన వ్యక్తం చేసింది. సమాజంలో గుర్తింపు పొందేందుకు పురుషులతో పోలిస్తే మహిళలు మరింత కష్టపడాల్సి వస్తోందని ఆమె అభిప్రాయపడ్డారు. తాజాగా హాలీవుడ్ రిపోర్టర్ సంస్థ నిర్వహించిన ఉమెన్ ఇన్ ఎంటర్టైన్మెంట్ కార్యక్రమంలో సమంత పాల్గొన్నారు.

ఆ అలవాటుని మార్చుకోవాలి

ఈ సందర్భంగా మహిళల స్థితిగతులపై సమంత మాట్లాడుతూ.. 'సమాజంలో ఇతరులు సౌకర్యంగా ఉండటానికి మహిళలు తమ అభిప్రాయాలు, షెడ్యూళ్లను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ ఉంటారు. తమ ఆశయాలను వదులుకుంటూ , ఇతరుల కోసం బతకడం మహిళలకు అలవాటైపోయింది. ఇకనైనా మహిళలు ఈ అలవాటును మార్చుకోవాలి. తమకు తాము విలువ ఇచ్చుకోవడం చాలా అవసరం. సాధించిన విజయాలను గర్వంగా స్వీకరించాలి' అని అన్నారు.

ఆ రోజులు రావాలి

సినిమా ఇండస్ట్రీలో మహిళలు..తగిన గుర్తింపు సంపాదించుకోవడానికి రెట్టింపు కష్టం చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం లేడీ ఓరియంటెడ్ సినిమాలను ఒక రిస్క్ లాగా లేదా ఒక ప్రత్యేక కేటగిరి లాగా చూస్తున్నారు. ఆ రోజులు పోవాలి. వాటిని కూడా డిఫరెంట్ కథలు అని చెప్పుకునే రోజులు రావాలి. తెరపై మహిళలు కేవలం హీరోకి భార్యగానో .. హీరోకి ధైర్యం చెప్పడానికో పరిమితం కాకుండా నిజజీవితంలో ఉండే మహిళల లాగానే క్లిష్టమైన మనస్తత్వంతో ఉండాలి' అని సమంత తెలిపింది.

సారీ..అక్కర్లేదు

పురుషులతో పోలిస్తే.. మహిళలే ఎక్కువ సార్లు క్షమాపణలు కోరుతున్నారు. ఒకే పరిస్థితిలో పురుషుల కంటే మహిళలు దాదాపు పది రెట్లు ఎక్కువ సారీ అంటారని మీకు తెలుసా?, ఇది వారి ఆత్మవిశ్వాసం తగ్గిపోవడానికి ఒక సూచనగా పరిగణించవచ్చు. ప్రతి చిన్న విషయానికి క్షమాపణలు కోరాల్సిన అవసరం లేదు. ఇక చాలు.. మహిళలు ఇలా తమని తాము తగ్గించుకోవడం ఆపాలి. క్రెడిట్ తీసుకోవడం తప్పు కాదు. అంబిషన్ ఉండటం తప్పు కాదు. ఎవరో పొగిడితే సింపుల్ గా థాంక్యూ అనడం అహంకారం కాదు. మీరు కష్టపడి సంపాదించుకున్న గౌరవాన్ని అనుభవించే హక్కు పూర్తిగా మీకు ఉంది' అని సమంత చెప్పుకొచ్చింది.

# నగదు బహుమతిని విరాళమిచ్చిన చిరంజీవి



తనయుడు రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా ప్రముఖ కథానాయకుడు చిరంజీవి సహృదయం చాటుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన ఎన్టీఆర్ జాతీయ పురస్కారం నగదు బహుమతి మొత్తం రూ.10 లక్షలను వివిధ ఫౌండేషన్లకు చిరంజీవి విరాళం ఇచ్చారు. అనాథ వృద్ధులను చేరదీస్తున్న సర్వ్ ఫౌండేషన్, అంధుల కోసం పని చేస్తున్న దేవనార్ ఫౌండేషన్, చిన్నారులను సంరక్షిస్తున్న వాల్మీకి, నయశ్రీ ఫౌండేషన్లతోపాటు బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి విరాళం ఇచ్చారు. ఇటీవల ఓ సినిమా షూటింగ్ లో చరణ్ ను కలిసిన వృద్ధులను ఇప్పుడు చిరంజీవి తన బ్లడ్ బ్యాంక్ కు ఆహ్వానించారు. కొత్తబట్టలు పెట్టి స్వయంగా భోజనం వడ్డించారు.

# జీవితంలో ఈ ముగ్గురిని మర్చిపోకండి: శర్వానంద్



జీవితంలో ముగ్గరిని ఎప్పటికీ మర్చిపోకూడదని నటుడు శర్వానంద్ అన్నారు. 'బైకర్' మూవీతో పలకరించేందుకు సిద్ధమైన ఆయన ఈ చిత్రం ప్రచారంలో భాగంగా ఒక కాలేజ్ ఈవెంట్ కు హాజరయ్యారు. అక్కడ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

''ఇప్పుడిప్పుడే కొంచెం మాట్లాడటం నేర్చుకుంటున్నాను. మీకొక నిజం చెప్తా. లైఫ్ అనేది సినిమా లాంటిది కాదు. జీవితంలో బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ ఉండదు.. కానీ కష్టాలు మాత్రం ఫుల్ సౌండ్ తో ఉంటాయి. నేను బిలో యావరేజ్ స్టూడెంట్ ని. ఎందుకూ పనికిరాను అని అందరూ తిట్టేవాళ్లు. 17 ఏళ్ల వయసులో హీరో అవుతాను అంటే.. ఎవరూ నమ్మలేదు. 'నువ్వు హీరో ఏంటి.. అంత సీన్ లేదు.. ఇండస్ట్రీలో నిలదొక్కుకోలేవు' అని చాలామంది అవమానించారు. కానీ ఈరోజు నేను ఈ స్టేజ్ మీద మాట్లాడగలుగుతున్నా. 23 ఏళ్లుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నా''

''బైకర్' నా కెరీర్ లో 36వ చిత్రం. మనం తలుచుకుంటే ఏదైనా చేయగలం. నిరుత్సాహపరిచేలా ఎవరైనా మాట్లాడితే వారి మాటలు వినొద్దు. మన విజయంతోనే అవమానించిన వారికి సమాధానం చెప్పాలి. జీవితంలో ముగ్గరిని మాత్రం మర్చిపోకండి. మీ కష్టంలో మీతో ఉన్న వాళ్లని, మీరు కష్టంలో ఉన్నప్పుడు వదిలేసిన వాళ్లని, మిమ్మల్ని కష్టంలోకి నెట్టినవాళ్లని ఎప్పటికీ మర్చిపోకండి'' అని శర్వానంద్ చెప్పారు. పక్కవారితో పిల్లల్ని ఎప్పుడూ పోల్చొద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు సపోర్ట్ చేస్తే పిల్లలు ఏదైనా సాధిస్తారని తెలిపారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో శర్వానంద్, మాళవికా నాయర్ జంటగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'బైకర్' ఏప్రిల్ 3న విడుదల కానున్న విషయం తెలిసిందే.



# కుస్తీ అంటే.. ప్రాణంతో సావుకు ఎదురెళ్లే ఆట..

## పెద్ది నుంచి అదిరిపోయే గ్లింప్స్

ఎప్పుడెప్పుడా అని మెగాఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన 'పెద్ది' గ్లింప్స్ ట్రీట్ వచ్చేసింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ బర్త్ డే సందర్భంగా 'పెద్ది' నుంచి అదిరిపోయే గ్లింప్స్ తో అభిమానులను ఖుషీ చేశారు మేకర్స్. పెద్ది సినిమాలో ఇప్పటివరకు రామ్ చరణ్ క్రికెట్ ఆట ఆడుతాడని అందరూ అనుకున్నారు. కానీ, అంతకు మించి ఈ సినిమా ఉండబోతుందని ఈ గ్లింప్స్ నిరూపించింది.

ఈ సినిమాలో క్రికెట్ తో పాటు కుస్తీ కూడా ఉండబోతుంది. ఇక తాజాగా వచ్చిన గ్లింప్స్ లో రామ్ చరణ్ కండలు తిరిగిన కుస్తీ పెహల్వాన్ గా దర్శనమిచ్చాడు. ఆయన ఫెరోషియస్ లుక్ తో చేతిలో గద పట్టుకుని ఉన్న తీరు అద్భుతంగా కనిపిస్తుంది. రామ్ చరణ్ ను పూర్తిగా కుస్తీ పెహల్వాన్ అవతారంలో బుచ్చిబాబు ప్రెజెంట్ చేసిన తీరు సూపర్. ఈ లుక్లో రామ్ చరణ్ ను చూసిన అభిమానులు థ్రిల్ అవుతున్నారు. ఇక బ్యాక్ గ్రౌండ్ లో వచ్చే డైలాగ్..'కుస్తీ అంటే బంతితో బ్యాట్ కు ఎదురెళ్లే ఆట కాదురా.. ప్రాణంతో సావుకు ఎదురెళ్లే ఆట.. ఇప్పుడు సెప్పు.. ఉంటావా పోతావా..' అనే విలన్ విసిరిన ఛాలెంజ్ కు పెద్ది చెప్పే వన్ లైనర్ పంచ్ డైలాగ్ అదిరిపోయింది. 'సూడబ్బి.. ఆటే నా పొగరు..' అనే రామ్ చరణ్ సమాధానానికి ఆయన్ను ఎలివేట్ చేసిన విజువల్స్ అదిరిపోయాయి. మొత్తానికి పెద్ది సినిమాలో రామ్ చరణ్ కండలు తిరిగిన వస్తాదుగా ప్రేక్షకులను ఎంటర్ టైన్ చేయబోతున్నాడని తేలిపోయింది. ఇక ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా శివ రాజ్ కుమార్, జగపతి బాబు తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను ఏప్రిల్ 30న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

# ఇంట్లో రామ్ చరణ్ ప్రత్యేక హోమం..

మెగా హీరో రామ్ చరణ్ బర్త్ డే వేడుకను గ్రాండ్ గా సెలబ్రేట్ చేసుకుంటున్నారు. మెగా ఫ్యాన్స్ సంతోషంతో అభిమాన హీరో జన్మదిన వేడుకలు జరుపుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని అభిమానులు తమ హీరోకు సోషల్ మీడియా వేదికగా విషెస్ చెబుతున్నారు. తన కుమారుడి బర్త్ డేను పురస్కరించుకుని మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. నిన్ను చూస్తుంటే ఒక తండ్రిగా గర్వంగా ఉందని ట్వీట్ చేశారు.

చెర్రీ బర్త్ డేను మెగా కుటుంబం ఓ పండుగలా నిర్వహిస్తున్నారు. తాజాగా ఇవాళ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఇంట్లోనే ప్రత్యేకంగా హోమం నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులు కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు గ్లోబల్ స్టార్. శ్రీరామనవమి రోజే రామ్ చరణ్ బర్త్ డే రావడంతో మెగా కుటుంబంలో ఆనందం మరింత రెట్టింపైంది. రామ్ చరణ్ హోమం నిర్వహించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది.

ఇక సినిమాల విషయానికొస్తే రామ్ చరణ్ ప్రస్తుతం పెద్ది మూవీలో నటిస్తున్నారు. ఈ సినిమాకు బుచ్చిబాబు సనా దర్శకత్వం వహించారు. ఇవాళ చెర్రీ బర్త్ డే సందర్భంగా పెద్ది గ్లింప్స్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ మూవీలో పహిల్వాన్ గా రామ్ చరణ్ సరికొత్త లుక్ లో కనిపించారు. ఈ రోజు రిలీజైన గ్లింప్స్ మెగా అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. కాగా.. ఈ సినిమా ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.